తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 26.04.2026 | సంపుటి :12 సంచిక : 276 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

















## ఏరోస్పేస్ రంగంలో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి హబ్‌గా

# తీర్చిదిద్దుతాం

- దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్
- ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకుని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు పయనం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ మిగతా 2లో..

ప్రపంచ విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక దిగ్గజాల భాగస్వామ్యాల ద్వారా ఏరోస్పేస్ రంగం అవసరాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలపై తమ ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. అందుకు అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభతో స్కైరూట్ వంటి కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుంటుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతన్నాం. - సీఎం రేవంత్



## 47 మంది మావోయిస్టులు

# లొంగుబాటు

## మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ : డీజీపీ శివధర్ రెడ్డి

- పూర్తిగా నిర్వీర్య స్థితికి దక్షిణ బస్తర్ డివిజన్
- ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం వల్లే పార్టీ కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారు
- గణపతి తదితరులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు
- వారు కూడా త్వరలో జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో పలు బెటాలియన్‌లకు చెందినవారున్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని మిగతా 2లో..

# హైదరాబాద్ మెట్రో నిర్వహణకు కమిటీ ఏర్పాటు



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వ నిర్వహణలోకి రానుంది. ఈక్రమంలో మెట్రో రైలు నిర్వహణకు సీఎస్ రామకృష్ణారావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్వహణకు అధికారులతో డైరెక్టర్స్ మిగతా 2లో..

## తెలంగాణ రాజకీయాల్లో

# కొత్తపార్టీ

## తెలంగాణరాష్ట్ర సేనను ప్రకటించిన కల్వకుంట్ల కవిత

- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- స్వరాష్ట్రం కోసం పోరాడినవారు మోసపోయారు
- మునుపటి కేసీఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- గుంటనక్కలు, తోడేళ్ల మధ్య బందీగా మారిపోయారు
- బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయింది
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం వచ్చా
- గురుకులాల్లో పిల్లలు చనిపోతున్న పట్టింపేదీ
- ముఖ్యమంత్రి రేవంత్ పాలనపై కవిత విమర్శలు
- కొత్త పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటన



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ మిగతా 2లో..

### ఖచ్చితంగా సీఎం అవుతా..

- తెలంగాణలో కొత్త విప్లవం మొదలైంది
- కొత్త పార్టీని ప్రజలు ఆశీర్వదించాలి
- గన్‌పార్క్ వద్ద అమరులకు కవిత నివాళి

### పదేళ్ల కిందటే పార్టీ పెట్టాల్సింది

- అధికారంలో ఉప్పప్పుడు బీఆర్ఎస్ అవినీతిపై కవిత ఎందుకు మౌనంగా ఉన్నారు?
- ఇప్పుడు ఆమెను ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- ముఖ్యమంత్రి రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు
- కవిత కొత్త రాజకీయ పార్టీ ప్రకటనపై స్పందించిన
- కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి

### ఎంతయినా ఒరిజినల్.. ఒరిజినలే..

కవిత కొత్త పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు

2 లో..

### రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి ఇబ్బందిలేదు

కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

## తెలంగాణలో నేటి నుంచి

# సెల్ఫ్ ఎన్యుమరేషన్

- వెబ్‌సైట్ ద్వారా వివరాలు అందచేసే అవకాశం
- కులగణనతో పాటు జనగణన ఈసారి ప్రత్యేకం
- జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి



హైదరాబాద్(జనంసాక్షి): జనగణన-2027లో భాగంగా తెలంగాణలో ఈ నెల 26 నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి తెలిపారు. సెల్ఫ్- ఎన్యుమరేషన్ పక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇది అని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న తొలి జనగణన కూడా ఇదేనని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియాకు వివరించారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి కులగణన జరుగుతుండటం కూడా ఈసారి జనగణనలో ప్రత్యేకమని వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి

## తెలంగాణలో భారీగా

# ఐఏఎస్‌ల బదిలీ


2 లో..

## బీఆర్ఎస్ వదిలేసిన ప్రాజెక్టులను

# పూర్తి చేస్తున్నాం

- ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి మిగతా 2లో..







## అజారుద్దీన్, కోదండరామ్‌లకు

# ఊరట

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

### ఇద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ శివప్రతాప్ శుక్లా సంతకం

హైదరాబాద్(జనంసాక్షి):గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మిగతా 2లో..

## మమత, మోదీ

# ఇద్దరూ ఒక్కటే..

## ఒకరు రాష్ట్రాన్ని..మరోకరు దేశాన్ని నాశనం చేస్తున్నారు: రాహుల్



కోల్‌కతా(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరూ అధికారం కోసం ఆరాటపడుతూ.. దేశ సంపదను ధనికులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తన చర్యలతో మమత బెంగాల్‌ను నాశనం చేస్తే.. మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్నది ఎన్నికల పోరాటం కాదని.. సిద్ధాంతాల పోరాటమని అన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ఐక్యత-సౌభ్రాతృత్వం. .మరోవైపు భాజపా-ఆర్ఎస్ఎస్‌ల ద్వేషం-హింస మధ్య పోరాటం జరుగుతోందన్నారు. హుగ్లీ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భక్తుడిని అని చెప్పుకుంటూ ప్రధాని మోదీ దేశాన్ని అమ్ముకుంటున్నారని రాహుల్ మండిపడ్డారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో ద్వేషాన్ని, భయాన్ని వ్యాపింపజేస్తారన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు అన్ని రాష్ట్రాలు లోబడి ఉండాలని భాజపా యత్నిస్తోందన్నారు. ఆ పార్టీ పేదల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. ధనికుల లబ్ధి కోసమే పని చేస్తుందన్నారు. మిగతా 2లో..

# దిగ్బంధంలోనే హర్మూజ్

## ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపేవరకు ప్రక్రియ కొనసాగుతుంది : అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్



వాషింగ్టన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిపై నియంత్రణను మరింత కాలం పొడిగిస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. ఇది శాశ్వత దిగ్బంధనంగా మారే అవకాశమూ ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామన్నారు. తమ అనుమతి లేకుండా హర్మూజ్‌లోకి ఏ రవాణా నౌక రాదని.. బయటకు వెళ్లదని పీట్ హెగ్సెత్ అన్నారు. జలసంధిలోని నౌకలపై దాడులు చేస్తూ.. టెహ్రాన్ సముద్రపు దొంగల మాదిరిగా ప్రవర్తిస్తోందన్నారు. తన చర్యలతో సముద్ర భద్రతను అస్థిరపరుస్తోందని ఆరోపించారు. తమ దిగ్బంధనం గల్ఫ్ దాటి విస్తరిస్తోందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని కాపాడడానికి తాము ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో హెగ్సెత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు హర్మూజ్ దిగ్బంధనం ప్రారంభమైనప్పటినుంచి 34 నౌకలను వెనక్కి పంపినట్లు మిగతా 9లో..

## అమెరికా ప్రతినిధులు చర్చలకు

# పాక్ వెళ్లొద్దు

- ఫలితంలేని సంప్రదింపుల కోసం అంతదూరం వెళ్లనక్కర్లేదు
- ట్రంప్ ఆదేశం.. మలివిడత చర్చలకు బ్రేక్

2 లో..

## ఈసారి అమెరికాతో

# నేరుగా మాట్లాడేది లేదు

### మలివిడత చర్చలపై తేల్చిచెప్పిన ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ వేదికగా మలివిడత చర్చలు నేడు జరగనున్నాయి. ఇందుకోసం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ నేతృత్వంలోని బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. అయితే, తొలిదశ చర్చల మాదిరిగా ఈసారి రెండు దేశాల ప్రతినిధుల మధ్య నేరుగా చర్చలు జరగబోవట. ఈ విషయాన్ని టెహ్రాన్ తాజాగా వెల్లడించింది. "ఇరాన్ అమెరికా ప్రతినిధుల మధ్య ప్రత్యక్ష భేటీకి ఎలాంటి ప్రణాళికలు లేవు. దానికి బదులుగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సందేశాలను పాక్ అధికారులు బదిలీ చేస్తారు. అరాగ్చీ బృందం పాక్ ఉన్నతాధికారులతోనే సమావేశమవుతుంది. అగ్రరాజ్యానికి మేం చెప్పాలనుకున్న మిగతా 9లో..

# సీఎం రేవంత్‌తో పోలీస్ అధికారుల భేటీ

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఐసీసీసీలో సీనియర్ పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. డీజీపీ ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ భాగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ లు కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వీరికి డిజిలుగా ప్రమోషన్లు ఇచ్చింది. దీంతో వీరు సిఎం కలిసారు.**



# తెలంగాణలో నేటి నుంచి సెల్ఫ్-ఎన్యుమరేషన్

ఇంటినీ లెక్కిస్తామని భారతీ హోళికెరి అన్నారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దెభవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందన్నారు. ‘ భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. 2027 ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తాం. రెండో దశలో 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తాం. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారు. ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారని ఆమె పేర్కొన్నారు.

## ఏరోస్పేస్ రంగంలో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి హబ్‌గా

# తీర్చిదిద్దుతాం

25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉంది.. పూర్తిగా కార్బన్-÷బైర్ బాడీ రాకెట్. కార్బన్ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.



# భయంతో కాదు.. బలవంతంగానే బయటకు వచ్చాం

- ఎంపీ రాఘవ్ చద్దా
- కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చాక అవినీతిలో కూరుకుపోయారు
- అవన్నీ తప్పుడు ప్రచారాలు: ఆప్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భాజపాలో చేరిన ఎంపీ రాఘవ్ చద్దా ఆమ్‌ఆద్మీపార్టీని వీడటంపై మరోసారి స్పందించారు. తనతోపాటు మరో ఆరుగురు ఎంపీలు భయంతో పార్టీని వీడలేదని, కేజ్రీవాల్ విధానాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం ఆ పార్టీ సరైన మార్గంలో వెళ్లడం లేదని ఆరోపించారు.“ అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలు, నేతలు పార్టీని వీడారు. మరికొందరు విడిచిపెట్టే ప్రక్రియలో ఉన్నారు. అందులో ఉండటానికీ ఎవరూ ఇష్టపడటం లేదు. భయం వల్ల పార్టీని వీడలేదు. నిరాశ, నిస్పృహ, అసహ్యం వల్లే బయటకు వచ్చాం. శీష్ మహల్ (అద్దాల మేడ) కారణంగా ఆమ్‌ఆద్మీ ప్రతిష్ఠ దెబ్బతింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ప్రధాన కారణం అదే. ఎన్నికలు జరిగి ఏడాది లోపే శీష్ మహల్ పార్ట్ 2 వచ్చేసింది” అని రాఘవ్ చద్దా విమర్శించారు. అవినీతిపరులు, రాజీపడిన వారి చేతుల్లోకి ఆ పార్టీ వెళ్లిపోయిందని ఇటీవల బయటకు వచ్చిన ఎంపీలందరూ భావిస్తున్నట్లు చెప్పారు. దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆ పార్టీ పనిచేస్తోందని రాఘవ్ అంతకుముందు ఆరోపించారు. తాను వారి నేరాల్లో భాగం కావాలని అనుకోవడం లేదని, సరైన పార్టీలో ఉన్న భావన తనలో లేదన్నారు.దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై ఎంపీ స్వాతి మాలీవాల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు నిజాయితీగా ఉన్న ఆయన అధికారంలోకి వచ్చాక అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు. 2011లో దిల్లీలో తాము అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టిన సమయంలో.. ఆయన చిరిగిన దుస్తులు వేసుకునేవారని..రెండు రూపాయల పెన్ను వాడుతూ.. పూర్తిగా పాడుబడిన కారులో తిరిగేవారని గుర్తుచేశారు. దేశంలోని వ్యవస్థల్లో మార్పు తెస్తారనే నమ్మకంతో తామంతా కేజ్రీవాల్ వెనుక నడిచామన్నారు. అయితే సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత.. రూ.100 కోట్లతో విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నారని దుయ్యబట్టారు. పార్టీని వీడినందుకు అందరూ తమను ద్రోహులుగా భావిస్తున్నారని..కానీ అసలైన ప్రజా ద్రోహి కేజ్రీవాలేనని ఆమె మండిపడ్డారు. 2006 నుంచి తాను అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి పని చేశానని.. ప్రతి ఉద్యమంలోనూ ఆయనకు మద్దతిచ్చానని తెలిపారు. అయినప్పటికీ కేజ్రీవాల్ నివాసంలోనే ఆయన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌తో తనను తీవ్రంగా కొట్టించారన్నారు. దిల్లీలో ఆప్ ఓటమి తర్వాత వారి అవినీతి పంజాబ్‌కు పాకిందన్నారు. తాను ఎవరి బలవంతం మీదనో భాజపాలో చేరలేదని.. ప్రధాని మోదీ నాయకత్వంపై ఉన్న నమ్మకంతోనే చేరానని స్పష్టం చేశారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నూతన నివాసం ఫొటోలుగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఫొటోలు నకిలీవని ఆమ్‌ఆద్మీ పేర్కొంది.

## ఆప్ సరైన రీతిలో నడవకనే ఈ దుస్థితి

**ఎంపిలు పార్టీ వీడడంపై అన్నాహజారే స్పందన**

రాలెగావ్(జనంసాక్షి):ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దాతో పాటు మరో ఆరు మంది రాజ్యసభ ఎంపీలు ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఆప్‌కు గుడ్‌బై చెప్పిన ఆ ఎంపీలు బీజేపీలో చేరారు. అయితే ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త హన్నా హజారా మాట్లాడారు. ఒకవేళ ఆమ్ ఆద్మీ పార్టీ సరైన మార్గంలో పయనిస్తే, బహుశా రాఘవ్ చద్దాతో పాటు ఇతర ఎంపీలు కూడా పార్టీని వీడేవారు కాదు అని అన్నాహజారే అన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయము, టీజీఈడబ్ల్యూఐడీసీ,
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
షార్టుటెండరు నోటీసు నం.02/ఈఈ/టీజీఈడబ్ల్యూఐడీసీ/ఎండికే/నిట్/ 38 - 140 /2026-27, తేది: 25.04.2026
సిద్ధిపేట జిల్లా నిట్ నం. 38 నుండి 51, సిద్దిపేట జిల్లాలో ఎస్‌సీడీడీ హాస్టళ్లకు అత్యవసర మరమ్మతులు చేయుట. సంగారెడ్డి జిల్లా నిట్ నం. 52 - 62 సంగారెడ్డి జిల్లాలో ఎస్‌సీడీడీ హాస్టళ్లకు మరమ్మతులు చేయుట. నిట్ నం. 63 - 68 హత్నూర( గ్రా& మం)లో డాక్టర్ బీఆర్ఏసీటీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/జేసీకు డ్రైన్‌ను నిర్మించుట. మెదక్‌జిల్లా: నిట్ నం. 64 - 68 మెదక్‌జిల్లాలో ఎస్‌సీడీడీ హాస్టళ్లకు మరమ్మతులు చేయుట. నిట్ నం. 69-140 సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట జిల్లాలో రూ. 1.10 లక్షల చొప్పున పీఎం ఎస్‌హెచ్ఆర్ఐ కింద రేయిన్ హార్వేస్టింగ్ నిర్మించుట. నోట్: నిట్ నం. 42,45,49,52,60,61,62,65లు ఎస్‌సీ/ఎస్టీ మరియు వడ్డెర లేబర్ సొసైటీలకు మాత్రమే రిజర్వ్ చేయబడినవి. ఆన్‌లైన్ బిడ్ దాఖలుకు చివరి తేది: 02.05.2026 మ॥ 2 గం॥ల వరకు. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in ,డిపార్ట్‌మెంట్ పేరు: టీజీఈడబ్ల్యూఐడీసీ, సర్కిల్/ డివిజన్: ఈఈ కార్యాలయము, మెదక్, లేదా కార్యాలయ పనివేళలలో అని పనిదినములలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు, టీజీఈడబ్ల్యూఐడీసీ , మొదటి అంతస్థు, నార్త్-వెస్ట్ బ్లాక్,సమీకృత కలెక్టర్ కార్యాలయము, సంగారెడ్డి, మెదక్ డివిజన్, సంగారెడ్డి, సంప్రదించవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టీజీఈడబ్ల్యూఐడీసీ, మెదక్ డివిజన్,సంగారెడ్డి
DIPR No.1463-PP/CL/ADVT/2026-27

# 47 మంది మావోయిస్టులు లొంగుబాటు



కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

# మే9న తెలంగాణకు మోడీ

హైదరాబాద్(జనంసాక్షి):
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్త యిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది. ముఖ్యంగా ఎంఎంటిఎస్ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.

## హైదరాబాద్ మెట్రో నిర్వహణకు కమిటీ ఏర్పాటు

బోర్డు ఏర్పాటు చేసింది. దీనికి ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్‌కు, జాయింట్ ఎండీగా శివేంద్ర ప్రతాప్‌కు బాధ్యతలు అప్పగించారు.

## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

## మమత, మోదీ ఇద్దరూ ఒక్కటే..

కాంగ్రెస్ హయాంలో సామాన్యుల పురోభివృద్ధి కోసం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి అస్తవ్యస్తం చేస్తోందన్నారు.

## అమెరికా ప్రతినిధులు చర్చలకు పాక్ వెళ్లొద్దు

వాషింగ్టన్(జనంసాక్షి): ఇరాన్‌తో రెండో విడత చర్చల కోసం అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్‌కు వెళ్లన ున్నట్లు వైట్ హౌస్ వర్గాలు తొలుత ప్రకటించాయి. దీంతో పాక్‌కు బయలుదేరేందుకు సిద్ధమవుతోన్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. చర్చల కోసం తమ బృందాన్ని పాక్‌కు వెళ్లొద్దని ఆదేశించినట్లు వెల్లడించారు. అమెరికా మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఫలితం లేని చర్చల కోసం అంతదూరం వెళ్లవద్దని తమ బృందానికి చెప్పానని అన్నారు. అయితే, వాళు (ఇరాన్) ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడి తాజా ప్రకటనతో పాక్‌లో రెండో విడత చర్చలకు బ్రేక్ పడినట్లయ్యింది .అంతకుముందు.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ బృందం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఉన్నతాధికారులతో సమావేశమైంది.ఈ భేటీలో పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ సహా పలువురు ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.అయితే, అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం కూడా సుముఖత వ్యక్తం చేయలేదు. అమెరికా ప్రతినిధులతో ప్రత్యక్ష భేటీకి ఎలాంటి ప్రణాళికలు లేవని ముందుగానే పేర్కొంది. ఈ క్రమంలోనే తమ బృందాన్ని కూడా పాక్‌కు వెళ్లొద్దంటూ ట్రంప్ ఆదేశించడం గమనార్హం.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

**హైదరాబాద్(జనంసాక్షి):**
ఔతెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు చేపట్టారు. పలువురు అధికారులను బదిలీ చేయగా.. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇచ్చారు. ఈ మేరకు శనివారం రాత్రి సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ భవన్ ప్రత్యేక అధికారిగా సంజయ్ కుమార్‌ను నియమించారు. ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శిగా ప్రావీణ్య, పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శిగా దాన కిషోర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కృష్ణాఆదిత్య, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బి.ఎం.సంతోష్, ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా అభిలాష అభినవ్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా జి.వి.శ్యామ్‌ప్రసాద్ లాల్ నియమితులయ్యారు.

## పదేళ్ల కిందటే పార్టీ పెట్టాల్సింది

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చుని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

## ఎంతయినా ఒరిజినల్ ..ఒరిజినలే .

అసలు ఒరిజినలే లేదుగా అంటూ టిఆర్ఎస్ ప్రతిదాడి

హైదరాబాద్(జనంసాక్షి):కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు.

# తెలంగాణ రాజకీయాల్లో కొత్తపార్టీ

సభలో పార్టీ పేరును కవిత ప్రకటిం చారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసం గిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నా రు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడు కున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలం గాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకా రులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగా ణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వా మ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగా ణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలం గాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి..

ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి.

**గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ**

గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్ అని కల్వకుంట్ల కవిత అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు ‘తెలంగాణ రాష్ట్ర సేన‘గా ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో మర్చిపోలేని రోజుగా అభివర్ణించారు. ‘నేను అమ్మవారి భక్తురాలిని. నాకు సింగరేణి చాలా ఇష్టం. మీకంటే ఆడబిడ్డలంటే మరింత ఇష్టం. రాష్ట్రంలో అంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా తెలంగాణ జాగృతి ఎంతో కీలకంగా పనిచేసింది. బతుకమ్మ పాట వచ్చాక మన సంస్కృతికి ఊపిరి వచ్చింది. ఏమేమి కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో ఆ కలలో నిజం కాలేదు. కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదు. బానిస సంకెళ్లు తెగుతాయనుకుంటే రైతులకు బేడీలు ఉద్యమకారులకు కేసులు వచ్చాయి. ఆనాడు పాలించిన కుటుంబంలో నేను ఒకదాన్ని. నాడు జరిగిన తప్పులకు క్షమించమని కోరుతున్నా. తెలంగాణ ప్రజల కలల సాకారం కోసం తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావించింది. రేపటి నుంచి చూస్తారు మా పని ఎలా ఉంటుందో మా పోరాటం ఎలా ఉంటుందో.‘ అని కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఆ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్నారు. అమ్మతనంతో పాలన సాగిస్తే ప్రజల కష్టాలు తెలుస్తాయని.. అనేకమంది తెలంగాణ రాష్ట్ర వచ్చిందన్నారు.నన్ను బయటకు పంపి.. పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం. రెండేళ్ల తర్వాత మనమే అధికార పక్షం అవుతాం‘ అని కవిత వ్యాఖ్యానించారు.

**రాష్ట్రంలో కర్కోటకుడి పాలన**

ఇది ప్రారంభం మాత్రమే, ఇన్‌ఫ్రంట్ దేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్ అని కొతత్గా టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని.. ఒక రాజకీయ నేతను అలా అనకూడదు.. కానీ, అనాల్సి వస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం మాట్లాడట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు.

**ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా..**

ఖచ్చితంగా ముఖ్యమంత్రి అయ్యి తీరుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో కొత్త విప్లవం మొదలైందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా.. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేశారు. ఆవిర్భావ సభకు ర్యాలీగా వెళు_న్న కవితను మీడియా ప్రశ్నించగా.. ఈ మేరకు సమాధానమిచ్చారు. అంతకుముందు ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత.. తన భర్త, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గన్‌పార్కు వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి మునీరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరారు.

## ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి ఇబ్బందిలేదు

హైదరాబాద్(జనంసాక్షి): కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. ‘గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. ‘విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.

## అనవసరంగా నన్ను వివాదంలోకి లాగారు: నరవణె

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె రచించిన ‘ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ’ పుస్తకంపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. దీనిపై నరవణె తాజాగా స్పందించారు. తన పుస్తకం ఇంకా పబ్లిష్ కాకపోయినా, అనవసరంగా తనను ఈ వివాదంలోకి లాగారంటూ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నరవణె రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. నరవణె రచించిన మరో పుస్తకం ‘ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ అన్‌ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్’ ఇటీవల విడుదలైంది. ఈ క్రమంలోనే ఆయన పీటీఐతో మాట్లాడుతూ.. “ఈ మధ్య జరిగిన నా పుస్తకం వివాదం తర్వాత రెండు పుస్తకాలు రాశాను. వాటిల్లో ఒకటి విడుదలైంది. మరోటి త్వరలో రానుంది. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీని పూర్తిగా పరిశీలించేవరకు ప్రచురణను నిలిపివేయమని రక్షణ మంత్రిత్వశాఖ కోరింది. ఆ విషయం అక్కడితో ముగిసింది. నేను ముందుకెళ్లాను.. నా వరకు అది ముగిసిపోయిన అధ్యాయం. కానీ ప్రచురితం కాని పుస్తకాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కొందరు దానిపై తీవ్ర చర్చలు చేశారు. దీనివల్ల పుస్తకంతో పాటు నన్నూ ఈ వివాదంలోకి లాగినట్టే కదా. అది ఏమాత్రం సమంజసం కాదు” అని రాహుల్‌గాంధీని ఉద్దేశించి పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద అంశాలను ప్రస్తావిస్తూ నరవణె రాసిన ఈ పుస్తకానికి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ప్రచురణ అనుమతి లభించలేదు. అయినప్పటికీ అప్పట్లో దీన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభకు తీసుకువెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పుస్తకాన్ని ప్రధానికి అందిస్తానంటూ రాహుల్ పేర్కొన్నారు.

# సమగ్ర క్రీడాభివృద్ధికి సహకరించాలి

**రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** క్రీడల అభివృద్ధి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పాటు క్రీడా సంఘాలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేస్తే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మూడు రోజులపాటు శ్రీనగర్‌లో జరుగుతున్న చింతన్ శిబిరానికి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి( క్రీడలు) జయేశ్ రంజన్, క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్ కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాకిటి శ్రీహరి దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేసి దేశానికి కీర్తి తెచ్చే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ఒకవైపు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తూనే, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే అనేక కార్యక్రమాలను బ్రహ్మాండంగా నిర్వహిస్తుందన్నారు. హైదరాబాద్ అంటేనే ఆటలకు మారుపేరుగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ అనేక వినూత్నకార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడా ప్రతిభను గుర్తించి అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో రెండు దఫాలుగా నిర్వహించిన సీఎం కప్ గెలిచామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా కార్యక్రమాలను, జాతీయ క్రీడా దినోత్సవాన్ని సండే ఆన్ సైక్లింగ్ ఒలంపిక్స్ విజేతలను గుర్తించే కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తుందని వివరించారు.

# 15 గంటలు చర్చించి సమ్మె విరమించేలా చేశాం

- చారిత్రాత్మక నిర్ణయంపై కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు చేయాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆర్టీసీ కార్మికుల సమస్యలు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమించేలా చేశామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకే ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ క్యాడర్ మొత్తం ఇన్వాల్వ్ అయి సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికార ప్రతినిధులతో మంత్రి పొన్నం జూమ్ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లన్నీ పరిష్కరించేందుకు అంగీకరించామని తెలిపారు. విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం లో 55 రోజుల సమ్మె చేసి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అప్పుడు 30 మందికి పైగా మరణించారని గుర్తుచేశారు. కార్మికులతో తమకు శతృత్వం లేదని.. వారు తమ కుటుంబ సభ్యుల వంటి వారని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బండి సంజయ్ శవ రాజకీయాలు చేయడం సరైంది కాదని.. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు వ్యవహరించిన తీరు మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి ఆర్టీసీ సమ్మె విరమణ పై ప్రభుత్వ తీసుకున్న చొరవపై కాంగ్రెస్ పార్టీ సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఎజెండాగా తీసుకొని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికార ప్రతినిధులు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. మనం ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం ప్రజల్లోకి వివరించాలని కోరారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు 2013 బాండ్స్, 2017 పీఆర్సీ, డీఏలు ప్రకటన, సీసీఎస్, పీఎఫ్ బకాయిలు చెల్లింపు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుండి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని... పేద ప్రజలు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కోసం ఆర్టీసీ లైఫ్ లైన్ లాగా పని చేస్తున్నదని తెలిపారు.

# ఎన్ని పార్టీలొచ్చినా బీజేపీకి ఇబ్బందేం లేదు

**పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా, కొత్త పార్టీలు పుట్టుకువచ్చినా బీజేపీకి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందని, ప్రధాని మోడీ 12 ఏళ్లుగా అవినీతిరహిత పాలనను అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలామంది పార్టీలు పెడుతున్నారని, ఇప్పుడే ఒకరు పార్టీని ప్రకటించారని, గతంలో కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని ఎద్దేవా చేశారు. గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్ అయిందని, ఇప్పుడు వారి బిడ్డ పెట్టే పార్టీ కూడా టీఆర్ఎస్ అని చురక అంటించారు. దేశంలో అవినీతిరహిత పాలన ఇస్తోంది బీజేపీ మాత్రమే అన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ ఈ శిక్షణలో పార్టీ నిర్మాణం, సిద్ధాంతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సాంకేతిక అభివృద్ధి వంటి ఏడు ప్రధాన అంశాలపై విస్తృతంగా చర్చించామని, జిల్లా స్థాయిలో మరింత లోతుగా చర్చించనున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈరోజు రాజకీయాల్లో మార్పులు వేగంగా జరుగుతున్నాయి. పార్టీలు పెట్టడం సులభమైపోయింది. ప్రజల కోసం నిజంగా పని చేసే పార్టీ ఏది అనేది ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని నిజాయితీగా ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. సీఎం తెలంగాణ నుంచి రూ.1000 కోట్లు ఢిల్లీ కాంగ్రెస్ అధిష్టానానికి పంపిస్తామని చెబుతున్నారు. అందులో కనీసం రూ.500 కోట్లు ఉద్యోగుల సంక్షేమానికి కేటాయించాలనే ఆలోచన ఎందుకు రావడం లేదన్నారు. తెలంగాణ సాధన సమయంలో పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కూడా పూర్తిస్థాయిలో పోరాడలేదు. తెలంగాణ కోసం నిజాయితీగా పోరాడింది బిజెపి ఒకటే అన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల రాకెట్ గుట్టురట్టు

**నలుగురు నిందితుల అరెస్ట్**

**150 నకిలీ విత్తన ప్యాకెట్లు, రూ.60 వేలు స్వాధీనం**



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మేవారిపై నిఘా పెట్టి వారిని అరెస్టు చేశారు. శనివారంబేల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారంగా శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు బేల పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంగిడి గ్రామ శివారులో రోడ్డు ప్రక్కన కొంతమంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో, వెంటనే బేల పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. అనంతరం విత్తనాలు నకిలీవా కాదా అని నిర్ధారించుటకు వ్యవసాయ శాఖ అధికారిని సంఘటనా స్థలానికి పిలిపించి పరిశీలించగా అవి నకిలీవి అని నిర్ధారించబడ్డాయి.తనిఖీలలో నిందితుడు జిట్టావార్ కిషోర్ రెడ్డి అనే వ్యక్తి గుజరాత్‌కు చెందిన 'నరేష్ క్రాప్ సైన్స్' కంపెనీలో కమిషన్ ఏజెంట్‌గా పని చేస్తూ, అదే కంపెనీలో పని చేసే ధర్మేష్ కచ్చడియా అనే వ్యక్తితో కలిసి కుట్ర పన్ని నరేష్ క్రాప్ సైన్స్ కంపెనీ మౌలి-555 తో ఉన్న నిజమైన ప్రత్తి విత్తన ప్యాకెట్ ను మౌలి-5" పేరుతో నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గత రెండు నెలలుగా గుజరాత్ నుండి నవత ట్రాన్స్‌పోర్ట్ ద్వారా సుమారు 4,500 నకిలీ విత్తనాల ప్యాకెట్లు తెప్పించి, అందులో 4,000 ప్యాకెట్లను మహారాష్ట్రలో రక్తావర్ పవన్ ద్వారా మరియు 350 ప్యాకెట్లను నవగరే కునాల్, కుల్దీప్ టాక్రె ద్వారా రైతులకు అసలైన విత్తనాలుగా నమ్మించి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. తనిఖీ సమయంలో సంఘటనా స్థలంలో మిగిలిన 150 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అదేవిధంగా నకిలీ విత్తనాల విక్రయం ద్వారా వచ్చిన రూపాయలు 60,000/- నగదు, నిందితులు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు మరియు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ, పరీక్ష తేదీ, గడువు, ఎమ్మార్పీ వంటి తప్పనిసరి వివరాలు లేకపోవడం గమనించారు. రెండు ప్యాకెట్లను నమూనాలుగా తీసుకొని పరీక్షకు పంపించి, మిగతా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై బేల పోలీస్ స్టేషన్‌లో జతీ. చీశీ. 94/2026 కింద యూ/సెక్షన్ 318 (4), 316, 336, 61 తీ/ష 3(5) బీఎన్ఎస్ సెక్షన్ 7 సీడ్స్ యాక్ట్, 1966 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన బేల సబ్ ఇన్స్పెక్టర్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ సిఐ కె ఫణిదర్, ఎస్సై మధు కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్..

- ఇద్దరిపై కేసు

**భీమదేవరపల్లి, ఏప్రిల్ 25(జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో ఫోర్జరీ ఘటన వెలుగులోకి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ స్టాంప్ ఉపయోగించి డాక్యుమెంట్లు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామానికి చెందిన కనగండ్ల అఖిల్, కనగండ్ల సదానందం ఈ నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ముల్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఫోర్జరీ, మోసం జరిగినట్లు గుర్తించిన పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## బంగారు పుస్తెలతాడు అపహరణ

**గూడూరు, ఏప్రిల్25 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని చక్రుతండ గ్రామ పంచాయతీ పరిధిలోని లకావత్ ద్వాలి వయసు 50సం,,లు.భర్త పిచ్యా,వ్యవసాయం అను ఆమె 24.04.2026 రాత్రి భోజనం ఆమె మిర్చి పంట కాపలాగా మంచం వేసుకొని పడుకున్నది.తెల్లవారుజామున 25.04.2026 ఉదయం సుమారు 01:00 గంటల సమయంలో అనుమానాస్పద శబ్దం వినిపించడంతో లేచి చూడగా,గుర్తుతెలియని వ్యక్తి అక్కడినుండి పారిపోతుండగా గమనించింది.అనంతరం తన మెడలో ఉన్న రెండు వరుసల బంగారు పుస్తెల తాడు గల్లంతైనట్లు గుర్తించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం,ఒక వ్యక్తి పారిపోతుండగా,సమీప రోడ్డుపై మరొక వ్యక్తి ఉండగా ఇద్దరూ కలిసి పరారైనట్లు తెలుస్తోంది.దొంగిలించబడిన బంగారు పుస్తెలతాడు సుమారు 2 తులాలు 5 గ్రాములు బరువుగా అంచనా. ఈ ఘటనపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు. నిందితులను గుర్తించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి,సమీప ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.ప్రజలు రాత్రి సమయంలో అపరిచిత వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

## కుమారుడి గొంతుకోసి చంపి, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

**లక్నో (జనంసాక్షి) :** మద్యం సేవించి ఇంటికి వచ్చిన ఒక వ్యక్తి తన కుటుంబంతో గొడవ పడ్డాడు. ఆ రాత్రివేళ మూడేళ్ల కుమారుడి గొంతుకోసి హత్య చేశాడు. ఆ తర్వాత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ధిమర్‌పురా గ్రామానికి చెందిన 38 ఏళ్ల ప్రేమ్ సింగ్ ఒక పెళ్లికి హాజరయ్యాడు. మద్యం సేవించిన అతడు ఆలస్యంగా ఇంటికి తిరిగి వచ్చాడు.

కాగా, ప్రేమ్ సింగ్ మద్యం సేవించడాన్ని కుటుంబ సభ్యులు నిలదీశారు. ఈ సందర్భంగా తల్లి, భార్యతో అతడు గొడవ పడ్డాడు. అర్ధరాత్రి వేళ తన పిల్లల్లో చిన్నావాడు, ఏకైక కుమారుడైన మూడేళ్ల భరత్‌ను ఎత్తుకుని మరో గదిలోకి తీసుకువెళ్లాడు. కత్తితో ఆ చిన్నారి గొంతుకోసి హత్య చేశాడు. ఆ తర్వాత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరోవైపు మధ్య రాత్రి వేళ మేల్కొన్న భార్య ఆశా తన కుమారుడిని తెచ్చేందుకు ఆ గది వద్దకు వెళ్లింది. లోపల నుంచి గడియపెట్టి ఉండటంతో పలుమార్లు తట్టింది. భర్త నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో కిటికీ నుంచి చూసింది. రక్తం మడుగులో కుమారుడు పడి ఉండగా, ఉరికి వేలాడుతూ భర్త కనిపించాడు. ఇది చూసి ఆమె షాక్ అయ్యింది.

# గిరిజన చట్టాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించకూడదు
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 25(జనంసాక్షి) :** అధికారులు గిరిజన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ హక్కుల, పేసా, ఎల్టీఆర్ చట్టాలపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, పోలీస్, అటవీ, రెవెన్యూ, అధికారులకు గిరిజన చట్టాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం, భూ బదిలీ నియంత్రణ ( ఎల్టీఆర్) చట్టాలపై అధికారులకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి అవగాహనతో చట్టాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ ఏపీవో నాగోరావు, డిఆర్డిఏ పిడి చంద్రశేఖర్, అన్ని మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఫారెస్ట్, పోలీస్ అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాబోయే భర్త కాల యముడయ్యాడు

**బావిలో నెట్టి యువతి హత్య**



**మరిపెడ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో పరిధిలో కాబోయే భర్త కాలయముడై ప్రేమ పేరుతో నమ్మబలికి బావిలో నెట్టి ప్రాణాలు తీసిన కాబోయే భర్త సంచలనం రేపిన యువతి మృతి కేసును పోలీసులు ఛేదించారు. మొదట అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసులో అసలు నిజాలు వెలుగులోకి తీసుకొచ్చిన పోలీసులు, ప్రేమ పేరుతో నమ్మించి కాబోయే భార్యను బావిలోకి నెట్టి హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... మరిపెడ మున్సిపాలిటీ కొత్త తండాకు చెందిన అజ్మీరా అరవింద్ (22) అనే యువకుడు, గిరిపురం హాబిటేషన్ ఇటుకలగడ్డ తండాకు చెందిన భూక్య సంగీతతో గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. రెండు నెలల క్రితం ఇరువురి కుటుంబాల సమక్షంలో నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే ఇటీవల సంగీత ఇతరులతో మాట్లాడుతుందనే అనుమానం అరవింద్‌లో పెరిగింది. దీంతో ఆమెను పెళ్లి చేసుకోనని నిర్ణయించుకున్న నిందితుడు, ఎలాగైనా హత్య చేయాలని ముందుగానే పథకం రచించాడు.

ఈ క్రమంలో తన ఇంటి వద్ద ఎల్లమ్మ పండుగ ఉందని చెప్పి సంగీత తల్లిదండ్రులను కార్యక్రమానికి పిలిపించాడు. యువతి ఒక్కతే ఇంటి వద్ద ఉన్న విషయం తెలుసుకున్న అనంతరం, ఆమెను మాటల్లో పెట్టి బయటకు తీసుకెళ్లాడు. అనంతరం తన బైక్‌పై ఎక్కించుకుని గిరిపురం శివారు రోడ్డు వెంట ఉన్న ఓ బావి వద్దకు తీసుకెళ్లి, మాట్లాడుతున్నట్లు నటిస్తూ వెనుక నుంచి చేతులతో బలంగా నెట్టి బావిలో పడేశాడు. యువతి చనిపోయే వరకు అక్కడే ఉండి, తర్వాత ఎవరికి అనుమానం రాకుండా అక్కడి నుంచి బైక్‌పై వెళ్లిపోయాడు. ఈ ఘటనను ఆత్మహత్యగా అందరూ నమ్మేలా నిందితుడు వ్యవహరించడంతో మొదట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో భాగంగా ఘటన జరిగిన రోజు రాత్రి సంగీతను తండా చివరి వరకు నడుచుకుంటూ రావాలని చెప్పి, అక్కడి నుంచి బైక్‌పై తీసుకెళ్లినట్టు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అదేవిధంగా సంకేతిక పరిజ్ఞానం, కాల్ డేటా, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు అజ్మీరా అరవిందే హత్య చేసినట్టు నిర్ధారణకు వచ్చారు.దీంతో నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. శనివారం అతడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నిబంధనల ప్రకారమే అక్రిడిటేషన్లు

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 25(జనంసాక్షి) :** శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జిఓ ననుసరించి నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా అక్రిడిటేషన్ కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశం లో డిపిఆర్ఓ ఎండి రఫిక్, డిఎంఏసీ కమిటీ సభ్యులు ఎండి షఫీ అహ్మద్, గడ్డం దేవేందర్, బి పృధ్వీరాజ్, బండారి లక్ష్మణ్, ఎండి అబ్దుల్ గఫార్, చుంచు రవి, కే రాజేష్, వద్దకొండ వీరయ్య, బి అశోక్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులను పొట్టన పెట్టుకున్న పాపం కేసీఆర్‌ది

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ హయంలో అనేక మంది ఆర్టీసీ కార్మికులను పొట్టన పెట్టుకున్న పాపం కేసీఆర్‌దని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్ నేతలకు ఏం అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. కార్మికులతో సామరస్య పూర్వంకంగా చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించడం ప్రజాస్వామ్య పాలన లక్షణమని పేర్కొన్నారు. శనివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. '2028లో మెజార్టీ మైనారిటీ మెంబెర్స్‌కి టికెట్స్ ఇస్తాం. మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయాలి. కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మకమైన పార్టీ. అమలు కానీ హామీలు ఇచ్చి మోదీ అధికారంలోకి వచ్చారు. అంబానీ, అదానీ ఆస్తులు అమాం తం పెరిగిపోయాయి. మోదీ ప్రభుత్వంలో పేదవారు పేదవారిగానే ఉన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశాన్ని సమూలంగా చదివారు. తెలంగాణలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగుతోం ది. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాల్లో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి.. మైనారిటీ విభాగాన్ని బలోపే తం చేయాలని ఇర్ఫాన్ అలీకి సూచించాం' అని తెలిపారు.

# కార్మిక అసంతృప్తి అగ్ని పర్వతం చిటపటలు!

**"పరిస్థితులు మారిపోయాయి". "మారిన పరిస్థితులలో ప్రజా పోరాటాలకు అవకాశం లేదు". "భారత రాజ్యాంగ ఛత్రఛాయలో, ప్రజాస్వామిక, చట్టబద్ధ విజ్ఞాపనలూ ఆందోళనలూ మినహా ప్రజలకు మరొక మార్గం లేదు". మహా శక్తిమంతమైన రాజ్యం ఎదుట మంచి బతుకు అనే మాటే తలపెట్టకుండా, కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతూ, బతుకు ఈడ్చడం తప్ప గత్యంతరం లేదు - ఇలా చాలా మంది మేధావులూ, గతంలో ఉజ్వల పోరాటాలు నడిపి ఇప్పుడు అలసిపోయినవాళ్లూ ఎన్ని ప్రవచనాలు చేస్తున్నా, ప్రజలు ఆ మాయమాటలు నమ్మడానికి సిద్ధంగా ఉన్నట్టు లేరు. ఏదో సిద్ధాంతమో, ఎవరో నాయకులో కాదు, సొంత జీవన పరిస్థితులే ప్రజలను పోరాటాలలోకి ఈడుస్తున్నట్టున్నాయి. జీవితమే సమస్యల మయంగా, లోలోపల ఉడుకుతున్న అగ్నిపర్వతంగా ఉన్నప్పుడు, ఎవరు చెప్పినా చెప్పకపోయినా, ఎవరు నాయకత్వం వహించినా వహించకపోయినా ఆ అగ్నిపర్వత విస్ఫోటన చిటపటలు వినబడుతూనే ఉంటాయి.**

ఆ చిటపటలకు తాజా ఉదాహరణగా దేశంలో, ముఖ్యంగా పారిశ్రామిక కార్మిక రంగంలో, ఢిల్లీ చుట్టుపట్ల, హర్యాణా, ఉత్తరప్రదేశ్‌లలో ఏప్రిల్ 1 నుంచి 20 వరకు లెక్క వేసినా కనీసం 30 చిన్నా పెద్దా ఆందోళనలు జరిగాయి. వీటిలో కొన్ని డజన్ల మంది నుంచి కొన్ని వేల మంది దాకా కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వాలు అత్యంత తీవ్రమైన నిర్బంధకాండను ప్రయోగిస్తున్నా కార్మిక ఆందోళనలను అణచివేయలేకపోతున్నాయి. లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు, మూకుమ్మడి అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు, కుట్రకేసులు, ఉద్యోగాల నుంచి తొలగింపులు వంటి నిర్బంధాలు ఒకవైపు, కార్మికులను చీల్చడానికి, భ్రమల్లో ముంచడానికి వేతన సవరణ ప్రకటనలు మరొకవైపు కార్మికుల పోరాట స్ఫూర్తిని అణచలేకపోతున్నాయి.

ఏప్రిల్ 1న హర్యాణాలోని పానిపట్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీలో సమ్మె జరిగింది. ఆరోజే జార్ఖండ్‌లోని రామ్‌గర్‌లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌లో సమ్మె జరిగింది. ఆ రోజే బీహార్‌లోని ఔరంగాబాద్‌లో ఎన్‌టిపిసిలో సమ్మె జరిగింది. ఆ రోజే ఛత్తీస్‌గడ్‌లోని రాయపూర్‌లో అదానీ పవర్ రాయిఖేడా ప్లాంట్‌లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 2న హర్యాణాలోని మానేసర్ ఐఎంటిలో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 4న హర్యాణాలోని మానేసర్‌లో ముంజల్ షోవా లిమిటెడ్‌లో సమ్మె జరిగింది. అక్కడే సత్యం ఆటో కాంపొనెంట్స్‌లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 6న అక్కడే రూప్ పాలిమర్స్ లిమిటెడ్‌లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 7న మానేసర్‌లో రిచా గ్లోబల్ ఎక్స్ పోర్ట్ కు చెందిన వేరువేరు యూనిట్లలో సమ్మె జరిగింది. ఏప్రిల్ 8న మానేసర్ లో మోడలామా ఎక్స్ పోర్ట్స్ లిమిటెడ్‌లో సమ్మె జరిగింది.

ఏప్రిల్ 8-9 తేదీల్లో మానేసర్‌లో కనీసం ఎనిమిది కంపెనీలలో (రికో ఆటో ఇండస్ట్రీస్, సుప్రజిత్ ఇంజనీరింగ్, సైర్మా ఎస్‌జిఎస్ టెక్నాలజీ, ఫోర్జా మెడి ఇండియా ప్రైవేట్ లిమిటే, ఎఫ్ఎ హోమ్ అండ్ అప్పారెల్ ప్రైవేట్ లిమిటెడ్, ఔమోవియో ఇండియా, ప్రికాల్ లిమిటెడ్, సరితా హండా ఎక్స్ పోర్ట్స్) సమ్మె జరిగింది. ఏప్రిల్ 9న ఉత్తరప్రదేశ్ లోని నోయిడాలో రిచా గ్లోబల్ ఎక్స్ పోర్ట్స్ లోనూ, ఇతర గార్మెంట్స్ యూనిట్లలోనూ సమ్మె జరిగింది. ఆ రోజే హర్యాణాలోని ఫరీదాబాద్‌లో భారత్ గేర్స్ లిమిటెడ్‌లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 10న హర్యాణాలోని పానిపట్‌లో గుప్తా స్పిన్నింగ్ మిల్ లో సమ్మె జరిగింది. ఏప్రిల్ 11-12 నాటికి కూడా మానేసర్ లో హోండా, ముంజల్ షోవా, రికో వగైరా కంపెనీలలో సమ్మెలు, ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి.



ఏప్రిల్ 13న నోయిడాలో గార్మెంట్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో అనుబంధ పరిశ్రమలలో ఎన్నో యూనిట్లలో ఒక్కసారిగా వేలాది మంది కార్మికులు సామూహిక నిరసనలు, ధర్నాలు, సమ్మెలు, వీధుల్లో ప్రదర్శనలు వంటి పోరాట రూపాలు ఎంచుకున్నారు. ఆ రోజు నోయిడా వీధుల్లో రహదారుల దిగ్బంధం, పోలీసులతో బాహాబాహీ, హింసాత్మక ఘర్షణలు, వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు కూడా జరిగాయి.

**ఏప్రిల్ 14-16 నాటికి కూడా నోయిడా, మానేసర్ పారిశ్రామిక ప్రాంతాలు సాధారణ నిరసన ప్రదర్శనలతో, మూకుమ్మడి అరెస్టులతో, ఎఫ్ ఐ ఆర్ లతో అట్టుడికిపోతున్నాయి. అప్పటికి రెండు వారాలుగా సాగుతున్న కార్మిక ఆందోళనలను ఒక్క తాటిపైకి తీసుకు వచ్చే సమన్వయ ప్రయత్నాలు, ఏప్రిల్ 16న రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపులు సాగాయి. ఇది రాస్తున్న సమయానికి ఆ రెండు ప్రాంతాలలోనూ ఒకవైపు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పోలీసుల నిర్బంధకాండ, మరొకవైపు కార్మికుల మొక్కవోని పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి.**

ఈ ఇరవై రోజుల పరిణామాలను మొత్తంగా చూస్తే, హెచ్చు స్థాయిలో (కనీసం ముప్పై చోట్ల) కార్ఖానా స్థాయి సమ్మెలు జరగగా, ఒక ప్రాంతంలో విస్తరించిన అన్ని కార్ఖానాలలోనూ సమ్మెలు కనీసం మానేసర్, నోయిడాలలో ఎక్కువగా జరుగుతున్నాయి. అప్పటివరకూ విడివిడిగా ఒక్కొక్క కార్ఖానాలో జరిగిన నిరసన ప్రదర్శనలు, వీధుల్లో సమీకరణలు ప్రత్యేకించి ఏప్రిల్ 9 తర్వాత ఎక్కువయ్యాయి. ఏప్రిల్ 9 తర్వాతనే కార్మికులు మరింత క్రియాశీలంగా మారి యాజమాన్యాల కార్మిక వ్యతిరేక చర్యలనూ, పోలీసుల నిర్బంధాన్నీ ప్రతిఘటించడం కూడా కనబడుతున్నది. పరిశీలకుల అంచనా ప్రకారం ఏప్రిల్ 1 నుంచి 4 వరకు విడివిడిగా, ఆయా కార్ఖానాల్లో, పారిశ్రామిక రంగాల్లో మాత్రమే ప్రారంభమయిన పోరాటపు నిప్పురవ్వలు, ఏప్రిల్ 5-10 కాలానికల్లా ఆ ప్రాంతంలోని అన్ని పరిశ్రమలకూ, అన్ని కార్ఖానాలకూ విస్తరించాయి. నిప్పురవ్వ దావానలమైనట్టుగా ఒక కార్ఖానాలో మొదలైన ఆందోళన వరుసగా మిగిలిన కార్ఖానాలన్నిటికీ కూడా వ్యాపించడం మొదలయింది. మూడో దశలో ఏప్రిల్ 11 నుంచి ఇప్పటిదాకా ఈ కార్మిక ఆందోళన రాష్ట్రం మొత్తానికీ వ్యాపిస్తున్న స్వభావం సంతరించుకుంది.

వ్యవస్థను మారుస్తామని బయల్దేరి, తీవ్రతరమైన దీర్ఘకాలిక పోరాటాలకు దశాబ్దాల పాటు నాయకత్వం వహించిన వారే "మారిన పరిస్థితుల" సాకు చూపి, పోరాటాలు విరమించే వాదనలు వెతుకుతున్నప్పుడు, ఈ కార్మికులు ఇంతగా పోరాట మార్గం చేపట్టడానికి కారణాలు ఏమిటి?

ఈ ఆందోళనలలో ఎక్కువభాగం ఏదో ఒక తేదీన మొదలయినట్టు, విజృంభించినట్టు కనబడుతున్నాయి గాని వాస్తవానికి దశాబ్దాలుగా, సంవత్సరాలుగా కార్మికులలో పేరుకుంటున్న అసంతృప్తి ఈ ఆందోళనకు కారణం. వారి పని పరిస్థితుల్లో, వేతనాలలో పెరుగుతున్న దోపిడీ పీడనలు, కనీస సంక్షేమ చర్యల కోత, కొత్త లేబర్ కోడ్స్ సహాయంతో పని దినాన్ని ఎనిమిది గంటల నుంచి పది, పన్నెండు, పద్నాలుగు గంటలకు పెంచడానికి అనేక యాజమాన్యాలు చేస్తున్న ప్రయత్నాలు, ఓవర్ టైమ్ చెల్లించకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాలను ఉల్లంఘించడం, ఆ సంక్షేమ చట్టాలు వర్తించకుండా చేయడానికి కాం ట్రాక్టు కార్మికులను నియమించుకోవడం, కార్ఖానాలలో ఆధిపత్య శక్తుల పీడన వంటి ఎన్నెన్నో దృశ్య, అదృశ్య కారణాలు ఈ అగ్నిపర్వతాన్ని సృష్టించాయి.



ఇటువంటి సమస్యలు తలెత్తినప్పుడు ఎక్కడికక్కడ కార్ఖానా స్థాయిలో యాజమాన్యాలు కార్మికులతో చర్చల ద్వారా, సంప్రదింపుల ద్వారా, ఇచ్చిపుచ్చుకునే వైఖరి ద్వారా పరిష్కరించవచ్చు. కాని చాలా చోట్ల కార్మికులను పీల్చి పిప్పి చేసే విధానాలు అమలు చేస్తున్న యాజమాన్యాలు కార్మికులతో చర్చలకు అవకాశాలనే మిగల్చలేదు. సొంత సైన్యాలను, గూండాలను ఏర్పాటు చేసుకున్నాయి. కార్మికులను చీలదీసి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నించాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ ఆందోళనలు జరుగుతున్న మూడు రాష్ట్రాల్లోనూ - హర్యాణా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ - ఉన్నది సంఘ్ పరివార్ ప్రభుత్వాలే గనుక యాజమాన్యాలు పోలీసులను ఆశ్రయించాయి, యాజమాన్యాలు అడగకపోయినా ప్రభుత్వాలు పోలీసులను మోహరించాయి. ఈ ప్రాంతాలన్నిటిలోనూ గత మూడు వారాలుగా బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (పాత ఐపీసీ సెక్షన్ 144) అమలులో ఉంది. డజన్లకొద్దీ పరిశ్రమలు, వేలాది కార్మికులు ఉండే చోట నలుగురి కన్నా ఎక్కువ గుమిగూడడం నిషేధం అని ఆంక్షలు విధించడం హాస్యాస్పదం, క్రూరం. అలాగే ఒక్క ఏప్రిల్ 9 ఘర్షణలకు సంబంధించి వందలాది మంది కార్మికులను అరెస్టు చేశారు. దాదాపు అరవై మందిని జుడీషియల్ కస్టడీకి పంపారు. ఏప్రిల్ 14 తర్వాత ఈ అరెస్టుల సంఖ్య ఇంకా పెరిగింది. ఏప్రిల్ 14-20 మధ్య కనీసం 400 మందిని అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపారు. ఆ కేసుల్లో ప్రతి ఒక్క ఎఫ్ఐఆర్ లోనూ కొంతమంది కార్మికుల పేర్లు రాసి, "వేలాది గుర్తు తెలియని వ్యక్తులు" అని చేర్చి, ఇంకా అనేక మంది కార్మికుల మీద కక్ష సాధింపుకు అవకాశాలు తెరిచి పెట్టుకున్నారు. కార్మికవాడల మీద పోలీసులు అర్ధరాత్రులు దాడి చేసి కార్మికులను ఎత్తుకుపోతున్నారు. ఎత్తుకుపోయిన వారిలో కొందరిని ఎక్కడా న్యాయస్థానాలలో హాజరు పరచడం లేదు. అక్రమ నిర్బంధంలో ఉంచి చిత్రహింసలు పెడుతున్నారని అనుమానంగా ఉంది. సమ్మెలో పాల్గొన్నారని అనుమానం ఉన్న కార్మికుల కుటుంబాలను కూడా వేధిస్తున్నారు. నోయిడాలో ఆందోళనలతో సంబంధం ఉందనే ఆరోపణతో లక్నోలో జన్ చేతనా అనే పుస్తకాల దుకాణం నడిపే సుప్రసిద్ధ జర్నలిస్టు, భగత్ సింగ్ సంపూర్ణ రచనల సంపాదకుడు సత్యం వర్మను అరెస్టు చేశారు. మజ్దూర్ బిగుల్ దస్తా కార్యకర్తలను అరెస్టు చేశారు. మరొకవైపు హర్యాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఇప్పుడే మేలుకొన్నట్టుగా వేతన సవరణ ప్రకటనలు చేశాయి. సవరించిన వేతనాలను వెంటనే అమలు చేయాలని పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించాయి. కార్మిక ఆందోళనలు నెలకు రు. 25-30 వేల వేతనాన్ని డిమాండ్ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు రు. 15-19 వేలుగా ఉన్నాయి. అంటే ప్రస్తుతం కార్మికులకు అందుతున్న వేతనాలు ఇంతకన్నా తక్కువగా రు. 12-13 వేలుగా ఉన్నాయంటే ఆ దుర్భర స్థితిని అర్థం చేసుకోవచ్చు.

"మారిన పరిస్థితులు" అనే మాట వాడడం చాలా మందికి అలవాటయింది గనుక, ఈ రెండు పారిశ్రామిక ప్రాంతాల్లో "మారిన పరిస్థితులను" ఒక్కసారి చూడవలసి ఉంది. 1. ప్రస్తుత ఆందోళనలో ప్రధానమైన డిమాండ్ వేతనాల పెంపు. ఇక్కడ ఇప్పటికీ కార్మికుల సగటు వేతనాలు నెలకు పన్నెండు వేల స్థాయిలో ఉన్నాయి. ఈ వేతనంలో సగం ఇంటి అద్దెకు ఖర్చవుతున్నదని కార్మికులు అంటున్నారు. 2. ప్రస్తుత ఆందోళనలో మరొక డిమాండ్ ఎనిమిది గంటల పనిదినం. నూట నలభై ఏళ్ల కింద, 1886లో షికాగో కార్మికులు రక్తం చిందించి సాధించిన ఎనిమిది గంటల పని దినం ఇప్పుడు మానేసర్, నోయిడా కార్మికుల నినాదంగా ఉందంటే పరిస్థితులు ఎంత మారాయో అర్థం చేసుకోవచ్చు. 3. దాదాపుగా అన్ని పరిశ్రమల్లోనూ కాంట్రాక్టు కార్మికుల సంఖ్య విపరీతంగా ఉంది. ప్రస్తుత ఆందోళనల్లో పెద్ద ఎత్తున సమరశీలంగా పాల్గొంటున్నవారు కాంట్రాక్టు కార్మికులే. 4. కార్మికుల్లో చాలా మంది తాము ఆత్మగౌరవం కోసం, పని స్థలంలో భద్రత కోసం పోరాడుతున్నామని చెప్పడం, మన పరిశ్రమల ఆధునికతకూ, "మారిన పరిస్థితుల"కూ అద్దం పడుతున్నది. 5. చాలా కార్ఖానాల్లో, పరిశ్రమల్లో యూనియన్లే లేవు. యూనియన్ కార్మికుల హక్కు అయినప్పటికీ, పారిశ్రామిక సంస్థలు యూనియన్ ఏర్పాటును అడ్డుకున్నాయి. ప్రస్తుత ఆందోళనల్లో ఎక్కువభాగం యూనియన్ల ద్వారా కాక, కార్మికుల సొంత చొరవతో సాగినవే. కార్మికుల మధ్య దృఢమైన సంఘీభావం, సమన్వయం వ్యక్తమయ్యాయి.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

---

## ఇష్టారాజ్యం!



ఎవరోవస్తారని
ఏదో చేస్తారని
ఎదురుచూసి
మోసపోకుమా!

మహాకవి సందేశం!
మనం విన్నాం
ఎదురుచూస్తూనే ఉన్నాం
మోసపోతూనే ఉన్నాం!

ఇప్పుడేం చెయ్యాలి?
మనకోసం మనమే
ఏదో ఒకటి చెయ్యాలి!
న్యాయం జరిగేదప్పుడే!

ఇంతకీమనల్ని
మోసం చేసేది ఎవరు?

నాయకులా?తప్పుతప్పు
మనంఓట్లేసిగెలిపించాం!

అధికారులాతప్పుతప్పు
మనమేతీసుకెళ్లి
లంచాలిస్తున్నాం!
వాళ్లు ఏం చేస్తారు!

దేవుళ్ళా? తప్పుతప్పు
విగ్రహ పుష్టి
నైవేద్యం నష్టి
అలా అనుకోవద్దు!

మనల్నిమనమేమోసం
చేసుకుంటున్నాం!

ఐకమత్యం లోపం
కులాలుగా విడిపోయాం!
విడదీసింది ఎవరు?
రోజూ పాడే పాటే!
రోజూ చెప్పే పాఠమే!
మ(ను)త విషప్రయోగం!

మనం బానిసలం!
గానుగలం, పీనుగులం!
'హిందూ' అంటూనే
దూరంగా నెట్టేసారు!

పాము తనపిల్లల్ని
తానేతినేస్తుంది!
మనవాళ్లే మనల్ని
అస్పృశ్యుల్నిచేసారు!

ఎవరినో అనుకోవద్దు
మోసంచేసింది ఎవరో
బయటివారు కాదు!
"మనల్ని మనమే"!

'ఓటు'అమ్ముకుంటాం!
'మందు'కులొంగిపోతాం!
మనల్నిమనమే
చంపుకుంటాం కూడా!

అన్యాయంకాదంటే
న్యాయంకూడాకాదు!
దిక్కులేనిపక్షుల్లా
అలా గాలికి వదిలేసారు!

సూద్రులం కదా!
పాదాలనుండి పుట్టాం!
మనల్ని ఫుట్-బాల్
ఆడుకుంటారు!

ఈ'ఆట'కొనసాగుతోంది!
ఆపేవాళ్లెవరు?
అంబేద్కర్ లేడు!
ఇష్టారాజ్యం ఐపోయింది!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

---

## పద్మవ్యూహంలో ఇరాన్.. అమెరికా!

***విరామం వ్యూహాత్మకమా.. లేక అనిశ్చిత రాజకీయమా..!***

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలు ప్రపంచాన్ని మరో భారీ సంఘర్షణ అంచులవైపు నెడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, యుద్ధ హెచ్చరికలు, అదే సమయంలో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగించడం...ఈ విరుద్ధ సంకేతాలు అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. ఒకవైపు కఠిన వ్యాఖ్యలు, మరోవైపు చర్చల ద్వారాలను పూర్తిగా మూసివేయకుండా ఉంచే ప్రయత్నం సాధారణ దౌత్యం కాదు, వ్యూహాత్మకంగా అనిపిస్తున్న గందరగోళం.

**కాల్పుల విరమణ దేనికి సంకేతం...?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించడం యాదృచ్ఛిక నిర్ణయం కాదు. ఇది ప్రత్యర్థిని బలహీనపరచి, చర్చలలో పైచేయి సాధించాలనే పాత వ్యూహానికి తాజా రూపం. ఆర్థిక ఆంక్షలు, సైనిక ఒత్తిడి, దౌత్య నిర్బంధం వంటి పద్ధతులను కలిపి ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేయడం అమెరికా తరచూ అనుసరించే విధానం. కానీ ఈసారి ఇరాన్ నుంచి వచ్చిన ప్రతిస్పందన అమెరికా అంచనాలకు అందని రీతిగా కఠినంగా ఉంది. "ఆంక్షల మధ్య చర్చలు అసాధ్యం" అన్న టెహరాన్ వైఖరి, ఈ వ్యూహానికి ఎదురుదెబ్బగా నిలుస్తోంది.

**ఇరాన్, ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు కీలక దశకు ...**

ఇటీవలి పరిణామాల్లో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కీలక దశకు చేరుకున్నాయి. సిరియా, లెబనాన్ ప్రాంతాల్లో ఇరాన్ అనుబంధ మిలీషియాలపై ఇజ్రాయెల్ దాడులు పెరిగాయి. ముఖ్యంగా లెబనాన్‌లోని హిజ్బుల్లా సంస్థతో ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న కాల్పులు సరిహద్దు ప్రాంతాలను యుద్ధ వాతావరణంలోకి నెడుతున్నాయి. రాకెట్ దాడులు, ప్రతిదాడులు, డ్రోన్ దాడులు ఇప్పుడు రోజువారీ ఘటనలుగా మారుతున్నాయి. ఇది కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగలకుండా, "ప్రాక్సీ వార్"గా విస్తరిస్తోంది. ఇరాన్ నేరుగా యుద్ధంలోకి దిగకపోయినా, తన మిత్ర బలగాల ద్వారా ఒత్తిడి పెంచుతోంది. ఈ విధానం అమెరికాకు మరింత క్లిష్టతను తెచ్చిపెడుతోంది.

**సున్నితమైన యుద్ధ క్షేత్రంగా లెబనాన్...**

లెబనాన్ ప్రస్తుతం అత్యంత సున్నితమైన యుద్ధ క్షేత్రంగా మారింది. హిజ్బుల్లా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఘర్షణలు విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దుల్లో భారీ సైనిక సమీకరణ జరుపుతుండగా, హిజ్బుల్లా తన శక్తిని పెంచుతోంది. ఈ పరిస్థితి పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదాన్ని పెంచుతోంది. లెబనాన్‌లో రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం ఇప్పటికే ఉన్న నేపథ్యంలో ఈ యుద్ధ పరిస్థితులు అక్కడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇది మానవతా సంక్షోభానికి దారితీసే అవకాశముంది.

**పెద్దన్నను వెనక్కు నెడుతున్నవి...**

యుద్ధ నిర్ణయం కేవలం సైనిక అంశం కాదు ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల సమీకరణం. చమురు ధరల పెరుగుదల, ఎన్నికల రాజకీయాలు, దీర్ఘకాల యుద్ధ వ్యయం వంటివన్నీ అమెరికాను తక్షణ యుద్ధం నుంచి వెనక్కి నెట్టాయి. అందుకే కాల్పుల విరమణ పొడిగింపు ద్వారా తిరిగి పుంజుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది. ఇది శాంతి సంకేతం కంటే వ్యూహాత్మక విరామమేననిపిస్తుంది.

**దూరం పాటిస్తున్న యూరప్ దేశాలు..**

ప్రపంచ స్థాయిలో కూడా ఈ సంక్షోభం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యూరప్ దేశాలు ప్రత్యక్ష యుద్ధానికి దూరంగా ఉండాలని చూస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండగా మరో పెద్ద యుద్ధంలో చిక్కుకోవడం యూరప్‌కు భారంగా మారుతుంది. మరోవైపు చైనా, ఇరాన్‌కు ఆర్థిక-దౌత్య మద్దతు అందిస్తూ అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తోంది. గల్ఫ్ దేశాలు కూడా తమ భద్రతా వ్యూహాలను పునఃసమీక్షిస్తున్నాయి. ఒకవైపు అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తూనే, మరోవైపు ఇరాన్‌తో ప్రత్యక్ష ఘర్షణకు దూరంగా ఉండాలని చూస్తున్నాయి. ఈ ద్వంద వైఖరి ప్రాంతీయ సమీకరణాలను మరింత సంక్లిష్టం చేస్తోంది. ఈ సంక్షోభంలో అత్యంత కీలకమైన అంశం హార్ముజ్ జలసంధి. ప్రపంచ చమురు రవాణాలో ప్రధాన ద్వారం అయిన ఈ మార్గం, ఇరాన్ చేతిలో వ్యూహాత్మక ఆయుధంగా మారింది. ఇది మూసివేయబడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవడం ఖాయం. చమురు ధరలు అమాంతం పెరిగి, అనేక దేశాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితి పెరిగింది. ఇంధన ధరల పెరుగుదల, సరఫరా అంతరాయం, ద్రవ్యోల్బణ ఒత్తిడి-ఇవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరో మాంద్య దిశగా నెడుతున్నాయి.

**పొంచి ఉన్న పెను ప్రమాదం...**

ప్రస్తుత పరిస్థితుల్లో మూడు ప్రధాన ప్రమాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిన్న ఘర్షణ పెద్ద యుద్ధంగా మారే ప్రమాదం. హార్ముజ్ మూసివేతతో చమురు సంక్షోభం. లెబనాన్, గాజా, సిరియా ప్రాంతాల్లో ఘర్షణలు విస్తరించడం. ఇవన్నీ కలిపి ప్రపంచ స్థాయిలో భారీ సంక్షోభానికి దారితీయవచ్చు. మొత్తంగా చూస్తే, అమెరికా కాల్పుల విరమణ పొడిగింపు నిర్ణయం శాంతికి సంకేతం కాదు, అనిశ్చితికి సూచికగా అనిపిస్తుంది. యుద్ధం చేయాలా, లేక ఒత్తిడి ద్వారా, చర్చల ద్వారా ముందుకు వెళ్లాలా అన్న సందిగ్ధంలో అమెరికా ఉంది. మరోవైపు ఇరాన్ తన స్థానం నుంచి వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో పశ్చిమాసియా కేవలం ఒక ప్రాంతం కాదు-ప్రపంచ భవితవ్యాన్ని ప్రభావితం చేసే కేంద్రంగా మారింది. చర్చలు పునఃప్రారంభమవుతాయా? లేక యుద్ధం మరింత విస్తరిస్తుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం ఈ పద్మవ్యూహంలో చిక్కుకున్నది కేవలం ఇరాన్ మాత్రమే అనడానికి వీలు లేదు అమెరికాది కూడా అలాంటి పరిస్థితే.

**- ఉదయ్**
DAE, BA, BCJ, MCJ, MPhil., PhD (OU)
సీనియర్ జర్నలిస్ట్, 83676 03197

---

## ప్రజా ప్రతినిధుల-పార్టీ మార్పిళ్ల తీరు పరాకాష్టకు చేరుతోంది!?

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఓటు అత్యంత పవిత్రమైన హక్కు. ఆ ఓటుతో ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ప్రజల ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత వహిస్తారు. అయితే, ఇటీవలి కాలంలో ప్రజా ప్రతినిధుల పార్టీ మార్పిళ్లు (ఫిరాయింపులు) పెరుగుతూ ఉండటం ప్రజాస్వామ్య విలువలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒక పార్టీ తరఫున ఎన్నికై, ఆ తర్వాత స్వార్థ ప్రయోజనాల కోసం మరొక పార్టీలో చేరడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. చట్టపరమైన లొసుగులను ఉపయోగించుకొని అధికారంలో భాగస్వామ్యం కావాలనే తపన ప్రజాస్వామ్య ఆత్మను దెబ్బతీస్తోంది.

**పార్టీ ఫిరాయింపుల చట్టం ఉద్దేశ్యం-వాస్తవం**

భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ పేరా 4(2)లోని నిబంధనల ప్రకారం పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు చట్టం అమల్లోకి వచ్చింది. ముఖ్యంగా రెండు బై మూడు(2/3) వంతు సభ్యులు కలిసి మరో పార్టీలో విలీనం అయితే అది చట్టబద్ధమని పేర్కొనడం జరిగింది. ఈ నిబంధన మొదట రాజకీయ స్థిరత్వం కోసం ఉద్దేశించబడింది.

కానీ వాస్తవంలో ఇదే నిబంధన ఒక పెద్ద లొసుగుగా మారింది. నాయకులు సమూహాలుగా పార్టీ మారడం ద్వారా తమ పదవులను కాపాడుకుంటూ రాజకీయ ప్రయోజనాలను పొందుతున్నారు. వ్యక్తిగత ఫిరాయింపులు తప్పించడానికి రూపొందించిన చట్టం, సమూహ ఫిరాయింపులకు మార్గం చూపుతోంది.

**తెలుగు రాష్ట్రాల్లో పార్టీ మార్పిళ్ల ప్రధాన ఘట్టాలు**

**ఆంధ్రప్రదేశ్‌లో పరిణామాలు**

2019 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితులు భారీగా మారాయి. ప్రతిపక్షంగా నిలిచిన టీడీపీకి చెందిన పలువురు రాజ్యసభ సభ్యులు పార్టీకి రాజీనామా చేసి మరో జాతీయ పార్టీలో విలీనం కావడం ఒక పెద్ద సంఘటనగా నిలిచింది. సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ వంటి నేతలు కలిసి పార్టీ మారడం చట్టబద్ధంగా జరిగినప్పటికీ, రాజకీయ నైతికతపై ప్రశ్నలు లేవనెత్తింది. అదే విధంగా, ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా అధికార పార్టీలో చేరడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్యలు ప్రజల ఓటు విలువను తగ్గించాయి.

**తెలంగాణలో పరిస్థితులు**

తెలంగాణ రాష్ట్రంలో కూడా పార్టీ ఫిరాయింపులు ఒక రాజకీయ సాధనంగా మారాయి. ముఖ్యంగా 2014 తర్వాత పలువురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరడం జరిగింది. కొందరు నాయకులు తమ పదవులను నిలుపుకుంటూ పార్టీ మారడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగింది.

ప్రతిపక్ష బలం తగ్గించేందుకు అధికార పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి హానికరంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది. గతంలో మీరు చేయలేదా? మీరు చేస్తే ఒప్పు- మేము చేస్తే తప్పా అని కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నా సంఘటనలు చూస్తున్నాం..



**జాతీయ స్థాయిలో తాజా ధోరణులు**

ఇటీవలి కాలంలో కొన్ని జాతీయ పార్టీల మధ్య కూడా ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక పార్టీకి చెందిన ఎంపీలు సమూహంగా మరో పార్టీలో విలీనం కావడం, రాజ్యసభలో సంఖ్యాబలం ఆధారంగా చట్టపరమైన రక్షణ పొందడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి.. అదే దారిలో ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ చడ్డా,సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్, స్వాతి మాలీవాల్, హర్భజన్ సింగ్,రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ ఎంపీలు రెండు బై మూడు2/3 వంతుకు పైగా ఉండడంతో పార్టీ పిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధన ప్రకారం ఎగువసభ సభ్యత్వాలను కోల్పోయే ప్రమాదం ఉండదు.

ఈ పరిస్థితులు చూస్తే, పార్టీ మార్పిళ్లు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు కాకుండా రాజకీయ వ్యూహాలుగా మారిపోయాయని అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంపై ప్రభావం ."ఓటు విలువకు భంగం". ప్రజలు ఒక పార్టీ విధానాలను నమ్మి ఓటు వేస్తారు. కానీ ఆ పార్టీకి చెందిన నాయకుడు తర్వాత పార్టీ మారితే, ఆ ఓటు అర్థరహితం అవుతుంది.

**నైతిక విలువల పతనం**

ప్రజా ప్రతినిధులు ప్రజాసేవకులుగా కాకుండా అధికార కేంద్రాల చుట్టూ తిరిగే రాజకీయ నాయకులుగా మారిపోతున్నారు. ఇది రాజకీయాల్లో నైతికతను క్షీణింపజేస్తోంది.

**రాజకీయ అస్థిరత**

- పార్టీ మార్పిళ్లు ప్రభుత్వాల స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. ప్రతిపక్ష బలం తగ్గిపోవడం వల్ల ప్రజాస్వామ్యంలో సమతుల్యత కోల్పోతుంది.

**ప్రజలలో విసుగుదల**

- ఈ తరహా రాజకీయాలు ప్రజల్లో నిరాశను పెంచుతున్నాయి. "ఎవరికో ఓటు వేసినా ప్రయోజనం లేదు" అనే భావన పెరుగుతోంది.

**చట్ట సవరణల అవసరం**

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో కఠినమైన మార్పులు అవసరం.

- రెండు బై మూడు(2/3)వంతు నిబంధనను పునఃసమీక్షించాలి.
- పార్టీ మారిన వెంటనే సభ్యత్వం రద్దు చేసే విధానం తీసుకురావాలి.
- తిరిగి ఎన్నికయ్యే వరకు పదవులు ఇవ్వకూడదు.
- ప్రజాభిప్రాయాన్ని తప్పనిసరిగా పరిగణలోకి తీసుకునే విధానం ఉండాలి.

ఈ మార్పులు అమల్లోకి వస్తే మాత్రమే ఫిరాయింపులను నియంత్రించవచ్చు!.

**రాజకీయ పార్టీల బాధ్యత**

- పార్టీలు కూడా తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహించకుండా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్యలను అరికట్టాలి.
- ప్రతిపక్షాన్ని బలహీనపరచడం కాకుండా, ఆరోగ్యకరమైన రాజకీయ పోటీకి ప్రాధాన్యత ఇవ్వాలి.

**ప్రజల పాత్ర**

- ప్రజలు కూడా తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించాలి.
- పార్టీ మారిన నాయకులను తిరిగి ఎన్నుకోకూడదనే అవగాహన పెంపొందాలి.
- సామాజికంగా, రాజకీయంగా చైతన్యంతో స్పందిస్తేనే మార్పు సాధ్యమవుతుంది.

**ప్రజాస్వామ్య విలువలు..ఉమ్మడి బాధ్యత**

- ప్రజా ప్రతినిధుల పార్టీ మార్పిళ్లు ప్రస్తుతం పరాకాష్టకు చేరుకున్నాయి. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని అధికారంలో భాగస్వామ్యం కావడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోంది.
- ప్రజల విశ్వాసాన్ని గౌరవించడం ప్రతి నాయకుడి ధర్మం కావాలి. ప్రజాసేవే తన అంతిమ కర్తవ్యం అని భావించే నాయకత్వం అవసరం.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పాలకులు, రాజకీయ పార్టీలు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. నైతిక విలువలను కాపాడుతూ, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని అందించడం మనందరి బాధ్యత.



**మేకిరి దామోదర్**
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు

- మెజార్టీ కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయాలు
- ఒక్కో బాటిలు అదనంగా వసూలు

**బంట్వారం, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** బంట్వారం మండలకేంద్రంలో పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారు తోంది. గ్రామాల్లో కిరాణా దుకాణంలేని గల్లీ ఉంటుందేమో కానీ బెల్టు షాపు లేని వీధి లేదు. పాల ప్యాకెట్ దొరకని ఊర్లో కూడా మద్యం కావాల్సినంత దొరుకుతోంది. ఎక్సైజ్ శాఖ కార్యాలయాల బోర్డుల్లో మాత్రం మద్య నిషేద నియంత్రణ శాఖ అని రాసి ఉంటుంది. కానీ వాస్తవంలో అమలు కావడం లేదు. ఉన్నతాధికారులు టార్గెట్లు విధిస్తుండటంతో కిందిస్థాయి అధికారులు మద్యం దుకాణారులను ప్రోత్సహిస్తున్నారు. ఇదిలా ఉండగా వైన్ షాపు యజమానులు నెలనెలా



## అధిక ధరలకు..

ఈ మండలము కర్ణాటక బార్డర్లో ఉండడంవల్ల తండాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబాను కట్టడి చేసిన ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపుల నియంత్రణలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రతి బాటిల్ పై రూ.10 నుంచి రూ.50 వరకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఒకవేళ అధికారుల దాడుల్లో బెల్టు షాపు నిర్వాహకులు పట్టుబడితే సదరు వైన్ షాప్ యజమాని వారికి రక్షణగా నిలుస్తున్నారు. కేసులు కాకుండా మాస్తుకుంటు న్నారు. దీంతో బెల్టు షాపుల నిర్వాహకులు ఎలాంటి భయం లేకుండా యదేర్చగా విక్రయాలు సాగిస్తున్నారు. మామూళ్లు ఇస్తుండటంతో ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరో పణలు ఉన్నాయి. సివిల్ పోలీసులకు సైతం వాటాలు అందుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.. మందుబాబుల కారణంగా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నట్లు తెలిసింది. అయినా అధికారులు బెల్టు షాపుల జోలికి వెళ్లలేదు. జిల్లాలో 586 గ్రామ పంచాయతీలు ఉండగా 900 పైచిలుకు ఆవాస ప్రాంతాలు ఉన్నాయి. ఒక్కో ఆవాస ప్రాంతంలో రెండు నుంచి 12 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు తెలిసింది.

## విచ్చలవిడిగా...

గ్రామాల్లో మద్యం విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారుచే బెల్టు షాపులకు ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. సారాను కట్టిడి చేయడంతో మద్యం అమ్మ కాలు భారీగా పెరిగాయి. మెజార్ట్ కిరాణా దుకా ణాల్లో మద్యం లభిస్తోంది. ఒక్కో ఎక్సైజ్ రాణా పది ధిలో 400 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు అంచనా. జిల్లాలో 50 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2 వేలకు పైగా బెల్టు షాపులు కొనసాగుతున్నట్లు తెలిసింది. దాబాల్లో విక్రయాలు అదనం. మద్యం దుకాణాల్లో గిరాకి 80 శాతం ఉంటే బెల్టు షాపుల్లో 70 శాతం ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీన్ని బట్టి చూస్తే గ్రామాల్లో మద్యం విక్రయాలు ఏ స్థాయిలో ఉన్నయో ఇట్టే తెలిసిపోతుం ది. గతంలో మద్యం మరాణాల్లో రోజుకు రూ.లక్ష అమ్మకాలు జరిగేవి... బెల్టు షాపుల కారణంగా నేడు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు దాటి సేల్స్ ఉంటున్నాయి.

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గెరిగేట్పల్లి గ్రామంలో 800 పైచిలుకు జనాభా ఉంది. గతంలో ఏరు బెల్టు షాపులు ఉండేవి. మద్యం మత్తులో భార్యభర్తలు గొడవలకు దిగటం.. అదే మత్తులో పురుగు మందు సేవించి తునువు చాలించడం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆరు నెలల క్రితం స్థానికులు, గ్రామ పెద్దలు సమావేశమై మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేశారు. ఎవరైనా విక్రయిస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆరునెలలుగా మద్యం అమ్మకాలు బం బంద్ అయ్యాయి . బంట్వారం తొర్మామిడి తట్టెపల్లి భూచన్పల్లి తరహాలోనే మరి కొన్ని గ్రామాలు ముందుకు సాగుతున్నాయి.

పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో రెండు వేల పైచిలుకు జనాభా ఉంది. ఈ గ్రామంలో ఎక్కువ శాతం రైతులు, దినసరి కూలీలు, వ్యవసాయ కార్మికులే ఉంటారు. ఈ గ్రామంలో 12 బెల్లు షాపులు ఉండగా గ్రామస్తులు సంపాదించిన చాల ట్లో ఎక్కువ డబ్బు మద్యానికి తగలేస్తున్నాడు. రోజుకు సగటున ఈ గ్రామంలో రూ.2 లక్షల నుండి 3 లక్షల వరకు గ్రామస్తులు మద్యం కోసం ఖర్చు చేస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. మూడు లక్షల వరకు మద్యం త్రాగుటకై ఖర్చు చేస్తున్నట్లు సమాచారం ఏది ఏమైనా మారుమూల గ్రామీణ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి అంటే వెంటనే ఈ బెల్ట్ షాపులను కట్టడి చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతారని నమ్మకం కలిగి ఆయా గ్రామ ప్రజలు ఉన్నారు.

## ఖానాపూర్ గేట్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి విన్నవించిన నాయకులు



**చేవెళ్ల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** అప్పా జంక్షన్ టు మన్నేగూడ వరకు నేషనల్ హైవే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గేట్, ఇంద్రారెడ్డి నగర్ రస్తా వద్ద ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ శనివారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి నగర్ రస్తా వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపడితే ఈ రోడ్డు గుండా ఖానాపూర్, ఘనాపూర్, కిష్టాపూర్, దేవరంపల్లి, నాంచేరి, ప్రయాణం సాగించే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, లేదంటే ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్య రెడ్డి, నాంచేరి గ్రామ సర్పంచ్ పులుమామిడి అశోక్, గ్రామ నాయకులు జై శంకర్ గౌడ్, సాయిరాం గౌడ్, రాజలింగం గౌడ్, శ్రవణ్ గౌడ్, హర్షవర్ధన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**శివ్వంపేట, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని శభాష్ పల్లి గ్రామాన్ని ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మొదటి విడత లోనే 33 కేటాయించగా ఇప్పటికి 24 ఇండ్లను పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగాయి. ఇంకా కొన్ని ఇందిరమ్మ ఇండ్లు వివిధ స్థాయిల నిర్మాణ దశలో ఉన్నాయి. శనివారం గ్రామానికి చెందిన సోము సాయి బాబా లక్ష్మీ దంపతుల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం తో ఆ ఇంటిని గ్రామ సర్పంచ్ అయ్యగారి యాదగిరితో కలిసి శనివారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అయ్యగారి యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలోనే పేద ప్రజలకు పక్కా ఇండ్లు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణ, వార్డు సభ్యులు లక్ష్మీ, లావణ్య, నవనీత, విజయ్ కుమార్ లతో పాటు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన తెలంగాణ రాష్ట్ర కమిటీ




**ముషీరాబాద్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలు యజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్లోని ఇంద్రపార్క్ వద్ద ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ ఆధ్వర్యంలో విద్యా రంగంలో జరుగుతున్న అన్యాయాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు తల్లారం నరసింహ యాదవ్, ప్రధాన కార్యదర్శి బింగి రాములు లు పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్ ఫీజు లపై తక్షణ నియంత్రణ విధించాలనీ, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేసే స్కూల్ల పై చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించాలని కోరారు. విద్య హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు తమ సమస్యలను బహిరంగంగా వ్యక్తం చేసే వేదికగా పార్టీ నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న లింగన్న, యాదగిరి నాయకులు, లీగల్ అడ్వైజర్ రాజేశం, రాష్ట్ర సెక్రెటరీ జి శంకర్, రాష్ట్ర నాయకులు గువ్వల శివశంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోహిర్ లాజర్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ సింగ్, చంద్రశేఖర్, పార్టీ సాంస్కృతిక విభాగం ఇంచార్జ్ డాక్టర్ సలీం, చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజాంపేట మండలాన్ని రామయంపేట ఏఎల్‌వోలో చేర్చాలి

**నిజాంపేట్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** నిజాంపేట మండల కేంద్రంగా స్థానిక ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అయ్యవారు లక్ష్మణ్,దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారికి వినతి పత్రాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యవారి లక్ష్మణ్ మాట్లాడుతూ గతంలో రామయంపేట మండల పరిధిలో గల నిజాంపేట గ్రామము ఏ ఎల్ ఓ రామయంపేట పరిధిలో ఉండేది, మండలాల విభజనలో భాగంగా నిజాంపేట మండలం అయిన తరుణంలో లేబర్ ఆఫీసర్ ల తప్పిదంతో నిజాంపేట ఏఎల్ఓ ను మెదక్ పరిధిలో కలపడం జరిగింది. అందువల్ల సంఘటిత, అసంఘటిత కార్మికులకు కార్మికుల సమస్యల కోసం నిత్యం మెదక్ 35 కిలోమీటర్లు తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల నిజాంపేట మండలంను రామయంపేట మండల ఏఎల్ఓ పరిధిలో మార్చాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం నిజాంపేట మండలంలోని అన్ని గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయని పనులు చేస్తున్న రెండు



నెలలు గడుస్తున్న పని చేస్తున్న కూలి వేతనాలు అందడం లేదని కూలి వేతనాలు ఇప్పించి పని వద్ద సౌకర్యాలు నీరు, నీడ ప్రథమ చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. నిజాంపేట మండలంలో ఇళ్ల స్థలాలు ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారని వారికి సర్వే నంబర్ 1119లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయించి ఇండ్లు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ఇటిక్యాల, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మునగాల సర్పంచ్ కొప్పుల ప్రభాకర్ రెడ్డి రైతులకు సూచించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని మునగాల గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. రైతులు పండించిన పంటను దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకోకుండా మద్దతు ధరకే ప్రభుత్వం రైతుల నుంచి దాన్యమును కొనుగోలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీ మౌలాలి, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఉపసర్పంచ్ పుణ్యవతి, మహిళా సంఘం సభ్యులు మమత, శారదమ్మ, వార్డు మెంబర్లు రాజ్ కుమార్, రేవతి, రాముడు, మౌలానాబీ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి



**గట్టు, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** గట్టు మండల కేంద్రంలో డబ్ల్యు ఓ ఎం ఓ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ పై అవగాహన సదస్సులో మహిళలు సమాజంలో స్వతంత్రంగా నిలబడాలని, అప్పుడే వారికి నిజమైన సాధికారత లభిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ముసాయిదా బేగం పిలుపునిచ్చారు. శనివారం గట్టు మండల కేంద్రంలో డబ్ల్యు ఓ ఎం ఓఅనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, కిషోర బాలికలకు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, డ్రైవింగ్ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసు, ఎంపీడీఓ చిన్నయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జయభారతి, శ్రీవల్లీ, జానెల్లే పాల్గొన్నారు. వీరితో పాటు ఏపీఎం మారుతి, సీసీలు, ఎంఎస్ ఓబీలు, వీఓఏలు మరియు భారీ సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, కిషోర బాలికలు,మండల మహిళా సమైక్య ప్రతినిధులు వెంకటేశ్వరి అక్షర హాజరయ్యారు. మహిళల ఉపాధి అవకాశాల కోసం డబ్ల్యు ఓ ఎం ఓ సంస్థ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అధికారులు అభినందించారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విజయవంతం

- సీఎం, మంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం



**కోహెడ, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె విజయవంతంగా విరమించిన సందర్భంగా టపాసులు పేల్చి సంబరాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు మంద ధర్మయ్య అధ్యక్షతన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్ర పటాలకు, మంత్రి వర్గానికి కృతజ్ఞతగా పాలాభిషేకం చేశారు. అలాగే టపాసులు పేల్చి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం అని చెప్పారని అన్నారు. అలాగే పీఆర్సీ అమలు చేయించడం వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోహెడ మండల మార్కెట్ చైర్ పర్సన్ బోయిని నిర్మల – జయరాజు, వైస్ చైర్మన్, డైరెక్టర్లు,దేవాలయ డైరెక్టర్, కోహెడ మండల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్, కోహెడ మండల వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి

- మంత్రి వివేక్ వెంకటస్వామి

**నర్సాపూర్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ వెల్దుర్తి రోడ్ లో ఉన్న సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డిల తో కలిసి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపిల్లల పాలిట వరం అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో పటిష్టంగా నిర్వహించడం జరుగుతుందన్నారు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లుల సమస్యలపై తొందరలో ప్రత్యేక సమావేశం ద్వారా చర్యలు చేపడతామన్నారు. ప్రజలందరూ సన్న బియ్యంతో



భోజనం చేయాలనే ఉద్దేశంతో 9,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. రైతులకు సన్న వడ్ల పండించిన వారికి 500 రూపాయల బోనస్ మంజూరు చేయడంతో పాటు రైతు రుణమాఫీ పథకం ద్వారా వారికి ఆర్థిక చేయూతన అందిస్తున్నామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కోసం 9 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం అని అన్నారు. ప్రస్తుత రోజుల్లో అమ్మాయిలు బాగా చదువుకోని అన్ని రంగాలు రాణిస్తున్నారని తెలిపారు. ఈ పథకాన్ని నర్సాపూర్ నియోజకవర్గంలో పటిష్టంగా అమలు పరచాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రజలకు చేరువ చేయడానికి జిల్లాలో సమర్థవంతంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులతో పాటు, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టడం, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పాలనాపరంగా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజ యాదవ్ , గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి




**ఉప్పునుంతల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** అచ్చంపేట నియోజకవర్గంలో ఉప్పునుంతల మండలంలో రైతులు పండించిన పంట మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రత్యేకంగా మండలంలో ఏర్పాటు చేయాలని శనివారం తాసిల్దార్ కార్యాలయంలో నాయబ్ తాసిల్దార్ రమేష్ నాయక్ వినతి పత్రం అందజేయడం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ ఉప్పునుంతల మండల రైతుల సమస్యలు పట్టించుకోని స్పందించి వెంటనే మండలంలో ప్రత్యేక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ అనుబంధం మండల అధ్యక్షులు మాచర్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**శివ్వంపేట, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట తో పాటు మండల పరిధిలోని కొత్తపేట గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, అదేవిధంగా మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామం లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించినప్పుడే సరైన మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు దళారులకు వారి దాన్యాన్ని విక్రయించి, నష్టపోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ మన్సూర్, తహసీల్దార్ కమలాద్రి, ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, సొసైటీ సీఈవో మధు యాదవ్, ఏఈఓ లు వినీత, మౌనిక, సర్పంచ్ లు ఆకుల కుమార్, వెంకటేశ్వర్, గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీ నర్సయ్య, నాయకులు యధాగౌడ్, పెంటాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి శిక్షణతో యువతకు ఉపాధి బాటలు

- గ్రామీణ ప్రాంత యువకులకు ఇదొక సువర్ణ అవకాశం
- రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా కీలక అడుగుగా నిలిచే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని ఈవీఎం గోదాముకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని శుక్రవారం రాత్రి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవితో కలిసి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు విభిన్న రంగాల్లో ఉచిత శిక్షణ అందించనున్నారు., ప్రస్తుత కాలంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని, నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారానే యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం



సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి,మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా కృషి చేసి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా సుమారు 70 రకాల కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతి కోర్సుకు 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, సంవత్సరానికి దాదాపు 167 బ్యాచ్ ల నిరుద్యోగ యువతీ యువకులకు కోర్సులను నిర్వహించనున్నట్లు, వివరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు విభిన్న రంగాల్లో ఉచిత శిక్షణ అందించనున్నారు., ప్రస్తుత కాలంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని, నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారానే యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని, ముఖ్యంగా స్థానిక యువత తమ ఆసక్తులకు అనుగుణంగా వివిధ కోర్సులను ఎంపిక చేసుకుని ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందే అభ్యర్థులు కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణను గ్రహించి, ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలని, ఈ నైపుణ్యాలు భవిష్యత్తులో వారికి ఉపాధి అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అదనంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రంలో సమగ్ర స్కిల్ సర్వే నిర్వహించి, నిరుద్యోగుల నైపుణ్యాలను గుర్తించి, తగిన రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహించబడనుండగా, స్థానిక యువతకు ఇది ఒక సువర్ణావకాశమని, యూనియన్ బ్యాంక్ అధికారులు సీఎస్ఆర్ నిధులతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, జివి శ్యామ్ ప్రసాద్ లాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, యూనియన్ బ్యాంక్ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటిపల్లి గ్రామ పంచాయతీ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సమాజంలో బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన నిబంధనలు, పిల్లల హక్కుల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజేందర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. చిన్న వయసులో వివాహం జరగడం వల్ల పిల్లల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ముఖ్యంగా బాలికల ఆరోగ్యం మరియు మానసిక స్థితిపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. బాల్యం అనేది చదువు, ఎదుగుదల,వ్యక్తిత్వ వికాసానికి కీలక దశ అని,ఆ దశలో వివాహ బంధంలోకి నెట్టడం వారి హక్కుల ఉల్లంఘనతో సమానమని తెలిపారు. అలాగే భారతదేశంలో అమల్లో ఉన్న బాల్యవివాహాల నిరోధక చట్టాల గురించి అవగాహన కల్పిస్తూ, అబ్బాయికి కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలు, అమ్మాయికి 18 సంవత్సరాలు అని గుర్తుచేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు




పాల్గొన్నారు. బాల్యవివాహాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, పిల్లల విద్యను ప్రోత్సహించడం ద్వారా మాత్రమే ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ శ్రీనివాసులు, లక్ష్మన్న స్వామి, సర్పంచ్ శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ శశికళ, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

- జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** రాజీ మార్గమే రాజమార్గమని అందుకు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్లో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులుమాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జూన్ 20న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. లోక్ అదాలకు కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకు జరిగిన మార్చ్ 28వ తేదీన జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించి మొత్తం 5149 కేసులు డిస్పోసల్ చేసి నారాయణపేట డిస్టిక్ 18వ ర్యాంకు స్థానంలో ఉన్నాము అనీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీస్ అధికారులకు అభినందించారు. ఈ




ర్యాంకు రావడానికి కృషిచేసిన పోలీసులు అధికారులు జిల్లా ఎస్పీ శ్రీ వినీత్ కోర్ట్ కానిస్టేబుల్ లను అభినందించారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగాకొనసాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో న్యాయమూ ర్తులు సీనియర్ సివిల్ జడ్జి, సెక్రెటరీ డి ఎల్ ఎస్ ఏ వింధ్య నాయక్, బి.మనోజ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, సుస్మిత జూనియర్స్ సివిల్ జడ్జి అవినాష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, డీఎస్పీ , పోలీస్ సిబ్బంది, ఆర్ అండ్ బి రాములు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రేగోడు గాంధీభవన్ సందర్శించిన మంత్రి

- దామోదర రాజనర్సింహ



**రేగోడు, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర ఉత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేకంగా పూజలకి పాల్గొన్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. అనంతరం రేగోడ్ లోని గాంధీ భవన్ ను రాష్ట్ర మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ సందర్శించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.అనంతరం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ రావు కులకర్ణితో పాటు నాయకులకు,ప్రజలకు ఆప్యాయంగా పలకరించి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి దామోదరను శాలువ పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లేటి రాధా కిషన్, నారాయణ, నాగేందర్రావు కులకర్ణి, మాజీ ఎంపీటీసీ అనిత రామాగౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాల చెరువు రాధా కిషన్, సంగప్ప,కల్లేటి రమేష్, తుల్జారాం,శేఖర్,వడగామ నగేష్,ఎల్ రాజు, రాములు,సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**రేగోడు, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని వైద్యరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం రేగోడు మండల పర్యటన లో భాగంగా రేగోడు మండల కేంద్రంలో లబ్ధిదారుని ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు అందోల్ మహేష్ కుటుంబ సభ్యులతో కలసి గృహ ప్రవేశం చేశారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలు సొంతింటిలో ఆత్మగౌరవంతో బతకాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తూ వారికి సొంత ఇంటి కల ను నెరవేరుస్తున్నామన్నారు. ఇల్లు



లేని పేదలందరికీ దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లుగా మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పర్వీన్ చోటు మియా, సంగ్యా నాయక్, సంగమ్మ జయరాజ్, సక్కుబాయి పిర్యా నాయక్, వట్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కల్లేటి శ్రీధర్ గుప్తా, సంగమేశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**నర్సాపూర్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించే విధంగా విద్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు తీసుకుంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99వ రోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే విధంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రతిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నారాయణపూర్ సర్పంచ్ దేవి సింగ్, కలెక్టర్ ప్రతిమ సింగ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ నాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జనగణన పై విస్తృత ప్రచారం చేపట్టాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** జనగణన - 2027 - స్వీయ లెక్కింపు ప్రజలకు అందుబా టులో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జనగణన 2027 కార్యక్రమం లో భాగంగా, మొదటి దశ అయిన గృహ లెక్కింపు, గృహ వసతి గణన మే11నుండి 9జూన్ వరకు నిర్వహించబడనుందని ఆయన తెలిపారు. దీనికి ముందు, ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు స్వీయ లెక్కింపు https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఈ నెల 26 మే 10వరకు అందుబాటులో ఉంచబడిందని చెప్పారు. జిల్లా



ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కొని, తమ గృహ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి ఇది సులభమైన వేగవంతమైన విధానం అన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చునని నమోదు పూర్తయిన తర్వాత, ఒక యూనిక్ కోడ్ (ఆసీక్నోలెడ్జిమెంట్.ఐడి) పొందవచ్చు. దీన్ని తరువాతి గణనాధికారి కి చూపించవ లెననీ తెలిపారు. స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా గణ ప్రక్రియను వేగవంతం చేయడంలో సహకరించినవారవుతారన్నారు. జిల్లాలోని ప్రజాప్రతిని ధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘా లు, స్వయం సహాయక సంఘాలు , బ్యాంకు ఉద్యోగులు, ఐటీ రంగ ఉద్యోగులు మరియు ఇతర వర్గాల వారు ఈ కార్యక్ర మంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయవలసిం దిగా కోరారు. జిల్లా ప్రజలందరూ స్వీయ లెక్కింపులో తప్పనిసరిగా పాల్గొని జనగణన-2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- 17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మా ణం
- ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**నర్సాపూర్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు 17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు,గనులు, భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో 6, 5 వార్డులలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్లను మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ప్రతిమ సింగ్ ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ లతొ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నర్సాపూర్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ప్రస్తుతం కొన్ని ఇండ్లు పూర్తి అయి ప్రారంభించడం జరిగిందని, మరికొన్ని ఇండ్లు వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు, వచ్చే సంవత్సరం మరో 2500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను 100% పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అర్హత ఉండి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచి ఇల్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తామని మోసం చేసిందన్నారు. అదేవిధంగా నర్సాపూర్ మున్సిపాలిటీ లో 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలని అన్నారు. నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి 15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు



తలెత్తకుండా మున్సిపల్ పాలకవర్గం చైర్మన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ప్రతిరోజు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు. మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ప్రజలతో నిత్యం ఉంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి ,మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ వైస్ చైర్మన్ వనముల బుచ్చేష్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ,కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్, లలిత బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి సహకార సంఘాలే బలమైన పునాది



- రైతు అభివృద్ధికి ముల్కనూర్ సంఘం ఆదర్శం
- ములుకనూరు సంఘాన్ని సందర్శించిన సీఎం ప్రత్యేకాధికారి

**భీమదేవరపల్లి, ఏప్రిల్ 25 (జనం సాక్షి):** మండలంలోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సంఘాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి వేముల శ్రీనివాసులు,రామ్కీ పౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలను పరిశీలిస్తూ సభ్యులకు అందిస్తున్న సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.సంఘ జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి మాట్లాడుతూ రైతులు సభ్యులకు అందిస్తున్న రుణాలు మార్కెటింగ్ సదుపాయాలు,సంక్షేమ కార్యక్రమాల గురించి సమగ్రంగా వివరించారు. సంఘం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రత్యేకాధికారి,ఇలాంటి సహకార సంస్థలు గ్రామీణాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుక నూరు గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సుద్దాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తాపడి బాలుడి మృతి





**పాలకుర్తి, ఏప్రిల్ 25(జనంసాక్షి) :** ట్రాక్టర్ బోల్తాపడి బాలుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని గూడూరులో జరిగింది. ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ... మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన కాసోజు బ్రహ్మాచారి, ఉపేంద్ర దంపతుల ద్వితీయ కుమారుడు సాయి సంగీత్ (15) గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీఉన్నత పాఠశాలలో చదివి పదవ తరగతి పరీక్ష రాశాడు. వేసవి సెలవులు రావడంతో స్నేహితుడు యాదనాల నితిన్ తో కలిసి ట్రాక్టర్ పై స్నేహితుని వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. నితిన్ ట్రాక్టర్ నడుపుతుండగా. సాయి సంగీత్ పక్కన కూర్చున్నాడు. వ్యవసాయ బావి సమీపంలోని ముర్చుగడ్డ తండా వద్ద ఎదురుగా కారు రావడంతో ఆదుర్తపడ్డ బాలుడు కారును తప్పించే క్రమంలో అదుపు తప్పి ట్రాక్టర్ రోడ్డు కింద కందకంలోకి వెళ్లి బోల్తాపడింది. సాయి సంగీత్ అక్కడిక్కడే మృతి చెందగా, అసమయంలో ట్రాక్టర్ నడుపుతున్న నితిన్ బయటకు దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. సరదా కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదం డ్రులు గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బ్రహ్మాచారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

## మలేరియా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలి



- డీఎంహెచ్ఓ డా. కె. మల్లిఖార్జున్ రావు

**జనగామ ప్రతినిధి,ఏప్రిల్ 25(జనంసాక్షి):** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జంగాం జిల్లాలో మలేరియా నివారణ మరియు నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెహ్రూ పార్క్ నుండి బస్ స్టాండ్ ఎక్స్ రోడ్స్ వరకు అవగాహన ర్యాలీ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ ర్యాలీని జిల్లా జెడ్పీ సీఈఓ శ్రీ రంగారావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. మల్లిఖార్జున్ రావు, మున్సిపల్ కమిషనర్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. కె. మల్లిఖార్జున్ రావు మాట్లాడుతూ మలేరియా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, పూర్తిస్థాయి చికిత్స తీసుకోవడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే మలేరియా రహిత భారతదేశం సాధనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ప్రోగ్రాం అధికారులు, యూపీహెచ్‌సీ మరియు బీడీకే వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ నర్సింగ్ పాఠశాల విద్యార్థులు, కళాజాత బృందం మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు మలేరియా నివారణ, లక్షణాలు, అలాగే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచిత పరీక్షలు, చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తూ ప్లకార్డులతో అవగాహన సందేశాలను ప్రజలకు చేరవేశారు.

## మొక్కజొన్న కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలి



- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ (జనంసాక్షి) :** మక్కల కొనుగోళ్ళ ను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మక్కల (మొక్కజొన్నల) కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఎంతమంది రైతులు తమ పంట ఉత్పత్తులను తెచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మక్కలను విక్రయిం చేందుకు అక్కడ ఉన్న రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ మక్కల కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని సూచించారు. సరిపడ గన్నీ సంచులు కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా గోదాముకు తరలించాలన్నారు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజీ, తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల దందాపై ఉక్కుపాదం




- మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 25, (జనంసాక్షి) :** నకిలీ పత్తి విత్తనాల దందాపై ఉక్కుపాదం మోపినట్టు డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మినా, కొన్నా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం బెల్లంపల్లి బెల్లంపల్లిలోని శ్రేయస్ బంకెట్ హాల్లో వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, రెవిన్యూ శాఖ, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్లకు అనదికార, నకిలీ విత్తనాల నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ మాట్లాడుతూ నకిలీ, గ్లైసీల్ పత్తి విత్తనాల కట్టడిలో లైసెన్స్ ఉన్న విత్తన డీలర్స్ పాత్ర కూడా కీలకం అని, వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది కలిసికట్టుగా నిఘా పెట్టి నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. బెల్లంపల్లి వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాన్ని, నకిలీ విత్తనాన్ని ఎలా గుర్తించాలో, నకిలీ విత్తనాలు అమ్మితే ఎలాంటి చట్టపరమైన శిక్షలు పడతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏఓలు, ఏఈఓలు, విత్తన డీలర్లు, మందమర్రి ఏడిఏ, ఏఓ, ఏఈఓలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతుపై 'గన్నీ' సంచుల కొరత!

- సంచుల కొరత కాదు.. ఇది కృత్రిమ సృష్టి!
- అధికారుల నిర్లక్ష్యం.. అడవి బిడ్డల ఆవేదన
- మక్క రైతుపై 'సంచి' వేటు.. గన్నీ పైసలు ఎవరికి..
- సంచి సాగు రైతుది.. కానీ లాభం మాత్రం దళారీదా....?
- 40 క్వింటాల్ పండితే 25 క్వింటాల్ కొంటారా? - మిగిలిన 15 క్వింటాల్ దళారులకా?




**కొత్తగూడ, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అధికారుల తీరు అన్నం పెట్టే అన్నదాత నోరు కొట్టేలా ఉంది. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీ ప్రాంత రైతు బతుకు భారంగా మారింది. గన్నీ సంచులు సరఫరా చేయడంలో విఫలమైన ప్రభుత్వం, సాంకేతిక నిబంధనల పేరుతో రైతులను మానసిక క్షోభకు గురిచేస్తోంది. అధికారుల బాధ్యతారాహిత్యంపై రైతాంగం ఒక్కసారిగా భగ్గుమంది.

**సంచికి 30.. రైతు జేబుకు చిల్లు!**

ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వాల్సిన గన్నీ సంచులు కరువవ్వడంతో రైతులే సొంతంగా కొనుగోలు చేయాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఒక్కో గన్నీ సంచిని రూ 25 నుంచి రూ 30 పెట్టి బయట మార్కెట్లో కొనుగోలు చేసి పంటను నింపుకుంటున్నారు. "మేము పెట్టిన ఈ పైసలు ప్రభుత్వం మాకు తిరిగిస్తుందా...? లేక ఈ డబ్బులు కూడా అధికారుల అక్రమ సంపాదనకు దారి తీస్తాయా...?" అని రైతులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. సంచులు కూడా ఇవ్వలేని స్థితిలో ఈ అధికారులు ఉన్నారా అని ప్రజలు మండిపడుతున్నారు.

**అక్షరాస్యత లోపం శాపమా...? ఏజెన్సీ రైతుపై వివక్ష...!**

ఏజెన్సీ ప్రాంత రైతుల అమాయకత్వాన్ని అధికారులు ఆసరాగా చేసుకుంటున్నారు. అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల ల్యాండ్ రిజిస్ట్రేషన్లు చేసుకోలేని గిరిజన రైతుల కొనుగోలు కేంద్రాల నుండి తరిమివేస్తున్నారు. మండలం మొత్తంలో ఏ రైతు ఎంత సాగు చేశారో, ఎవరి ఆధీనంలో భూమి ఉందో క్షేత్రస్థాయిలో ఉన్న వ్యవసాయ అధికారులకు ఏ ఈ ఓ పూర్తి సమాచారం ఉంటుంది. వారి ధృవీకరణను పరిగణనలోకి తీసుకోకుండా, రిజిస్ట్రేషన్ పత్రాల కోసం పట్టుబట్టడం రైతును ముంచడమేనని స్పష్టమవుతోంది.


**కోటా కుట్ర.. దళారులకు దండీగా లాభాలు...!**

ప్రభుత్వం పెట్టిన 'కోటా' నిబంధన ఇప్పుడు దళారులకు వరంగా మారింది. ఎకరాకు 40 క్వింటాళ్లు పండితే, కేవలం 25 క్వింటాళ్లే కొంటామని, మిగతా 15 క్వింటా లు ఎక్కడైనా అమ్ముకోమని అధికారులు బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతున్నారు.

**సంచులు ఇవ్వడు... కోటా పేరుతో పంటను కొనదు.**

ప్రభుత్వం కొనకపోవడంతో, మద్దతు ధర 2,400 ఉన్న పంటను దళారులకు 1,600కే తెగనమ్ముకోవాల్సి వస్తోంది.క్వింటాలుకు 800 నష్టపోతున్న రైతుకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది...? ఇది ముమ్మాటికీ దళారులను ప్రోత్సహించే కుట్రని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అన్నదాత ఆగ్రహం ఉప్పెనలా మారకముందే ప్రభుత్వం స్పందించాలి. లేనిపక్షంలో గన్నీ సంచులతో కలెక్టరేట్ ముట్టడి తప్పదని రైతు కూలీ సంఘం నాయకులు హెచ్చరిస్తున్నారు.

**భయం గుప్పెట్లో రైతులు....? : అఖిల భారత రైతు కూలీ సంఘం మహబూబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్**



ఆకాశం మేఘావృతమై అకాల వర్షాల భయం పొంచి ఉన్నా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడాలి.?రైతులే కొనుక్కున్న గన్నీ సంచుల డబ్బులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలి.?రిజిస్ట్రేషన్లతో సంబంధం లేకుండా ఏఈఓల ధృవీకరణతో ఏజెన్సీ రైతుల ప్రతి గింజను కొనాలి.?కోటా నిబంధనను ఎత్తివేసి, ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తామని అనే మాటను నిలబెట్టుకోవాలని, పండిన పంట మొత్తానికి మద్దతు ధర కల్పించాలి.

## జనాభా స్వీయ గణనను చేసుకోవాలి

- జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో,ఏప్రిల్25(జనం సాక్షి):** జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులందరూ జనాభా స్వీయ గణనను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జనగణన కార్యక్రమంలో భాగంగా మొదటి దశ అయిన గృహ లెక్కింపు మరియు గృహ వసతి గణన (హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ - హెచ్ఎల్ఓ) 11 మే 2026 నుండి 09 మే 2026 వరకు నిర్వహించబడనుందని తెలిపారు.ఈ ప్రక్రియకు ముందుగా ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు స్వీయ లెక్కింపు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సదుపాయాన్ని https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ గృహ మరియు కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ప్రజలు ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి ఇది సులభమైన మరియు వేగవంతమైన విధానమని అన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత ఒక యూనిక్ కోడ్ (అక్నోలెడ్జిమెంట్ ఐడి) వస్తుందని,దీనిని తదుపరి గణనాధికారి (ఎన్యూమరేట్) కు చూపించాలన్నారు. స్వీయ లెక్కింపులో పాల్గొనడం ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లా ప్రజలందరూ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు స్వీయ లెక్కింపులో తప్పనిసరిగా పాల్గొని జనగణన 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రకటనలో తెలిపారు.

## అయిట్ల సుదర్శన్‌కు డాక్టరేట్ పట్టా ప్రదానం

- తమిళనాడులో వివిధ ప్రముఖులచే గుర్తింపు




**లక్ష్మణ చందా, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన అయిట్ల సుదర్శన్ అతని సేవలను గుర్తించి శనివారం రోజున తమిళనాడులోని హోసూరు పట్టణములో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు నిర్వహించిన కాన్వకేషన్ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వాసి అయిట్ల సుదర్శన్ కు " సోషియల్ సర్వీస్ - పొలిటికల్ సర్వీస్ " అను రంగంపై గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. తమిళనాడు శ్రీ క్షేత్ర ధర్మ ద్వాజ గౌరవ అధ్యక్షులు, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డా. క్రిష్ణ మూర్తి, అమెరికన్ విస్డం పీస్ అకాడమి సెక్రటరీ డా. ఏ. శ్రీధర్, డిఫెన్స్ సీనియర్ సైంటిస్టు, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ సెక్రటరీ డా. కె. ఎస్. సుబ్రహ్మణ్యం, కర్ణాటక హైకోర్టు ప్రముఖ న్యాయవాది, 17 సార్లు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ హోల్డర్ మరియు అసోసియేట్ డైరెక్టర్ ఇన్ సిల్వర్ స్క్రీన్ వరల్డ్ రికార్డ్ ట్రైనర్ డా. అరుణ్ చిన్న దురై, మరియు యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అయిట్ల సుదర్శన్ మాట్లాడుతూ, తాను గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవ చేస్తూ, రాజకీయ రంగంలో కూడా విశిష్ట సేవలు అందిస్తూ ఎంతోమంది పేదలకు అనేక రకాలుగా సేవలు అందించడం జరిగిందన్నారు. తాను చేస్తున్న కృషికి 'ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ' వారు గుర్తించి ఎంతో ఉన్నతమైన, గౌరవప్రదమైన డాక్టరేట్ ను అందించడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఇంతటి గొప్ప అవార్డు రావడానికి సహకరించిన, యూనివర్సిటీ అధికారులకు, మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

**ముందు మరెన్నో ప్రజా సేవలకు సిద్ధం**



నా పేరు అయిట్ల సుదర్శన్, చామనపల్లి గ్రామం, నా భార్య అయిట్ల లక్ష్మి గ్రామ సర్పంచ్, మా సేవలను గుర్తించి ప్రజలు మమ్ములను ఆశీర్వదించి ముందుకు తీసుకువచ్చారు. ప్రజల ఆశీర్వాదమే ఈరోజు నాకు డాక్టరేట్ పట్టాకు ప్రధాన కారణం. చాలా సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మరెన్నో సేవలను అందించడానికి ముందుంటానని తెలుపుతున్నాను.

**-అయిట్ల లక్ష్మి సుదర్శన్ (గ్రామ సర్పంచి), చామన్ పెల్లి గ్రామం**



## రామప్పను సందర్శించిన దూరదర్శన్ డైరెక్టర్ జనరల్

**ములుగు/వెంకటాపూర్,ఏప్రిల్25(జనం సాక్షి):** మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని శనివారం దూరదర్శన్ డైరెక్టర్ జనరల్ ఇంజనీర్ (డిడిజిఈ, ఢిల్లి) అభిషేక్ అగర్వాల్ సందర్శించారు.ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ లు కి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ మండపంలో వారిని ఈవో ఇమ్మడి భాస్కర్ శాలువాలతో సన్మానించారు. ఆలయ చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.వారి వెంట హైదరాబాద్ దూరదర్శన్ డైరెక్టర్ వెంకటరమణ, వి. రమణ,దేవదాయ, పురావస్తు,టూరిజం శాఖల సిబ్బంది, టూరిస్ట్ పోలీసులు ఉన్నారు.

## జీఓ ప్రకారం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ జారీ

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25(జనంసాక్షి ):** జిల్లాలో 252 జీఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అంధ జేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సమావేశానికి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 సవత్సరము నకు గాను కమిటి ఆద్వర్యంలో మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

## రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నిరంతరం పాటు పడుతుందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాల్లోనే వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. భూపాలపల్లి మండలంలోని వేషాలపల్లి, కాసింపల్లి, గొర్లవేడు, వజినపల్లి, నేరేడు పల్లి, గుడాడ్ పల్లి, కొంపల్లి, పుల్లూరి రామయ్య పల్లి గ్రామాలలో పి.ఎ.సి.ఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర రూ.2389లతో పాటుగా బోనస్ 500 రూపాయలు ఇస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత మిషన్ల ఆర్పిఎం 18 నుండి 20 వరకు, బ్లోయర్ ఆన్ లో ఉంచే విధంగా కోత మిషన్ యజమానులకు తెలియజేయాలని, ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు ఉండదని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తి జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, రైతులకు సమయానుకూలంగా డబ్బులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఎస్ఓ, డిఎం, వ్యవసాయ శాఖ అధికారులు, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, టౌన్ ప్రెసిడెంట్, జిల్లా ఆర్టీఏ మెంబర్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలాగే భూపాలపల్లి మండలం గొర్లవేడు గ్రామానికి చెందిన తోట కొమురయ్యకు ప్రభుత్వం వైద్య సహాయ నిమిత్తం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు రూ.1.5 లక్షల చెక్కును శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా అందించి, అండగా నిలిచారు. బడి పిల్లల వేసవి శిక్షణా శిబిరంలో శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. భూపాలపల్లి పట్టణంలోని షెడ్యూల్ కులముల కళాశాల బాలికల వసతి గృహంలో గ్రీష్మోలాసం 2026 వేసవి శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. గణపురం మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. గణపురం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలానికి చెందిన లబ్ధిదారులకు 47 మందికి రూ.47,05,452 ల విలువ గల కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని గణపురం, పరశురాంపల్లి, గొల్లపల్లి, చెల్పూరు, లక్ష్మారెడ్డిపల్లి గ్రామాలలో పి.ఎ.సి.ఎస్, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
26 ఏప్రిల్ 2026

# పాత కేసుల సత్వర పరిష్కారానికి కృషి

- సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యామ సుందర్

**హుజూర్‌నగర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** 10 సంవత్సరాలకు పైగా కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని అవసరమైతే దినసరి వాయిదాలు వేసయినా సరే త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న న్యాయమూర్తులను ఆదేశించినదనీ, అందువల్ల ఆ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని, నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యామ సుందర్ న్యాయవాదులను కోరారు. శనివారం ఆయన సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయపీఠానికి న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి మధ్య మంచి సంబంధాలు ఉన్నప్పుడే కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగుతాయనీ ఆ సహకారాన్ని న్యాయవాదుల నుంచి తను ఆశిస్తున్నానన్నారు. ప్రతి కోర్టులోనూ 1/3 వంతు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారనీ ముగ్గురు చేయవలసిన పనిని ఒక్కరే



చేయవలసి రావడం మూలంగా వారిపై పని ఒత్తిడి భారీగా పెరిగిందనీ దీనిని అర్థం చేసుకొని న్యాయవాదులు వారితో ఘర్షణ పడకుండా సామరస్య పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పాత కేసుల విచారణ సమయంలో న్యాయవాదులు వాయిదాలు తీసుకోవడం మానివేయాలని విచారణకు సిద్ధంగా ఉండి న్యాయ పీఠానికి సహకరించాలని సూచించారు. కోర్టులో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వెంటనే పరిష్కరిస్తానని న్యాయమూర్తి న్యాయవాదులకు హామీ ఇచ్చారు. 2020 వ సంవత్సరం నుండి సివిల్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అంతకు మునుపు ఒక నెలలో రెండు, మూడు దావాలు కోర్టులో దాఖలు అయ్యేవని 2020 తర్వాత ఆ సంఖ్య నెలకు 15 నుంచి 20 వరకు పెరిగిందని దీనంతటికీ కారణం స్థిరాస్తుల విలువ పెరగడమేనన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నారపరాజు శ్రీనివాసరావు, ఆర్ వి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, కుక్కడపు బాలకృష్ణ, అంబటి శ్రీనివాస్ రెడ్డి, నాగేష్ రాథోడ్, కోలా రమాదేవి, సమీనా, జుట్టు కొండ సంధ్య, దీపిక, ధూళిపాల శ్రీనివాసరావు, గొట్టే ప్రశాంత్, బుడిగె నరేష్, చిట్టి పోతుల రమేష్, నాగపాష, సతీష్, ఎంఎస్ రాఘవరావు, మీసాల అంజయ్య, ఏజీపీలు రేణుకాదేవి, సురేష్ నాయక్, పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## వట్టిమర్తి గ్రామంలో లీగల్ మెట్రాలజీ తనిఖీలు

**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** జిల్లాలో తూకాల ఖచ్చితత్వం,వినియోగదారుల రక్షణ కోసం లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు.సిద్ధార్థ కుమార్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, నల్లగొండ జోన్ పర్యవేక్షణలో చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఫెయిర్ ప్రైస్ దుకాణాలు, ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేసే ఏజెన్సీలు, వ్యాపార కేంద్రాలను పరిశీలించారు. తూకాల యంత్రాల కచ్చితత్వాన్ని తనిఖీ చేసి, అనధికార ఎలక్ట్రానిక్ పరికరాలు లేదా చెల్లని ఇండికేటర్లు వాడుతున్నారా అన్నది పరిశీలించారు. అలాగే గృహ వినియోగ గ్యా+ సిలిండర్ల నికర బరువును (14.2 కిలోలు) క్రాస్ చెక్ చేశారు.తనిఖీల సమయంలో ఎటువంటి ఉల్లంఘనలు గుర్తించబడలేదని అధికారులు తెలిపారు. వ్యాపారులు వినియోగించే తూకాల యంత్రాలు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ముద్రతో ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ దాడులు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి వి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. తూకాల్లో మోసం జరిగిందని అనుమానం ఉన్న వినియోగదారులు లీగల్ మెట్రాలజీ శాఖను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు.

## అంతర్రాష్ట్ర అక్రమ ఇసుక రవాణా టిప్పర్ లారీ పట్టివేత



**పెనుబల్లి, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ లారీని శనివారం వి ఎం బంజర్ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వివరాలకు ఎస్ ఐ కె వెంకటేష్ విశ్వసనీయ సమాచారం మేరకు స్టేషన్ కానిస్టేబుళ్లు ఎస్ రాజమల్లు, జి శ్రీనివాస్ లతో వి ఎం బంజర్ రింగ్ సెంటర్లో వాహనాల తనికి నిర్వహిస్తుండగా అదే సమయంలో తిరువూరువైపునుండి అక్రమంగాఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ లారీని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. టిప్పర్ లారీ డ్రైవర్ పసుపులేటి పవన్ కుమార్ ని అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొవ్వూరు నుండి 30 టన్నుల ఇసుకను లోడు చేసుకుని మధ్యవర్తి అయిన ఏలూరు జిల్లా విజయరాయి గ్రామం పెద్దవేగి మండలానికి చెందిన అబ్బూరి రఘు చెప్పిన ప్రకారం వి ఎం బంజర్ లో దిగుమతి చేయడానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని 701మంది లబ్ధిదారులకు రూ.7.02కోట్ల విలువైన కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ ఎండీ షఫీఉల్లా,పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ఆన్‌లైన్ ముసుగులో ఆఫ్‌లైన్ దందా

- బుకింగ్ ఒక దగ్గర డెలివరీ ఇంకో దగ్గర
- తనిఖీ చేసిన నాయబ్ తాసిల్దార్ రమేష్ నాయక్

ఉప్పునుంతల, ఏప్రిల్ 25 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం మన ఇసుక మన వాహనం ద్వారా నిర్వహిస్తున్న ఇసుక రావణలో పేరుకు మాత్రమే ఆన్లైన్ ఆఫ్లైన్లో నడుస్తున్న వాహనాలే ఎక్కువ మండల పరిధిలోని ఉల్పర దుందుభి ఇసుక రీచ్ నుంచి అక్రమంగా నడుస్తున్న ఇసుక వాహనాలను ఉప్పునుంతల నాయబ్ తాసిల్దార్ రమేష్ నాయక్ శనివారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్ బుకింగ్ పెద్దాపూర్ ముల్లర ఉల్పర రీచ్ ల నుండి నడుస్తున్నటువంటి ట్రాక్టర్లను తనిఖీ చేయడం జరిగిందని అందులో ఉల్పర నుంచి ఉప్పునుంతల అదేవిధంగా పెద్దాపురం గ్రామాల వైపు వెళు తున్నటువంటి ఆన్లైన్ బుకింగ్ లేనటువంటి ఆఫ్లైన్ ట్రాక్టర్లు నడుస్తున్నాయని సమాచారం రావడం జరిగింది వెంటనే వెళ్లి తనిఖీ చేయగా రెండు ట్రాక్టర్లు అక్రమంగా నడుస్తున్నట్టు మా దృష్టికి రావడం జరిగిందని వారు తెలిపారు ఆ టాక్టర్లను



ఉప్పునుంతల పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది అని వారు తెలిపారు అదేవిధంగా ఇసుక అక్రమ రవాణా దారులు వాళ్లకు అవసరం లేకున్నా ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకుని డెలివరీ అడ్రస్ ఒక దగ్గర ఉంటే ఇంకో దగ్గర డెలివరీ చేస్తున్నట్టు మా దృష్టికి రావడం జరిగింది అలాంటి వాహనాలను బ్లాక్ లిస్టులో పెట్టడం జరిగిందని వారు తెలిపారు ఆన్లైన్ ముసుగులో ఆఫ్లైన్ ట్రాక్టర్లు నడిపిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారు హెచ్చరించారు.

## క్రీడాకారులకు అనువుగా మైదానాన్ని అభివృద్ధి చేస్తాం



**చేవెళ్ల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** పట్టణంలోని క్రీడామైదానాన్ని పరిశుభ్రంగా మార్చి క్రీడాకారులకు అనుకూలంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని క్రీడామైదానంలో పిచ్చి మొక్కలు, చెత్త పెరగడంతో ఆటలకు ఇబ్బందులు ఏర్పడినట్టు క్రీడాకారులు తెలియజేయడంతో స్పందించారు. శనివారం శు భ్రత కార్యక్రమాలు ప్రారంభించి చెత్త, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. వేసవి సెలవుల్లో యువత వినియోగానికి అనువుగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశం, వైస్ చైర్మన్ కాసుల రాములుగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగి రెడ్డి, దేవర మనీషా అనంత్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, క్రిష్ణా నాయక్, మున్సిపల్ సిబ్బంది, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25 (జనం సాక్షి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు శనివారం రోజున మంచాల మండలంలోని ఆగపల్లి కాఫుజ్ ఫూట్ మంచాల నోముల గ్రామాల్లో పర్యటించిన ఆయన ఒక కోటి రూపాయల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేసి మండల కేంద్రంలో 180 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు అనంతరం మంచాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తద్వారా గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు ఈ కార్యక్రమంలో



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్,వెదిరే హనుమంత్ రెడ్డి,గుండమోని జయమ్మ మల్లేష్,వింజమూరు రాంరెడ్డి, బైరిక రమాకాంత్ రెడ్డి,చీమల జంగయ్య, ప్రేమాకర్ రెడ్డి, ఎడమ నరేందర్ రెడ్డి,ముచర్ల వెంకటేష్, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, పెర్కా మూర్తి, మంచాల ఎమ్మార్వో ప్రసాద్ రావు, ఎంపిడివో బాలశంకర్, ఏసీపీ కేపీవీ రాజు,సీఐ మధు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలి



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని స్వామి సర్వేశానంద, భారతీయం సత్యవాణిలు పేర్కొన్నారు. శనివారం ఇన్ఫినిటీ ఫంక్షన్ హాల్‌లో హిందూ మహా సమ్మేళనం భక్తి, వైభవంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామిజీలు సర్వేశానంద, భారతీయం సత్యవాణి హిందూ ధర్మం గొప్పతనం, సంస్కృతి పరిరక్షణ, సామాజిక ఐక్యతపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు. హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సహకరించిన దాతలను సత్కరించారు. ఇన్ఫినిటీ ఫంక్షన్ హాల్ అందించిన పిట్టల సత్యనారాయణ, విరాళం అందించిన ఐడియల్ బిల్డర్స్ సురేష్, అన్నదానం నిర్వహించిన మెరుగు జితేందర్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సమ్మేళనం ద్వారా భక్తి, సంస్కృతి, సేవా భావం, సామాజిక ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులు తెలిపారు. యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమం అధ్యక్షుడు రామ్ రెడ్డి, కార్యదర్శి జితేందర్ రావు దగ్గు నేతృత్వంలో, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుల సమిష్టి కృషితో విజయవంతమైంది.

## పరిశుభ్రత పాటిస్తేనే మలేరియాపై విజయం

**భువనగిరి టౌన్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వల నివారణ ద్వారానే మలేరియా వంటి దోమల వ్యాధులను సమర్థవంతంగా నియంత్రి ంచవచ్చని అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భువనగిరి జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, ఉపయోగంలో లేని కూలర్లు, పారేసిన కొబ్బరి బొండాలు, ఖాళీ పాత్రలు, మురుగు గుంటలు వంటి చోట్ల నీరు నిల్వ ఉంటే దోమలు విస్తరిస్తాయని హెచ్చరించారు. అందువల్ల ప్రతి కుటుంబం స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రజలు జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పాండు నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎన్. వంశీకృష్ణ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వీణ, పట్టణ వైద్యాధికారి డాక్టర్ నిరోషా, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు ఇతరుల సహాయం లేకుండా వారు,వారి జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో గడపడానికి ఈ ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో వారికి సహాయ ఉపకరణాలను అందజేస్తున్నారు.దీనిలో భాగంగా శనివారం సూర్యాపేట నియోజకవర్గ లబ్ధిదారులకు కలెక్టరేట్ లో తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా దివ్యాంగ లబ్దిదారులకు అందించే దివ్యాంగుల రెట్రో ఫిట్మెంట్ స్కూటీలు, అంగన్వాడీ



టీచర్లకు స్మార్ట్ ఫోన్లను రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదితతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేనారెడ్డి,వైస్ చైర్ పర్సన్ షఫీ వుల్ల,ఆర్డీఓ వేణుమాధవ్ , ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , సంక్షేమ అధికారి కె.నరసింహరావు, దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, అధికారులు, సిడిపివోలు, అంగన్వాడీ సూపర్ వైజర్స్, జిల్లా ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి కృషి

- మాజీ మంత్రి,ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** సూర్యాపేటలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా సూర్యాపేట జర్నలిస్టులు ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని శనివారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా



ఆయన నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు అంతా ఏకతాటిపై ఉంటూ తమకు కావాల్సిన వాటిని సాధించుకోవాలని సూచించారు.ప్రస్తుతం జర్నలిస్టులకు అత్యవసరంగా కావలసింది ప్రెస్ క్లబ్ భవన నిర్మాణమని, అందుకోసం అవకాశం వచ్చినప్పుడు తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యేని కలిసిన వారిలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వజ్జె వీరయ్య, ప్రధాన కార్యదర్శి ఐతగాని రాంబాబు, కోశాధికారి తల్లాడ చందన్,సీనియర్ జర్నలిస్టులు మిక్కిలినేని శ్రీనివాస్ రావు, బొజ్జ ఎడ్వర్డ్,బుక్క రాంబాబు, ఊటుకూరి రవీందర్,అమరగాని నాగేందర్,రెబ్బ విజయ్,ఉయ్యాల నర్సయ్య,పెనుగొండ మల్లిఖార్జునరావు, మామిడి శ్రావణ్,మామిడి శంకర్,కంచర్ల సురేందర్,అజయ్,జంపాల ఉపేందర్,తండ వెంకన్న,వెంకన్న తదితరులు ఉన్నారు.

# జనగణన-2025లో స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలి

- కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** జన గణన-2027 ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వీయ గణన ప్రక్రియ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు కొనసాగుతుందని తెలిపారు.జనగణనను ప్రభుత్వం రెండు దశల్లో నిర్వహిస్తున్నదని పేర్కొంటూ, మొదటి విడతగా మే 11 నుండి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ నిర్వహించబడతాయని, తదుపరి విడతగా 2027 ఫిబ్రవరి 9 నుండి 28 వరకు పూర్తి స్థాయి జనగణన చేపట్టనున్నట్లు వివరించారు.ప్రజలు తమ వివరాలను అధికారిక వెబ్‌సైట్ ఒవ.ఔవఅంబం.స్త్రశీజ.ఉఅ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని సూచించిన ఆయన, కుటుంబంలోని ఒకరు 15-




-20 నిమిషాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చన్నారు. నమోదు అనంతరం మొబైల్ లేదా ఇమెయిల్‌కు వచ్చే రాజు ×ణను ఎన్యూమరేటర్‌కు చూపిస్తే ధృవీకరణ పూర్తవుతుందని చెప్పారు.నల్గొండ జిల్లాలో మొత్తం 5,03,000 గృహాలు ఉండగా, 3,729 హౌసింగ్ బ్లాక్‌లు, 479 సర్కిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం 3,179 గణకులు, 531 సూపర్వైజర్లు, 41 చార్జి అధికారులు నియమించబడ్డారని వెల్లడించారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించబడుతోందని పేర్కొన్న కలెక్టర్, ఈసారి కుల వివరాలు కూడా నమోదు చేయనున్నట్లు చెప్పారు. జనగణనకు సంబంధించి నాలుగు విడతల శిక్షణలో ఇప్పటికే రెండు పూర్తయ్యాయని, మూడో విడత శిక్షణ ఏప్రిల్ 27 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు.స్వీయ గణనపై విస్తృత ప్రచారం చేపట్టి, ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించిన ఆయన, ఈ సమాచారం రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పథకాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సిపిఓ శ్రీనివాస్ నాయక్, డిపిఆర్ఓ యు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# స్నాప్‌చాట్‌కు పోటీగా.. ఇన్‌స్టా కొత్త యాప్

**న్యూఢిల్లీ:**మెటాకు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్ కు యువతలో ఉన్న క్రేజ్ గురించి వేరే చెప్పక్కర్లేదు. తాజాగా ఈ ప్లాట్‌ఫాం వినియోగదారుల కోసం కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. స్నాప్‌చాట్‌కు పోటీగా ఇన్‌స్టాలోనూ 'ఇన్‌స్టాంట్స్' పేరుతో క్విక్ ఫొటో షేరింగ్ యాప్‌ను ప్రారంభించింది. దీని సహాయంతో వినియోగదారులు యాప్‌లోని కెమెరాను ఉపయోగించి ఒకే ట్యాప్‌తో ఫొటోలు తీసుకోవచ్చు. వీటిని షేర్ చేసిన అనంతరం చాట్ లిస్ట్‌లో 24 గంటల పాటు ఉండి ఆ తర్వాత వాటంతట అవే డిలీట్ అవుతాయి. అయితే ఈ యాప్‌లో ఎడిటింగ్ ఫీచర్లను ఇన్‌స్టాగ్రామ్ అందుబాటులోకి తీసుకురాలేదు. తాము తీసిన ఫొటోలకు వినియోగదారులు కేవలం టెక్స్ట్ మాత్రమే జోడించగలరు. 'ఇన్‌స్టాంట్స్' యాప్‌లోని కెమెరాను ఉపయోగించి తీసిన చిత్రాలను మాత్రమే షేర్ చేయగలరు. ఒకేసారి పలువురు మిత్రులతో వీటిని పంచుకోవచ్చు. మొబైల్ గ్యాలరీలోని ఫొటోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఈ యాప్ స్పెయిన్, ఇటలీలోని ఆండ్రాయిడ్ ఐఓఎస్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. త్వరలోనే ఇతర దేశాల్లోనూ ఈ సేవలు విస్తరించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఈ ఫీచర్‌తో స్నాప్‌చాట్, లాకెట్, బీరియల్ వంటి యాప్‌లు ఉన్నాయి. యువతకు మరింత దగ్గరయ్యేందుకు ఇన్‌స్టా కూడా ఈతరహా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.




# ఆంథ్రోపిక్‌లోకి గూగుల్ భారీ పెట్టుడులు

**సంచలనాల ఏఐ స్టార్టప్ సంస్థ ఆంథ్రోపిక్ లో గూగుల్ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఈ టెక్ దిగ్గజం 40 బిలియన్ డాలర్లు మేర పెట్టుబడి పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆంథ్రోపిక్ అధికారికంగా ప్రకటించింది ఒప్పందం ప్రకారం తొలుత 10 బిలియన్ డాలర్లను ఆంథ్రోపిక్‌లోకి గూగుల్ మళ్లించనుంది. మిగతా 30 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ పనితీరుపై ఆధారపడి ఉంటుంది. ఆంథ్రోపిక్‌తో తమ సహకారాన్ని మరింత పెంచుకోనున్నట్లు ఇటీవల అమెజాన్ సంస్థ ప్రకటించింది. దానిలోభాగంగా తొలుత 5 బిలియన్ డాలర్లు, పనితీరు లక్ష్యాలు సాధిస్తే మరో 20 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఇటీవల వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గూగుల్-ఆంథ్రోపిక్ ఒప్పందం గురించి ప్రకటన వచ్చింది. ఇప్పటికే ఈ రెండు కంపెనీల మధ్య ఉన్న పొత్తు.. ఈ డీల్‌తో మరింత విస్తరించనుంది. కస్టమ్ గూగుల్ చిప్స్, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసెస్‌ను వాడుకొని ఆంథ్రోపిక్ తన సాంకేతిక సామర్థ్యాలను మరింత పెంచుకోనుంది.**




## ఒకేసారి 50 అణు రియాక్టర్లు నిర్మించగలం

చైనా అణు ఇంధన ప్రాధికార సంస్థ ప్రకటన

బీజింగ్: ఒకేసారి 50 అణు రియాక్టర్లు నిర్మించగల సామర్థ్యం తమకు ఉందని చైనా అణు ఇంధన ప్రాధికార సంస్థ ప్రకటించింది. అమెరికా – ఇరాన్ యుద్ధ నేపథ్యంలో శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని మరింతగా తగ్గించుకునేందుకు అణు విద్యుత్ రంగాన్ని విస్తృతం చేసుకోడానికి డ్రాగన్ సిద్ధపడుతోంది. చైనా అణు సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం అగ్రస్థాయికి చేరిందని అణు ఇంధన సంఘం (సీఎన్ఈఏ) ఈ వారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. చైనా స్థాపిత అణుశక్తి సామర్థ్యం 125 మిలియన్ కిలోవాట్ల స్థాయికి చేరిందని, ఈ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందని నివేదిక తెలిపింది. చైనా ప్రస్తుతం 60 వాణిజ్య అణు రియాక్టర్లను నిర్వహిస్తోంది. మరో 36 నిర్మాణంలో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణమవుతున్న అణు ఇంధన సదుపాయాల్లో సగం చైనాలోనే ఉన్నాయి. ఇవి కాక మరో 16 రియాక్టర్ల నిర్మాణానికి అనుమతి లభించిందని సీఎన్ఈఏ నివేదిక తెలిపింది. 2040కల్లా చైనా స్థాపిత అణు సామర్థ్యం 200 గిగా వాట్లకు చేరనుందని సీఎన్ఈఏ ఛైర్మన్ యాంగ్ చాంగ్లీ తెలిపారు.

## గేమర్స్ కోసం రూ.459తో జియో ప్రీపెయిడ్ ప్లాన్

ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ.459తో యూత్ అండ్ గేమింగ్ ప్లాన్ (ఏతినీ ఎనీబీబిష్ట్ర జీనిట ఐజీఎతినిణ జూశ్రీజీని)ను పరిచయం చేసింది. 28 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. మొత్తం 61 జీబీ డేటాతో పాటు జియో గేమ్స్, స్నాప్‌చాట్+, గూగుల్ జెమినీ యాక్సెస్ వంటి పలు ప్రయోజనాలను అందిస్తోంది.

# ఆ విషయంలో విఫలం అయ్యాం.. క్షమించండి



ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్

ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ క్షమాపణలు చెప్పారు. ఆన్‌లైన్‌లో ఒక టీనేజర్ అభ్యంతరకర ప్రవర్తనను గుర్తించినప్పటికీ.. అధికారులను అలర్ట్ చేయడంలో విఫలమయ్యామని పేర్కొన్నారు. తర్వాత ఆ టీనేజర్ మాస్ షూటింగ్‌కు పాల్పడటంతో 9 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఫిబ్రవరిలో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రం టంబ్లర్ రిడ్జ్ ప్రాంతంలోని సెకండరీ పాఠశాలలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. 18 ఏళ్ల వాన్ రూట్సెల్లార్.. తన తల్లి, సవతి సోదరుడుతో పాటు మరో ఆరుగురు విద్యార్థులను చంపేసింది. తర్వాత తుపాకీ గాయాలతో ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై టంబ్లర్ రిడ్జ్ ప్రాంత ప్రజలను ఉద్దేశించి ఆల్ట్‌మన్ లేఖ రాశారు. "ఆన్‌లైన్‌లో ఆమె అభ్యంతరకర ప్రవర్తనను గుర్తించి చాట్‌జీపీటీ ఖాతాను గత జూన్‌లోనే సస్పెండ్ చేశాం. ఆ విషయంపై మేము పోలీసులను అప్రమత్తం చేయలేకపోయినందుకు చింతిస్తున్నాం. నా మాటలు మీకు ఓదార్పునివ్వలేవని తెలుసు. ఈ ప్రాంత ప్రజలకు జరిగిన నష్టానికి క్షమాపణలు చెప్పడమే సరైందని భావిస్తున్నాను" అని లేఖలో రాసుకొచ్చారు.

# రూ.7.3 లక్షల కోట్లకు వార్నర్ బ్రదర్స్ విక్రయం

న్యూయార్క్: హాలీవుడ్ దిగ్గజ సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీని, స్కైడ్యాన్స్ నియంత్రణలోని పారామౌంట్ 81 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7.3 లక్షల కోట్ల)కు కొనుగోలు చేసే ప్రతిపాదనకు వార్నర్ బ్రదర్స్ వాటాదార్లు గురువారం ఆమోదం తెలిపారు. వార్నర్ బ్రదర్స్‌కు చెందిన ప్రతి షేరును 31 డాలర్ల చొప్పున నగదు చెల్లించి పారామౌంట్ కొనుగోలు చేయనుంది. ఈ భారీ ఒప్పందం అమలు కావడానికి నియంత్రణ సంస్థల తుది అనుమతులు లభించాల్సి ఉంది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.25 | ₹ 5.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹ 1,42,800 (22 క్యారెట్లు) | ₹ 1,55,780 (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,80,000

# యాక్సిస్ బ్యాంకు లాభం రూ.7,071 కోట్లు.. డివిడెండ్ రూ.1

ప్రముఖ ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంకు 2025-26 చివరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.7,071 కోట్ల నికరలాభాన్ని నమోదుచేసింది. అంతకుముందు ఇదే కాలంలో నమోదైన రూ.7,117 కోట్లతో పోలిస్తే 0.6 శాతం తగ్గుదల నమోదైంది. బలహీనమైన వడ్డీయేతర ఆదాయం, అధిక కేటాయింపులే ఇందుకు కారణంగా బ్యాంక్ పేర్కొంది. అయితే గత డిసెంబర్ త్రైమాసికం నికర లాభం రూ.6,489.57 కోట్లతో పోలిస్తే 9 శాతం వృద్ధి సాధించింది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 5% పెరిగి 14,457 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ 2 బేసిస్ పాయింట్ల మేర తగ్గి 3.62 శాతానికి చేరింది. బ్యాలెన్స్ షీట్ బలోపేతానికి అదనంగా రూ.2001 కోట్ల ప్రొవిజన్లను కేటాయించినట్లు బ్యాంకు పేర్కొంది. దీంతో మార్చి త్రైమాసికంలో ప్రొవిజన్లు రూ.3,522 కోట్లకు చేరాయి. దీంతో మార్చి త్రైమాసికంలో ప్రొవిజన్లు రూ.3,522 కోట్లకు చేరాయి. బ్యాంకులో మొండి బకాయిలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే రూ.6007 కోట్ల నుంచి రూ.4,709 కోట్లకు తగ్గాయి. దీంతో రుణాల నాణ్యత మెరుగుపడింది. కార్యకలాపాల లాభం గతేడాదితో పోలిస్తే 7 శాతం తగ్గి రూ.10,013 కోట్లకు చేరింది. ఖర్చులు 6 శాతం పెరిగాయి. మార్చి త్రైమాసికంలో రూ.606 కోట్ల ట్రేడింగ్ నష్టాల వల్ల వడ్డీయేతర ఆదాయం దెబ్బతిన్నట్లు బ్యాంకు పేర్కొంది. వాటాదారులకు ప్రతి షేరుకు రూ.1 డివిడెండ్ సిఫార్సు చేసినట్లు ప్రకటించింది.మొత్తంగా చూస్తే, అధిక ప్రొవిజన్లు, ట్రేడింగ్ నష్టాలతో వార్షిక లాభం తగ్గినప్పటికీ, నికర వడ్డీ ఆదాయం, ఆస్తి నాణ్యత విషయంలో బ్యాంకు మెరుగైన ఫలితాలను కనబరిచింది. డిజిటల్ లావాదేవీల్లో బ్యాంకు తన హవా కొనసాగిస్తోంది. మార్చి త్రైమాసికంలో 10 లక్షలకు పైగా క్రెడిట్ కార్డు యూజర్లను కొత్తగా నమోదు చేసింది.

# సహకరించనివారికి శిక్ష తప్పదు!

## నాటో దేశాలకు ట్రంప్ యంత్రాంగం హెచ్చరిక



వాషింగ్టన్: పశ్చిమాసియాలో గతంలో అమెరికా చేసిన యుద్ధాలకు సహకరించిన నాటో దేశాలు.. ఇరాన్ యుద్ధంలో మాత్రం భిన్నంగా వ్యవహరి స్తున్నాయి. కొన్ని సభ్య దేశాలైతే అమెరికా దాడిని బహిరంగంగానే తప్పుబడుతున్నాయి. ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో తమకు మద్దతివ్వని నాటో దేశాలపై చర్యలు ఉపక్రమిం చేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తమకు అనుకూల, వ్యతిరేక దేశాల తో రెండు జాబితాలను తయారు చేసింది. ఐరోపాలో అగ్రరాజ్యానికి అత్యంత విధేయంగా వ్యవహరిస్తున్న దేశాల్లో పోలండ్ ఒకటి. దాదాపు 10 వేల మంది అమెరికా సైనికులకు ఆ దేశం ఆశ్రయమిస్తోంది. వీరికయ్యే ఖర్చులో సింహభాగం కూడా భరిస్తోంది. అంతేకాదు, పశ్చిమాసియాలో అమెరికా నిర్వహిస్తున్న సైనిక ఆపరేషన్లకు అవసరమైన లాజిస్టిక్ మద్దతునూ అందిస్తోంది. రుమేనియా కూడా అమెరికాకు పూర్తిగా సహకరిస్తోంది. తమ వైమానిక స్థావరాల్లో అగ్రరాజ్య విమానాలకు దిగేందుకు అనుమతులిచ్చింది. బాల్టిక్ దేశాలైన ఎస్తోనియా, లాత్వియా, లిథువేనియాలు కూడా అగ్రరాజ్యానికి సంపూర్ణ మద్దతు తెలిపాయి.నాటోలో కొన్ని దేశాలు మాత్రం ఇరాన్‌పై యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్పెయినైతే బహిరంగంగానే వాషింగ్టన్ వైఖరిని తప్పుబట్టింది. తమ సైనిక స్థావరాలను వినియోగించుకోవడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతివ్వబోమని స్పష్టం చేసింది. యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆ దేశ అధ్యక్షుడు పెడ్రో శాంచెజ్ స్వయంగా ప్రకటించారు. మిత్రదేశమైనా.. చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే సహకరించబోమంటూ కుండబద్దలు కొట్టారు. స్పెయిన్ అంత కఠినంగా కాకపోయినా, బ్రిటన్ కూడా యుద్ధానికి వ్యతిరేకంగానే తన గళాన్ని వినిపిస్తోంది. పోరు ఆరంభంలో తమ సైనిక స్థావరాల నుంచి ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేయడానికి అంగీకరించలేదు. తర్వాత రక్షణాత్మక చర్యల కోసం వాడుకోవడానికి అనుమతించినా.. హర్మూజ్ జలసంధి తెరవడానికి సహకరించాలన్న ట్రంప్ పిలుపునకు మద్దతివ్వలేదు. దీంతో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌కు ధైర్యం లేదంటూ ట్రంప్ విమర్శలు చేశారు. అంతటితో ఆగలేదు. బ్రిటన్ విమాన వాహక నౌకలను బొమ్మలతో పోలుస్తూ అవహేళన చేశారు.ఇప్పటివరకు విమర్శలకే పరిమితమైన ట్రంప్.. ఇప్పుడు సహకరించని నాటో దేశాలను కఠినంగా శిక్షించాలని భావిస్తున్నారు. దీనిపై ఆయన యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు చర్యలను ట్రంప్ ముందుంచినట్లు సమాచారం.. అవేంటంటే ఇరాన్‌తో పోరులో తమకు మద్దతివ్వని దేశాల నుంచి సైనిక దళాలను ఉపసంహరించి, వాటిని తమకు విధేయంగా వ్యవహరిస్తున్న పోలండ్, రుమేనియా తదితర దేశాలకు తరలించడం. వ్యతిరేకిస్తున్న దేశాలకు అత్యాధునిక అమెరికా ఆయుధాలు, రక్షణ సాంకేతికతను అమ్మకుండా నిలిపివేయడం..పెంటగాన్ నుంచి లీకైన ఈ మెయిల్ ప్రకారం.. స్పెయిన్ వంటి దేశాలను నాటో నుంచి సస్పెండ్ చేయడం.బ్రిటన్, అర్జెంటీనా మధ్య కొనసాగుతున్న ఫాక్లాండ్ ఐలాండ్స్ వివాదంలో అనుసరిస్తున్న తటస్థ వైఖరిని మార్చుకోవడం. ఇరాన్‌పై యుద్ధానికి సహకరించని బ్రిటన్‌కు వ్యతిరేకంగా ఈ దీవుల విషయంలో అర్జెంటీనాకు మద్దతు పలకడం.

## దిగ్బంధంలోనే హర్మూజ్

అమెరికా జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ డాన్ కెయిన్ వెల్లడించారు. ఇటీవల తమ ఆదేశాలను ధిక్కరించిన ఇరాన్ నౌకపై కాల్పులు జరిపి.. అందులోని సిబ్బందిని తమ దళాలు అదుపులోకి తీసుకున్నాయన్నారు. హర్మూజ్ మాత్రమే కాకుండా హిందూ, పసిఫిక్ మహాసముద్రాల్లోనూ ఇరాన్ నౌకలను అడ్డగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## ఈసారి అమెరికాతో నేరుగా మాట్లాడేది లేదు

విషయాలను వీరికే వివరిస్తాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. అరాగ్చీతో అమెరికా ప్రతినిధులు నేరుగా చర్చలు జరుపుతారని అంతకుముందు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ క్రమంలోనే టెహ్రాన్ తాజాగా దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ చర్చల్లో అమెరికా తరఫున ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్కాఫ్, జేర్డ్ కుష్నర్ పాల్గొననున్నారు. వీరి చర్చల్లో పురోగతి కనిపిస్తే.. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా పాక్‌కు వచ్చి సంప్రదింపుల్లో భాగమవుతారని శ్వేతసౌధం తెలిపింది. మరోవైపు, మలివిడత చర్చలకు ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ దూరంగా ఉండటం గమనార్హం. అంతర్గత విభేదాల కారణంగా చర్చల బృందం నుంచి ఆయన వైదొలిగినట్లు తెలుస్తోంది. కాగా.. తాజా పరిణామాలపై ట్రంప్ స్పందించారు. ఈ సారి చర్చల్లో అమెరికా డిమాండ్లకు అనుగుణంగా ఇరాన్ ప్రతిపాదనలు చేయనుందని, వాటిని తాము పరిశీలిస్తామని తెలిపారు. అమెరికా షరతులకు అంగీకరిస్తేనే ఏ ఒప్పందమైనా జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. టెహ్రాన్ తమ వద్ద నిల్వ ఉంచిన శుద్ధి చేసిన యురేనియాన్ని వదులుకోవాలని, హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించాలని ట్రంప్ మరోసారి డిమాండ్ చేశారు.

# 50శాతం ప్రభుత్వ సేవలు ఏఐతోనే..!

## యూఏఈ కీలక నిర్ణయం..



**దుబాయ్:**గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. 50శాతం ప్రభుత్వ సేవలు, కార్యకలాపాలు ఏఐతోనే నడుస్తాయని ప్రకటించింది. ఏజెంటిక్ ఏఐ వినియోగాన్ని విస్తరించనున్నట్లు వెల్లడించింది. 2028 నాటికి ఈ మార్పులు తీసుకురానున్నట్లు యూఏఈ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ రషీద్ అల్ మఖ్తుమ్ వెల్లడించారు. ప్రపంచంలోనే ఈ స్థాయిలో కృత్రిమ మేధను వినియోగించే తొలి దేశంగా యూఏఈ నిలవనుంది ఏఐ ఇక ఓ సపోర్ట్ టూల్‌గా మాత్రమే కాకుండా ఒక ఎగ్జిక్యూటివ్ పార్ట్‌నర్‌గా మారనుందని ప్రధాని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలు మెరుగుపర్చడానికి, నిర్ణయాలు తీసుకొనే ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ సాంకేతికతను ఉపయోగిస్తామని పేర్కొన్నారు.ఏజెంటిక్ ఏఐ అంటే.. ఇప్పటివరకూ ఉపయోగిస్తోన్న ఏఐ వ్యవస్థలు సాధారణంగా మనం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాయి. కానీ ఏజెంటిక్ ఏఐ అంతటితో ఆగదు. ఒక లక్ష్యం ఇస్తే.. దాన్ని సాధించడానికి అవసరమైన దశలను తానే నిర్ణయించుకుని, అవసరమైన చర్యలు తీసుకుని, పని పూర్తయ్యేవరకు ముందుకుసాగుతుంది. అంటే ఇది కేవలం 'సమాధానం చెప్పే ఏఐ' కాదు. ఇప్పటివరకూ ఏఐ ఒక సాధనం (టూల్)లా పనిచేసింది. మనకు అవసరం ఉంటే ఉపయోగించుకునేలా ఉండేది. కానీ ఇప్పుడు ఏజెంటిక్ ఏఐ.. మనతో కలిసి పనిచేసే సహచరుడిలా మారుతోంది.ఇది అవసరాన్ని అర్థం చేసుకుని, అనేక దశల్లో పని చేసి, కొంతవరకు నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకుంటోంది. ఇది చిన్న మార్పు కాదు.. సహాయక టెక్నాలజీ నుంచి సహకార టెక్నాలజీకి ప్రయాణమని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

# ప్రతి నలుగురిలో ఒకరికి హెచ్ఐవీ

## ఎస్వతిని దేశంలో విశృంఖల వ్యాప్తి




జొహన్నెస్‌బర్గ్: దక్షిణ ఆఫ్రికాలోని అతిచిన్న దేశం ఎస్వతిని(పూర్వనామం స్వాజిలాండ్). మొత్తం జనాభా దాదాపు 12 లక్షలు. వీరిలో దాదాపు 3 లక్షల మంది(ప్రతి నలుగురిలో ఒకరు) హెచ్ఐవీ సోకిన వారు ఉన్నారంటే ఆశ్చర్యం వేస్తుంది కదూ! కానీ ఇది నిజం. ఏటా దాదాపు 7 వేల మంది ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. యువత(15-49 ఏళ్ల మధ్య) హెచ్ఐవీ బారిన పడుతున్న దేశాల్లో ఎస్వతిని ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తుంది. దేశ జనాభాలో దాదాపు 60 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఈ దేశస్థులు పొరుగున ఉన్న దక్షిణాఫ్రికా గనుల్లో కూలీ పనులకు వెళతారు. అక్కడ గనుల యజమానులు ఎస్వతిని మహిళలతో శృంగార వాంఛలు తీర్చుకునేవారు. అలా వీరికి ఈ మహమ్మారి అంటుకుంది. ఎస్వతిని సంప్రదాయ నృత్యం 'రీడ్ డ్యాన్స్'ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. నిరుపేద మహిళలు డబ్బుకోసం వారి వద్దకు వెళుతుంటారు. సురక్షిత లైంగిక పద్ధతులు పాటించకపోవడం, సంప్రదాయాల పేరిట విచ్చలవిడి శృంగారాన్ని అనుమతించడం.. లాంటివి వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణాలు. పాఠశాలకు వెళ్లే పిల్లల్లో దాదాపు 18 శాతం మంది తమ స్కూలు వయసులోనే తొలిసారి శృంగారంలో పాల్గొన్నామని చెబుతుండడం గమనార్హం. బహుభార్యత్వం ఇక్కడ సర్వసాధారణం. సాక్షాత్తూ దేశ రాజే 'రీడ్ డ్యాన్స్' సందర్భంగా ఏటా ఓ యువతిని ఎంపికచేసుకుని పెళ్లిచేసుకోవడం ఇక్కడ ఆనవాయితీ. దేశంలో తొలిసారిగా 1986లో హెచ్ఐవీ కేసు వెలుగుచూసింది. ఆ తర్వాత విశృంఖలంగా వ్యాప్తిచెందింది. హెచ్ఐవీ వ్యాప్తి నివారణలో కీలకపాత్ర పోషించే లెనాకాపవిర్(లెన్) కొరత దేశాన్ని పట్టిపీడిస్తోంది. హెచ్ఐవీ నిర్మూలన కోసం పనిచేస్తున్న గ్లోబల్ ఫండ్ ద్వారా ఏటా 6వేల డోసుల లెనాకాపవిర్ రావాల్సి ఉండగా.. అందులో సగమే వస్తోంది. గత 20 ఏళ్లుగా ప్రభుత్వం చేపట్టిన ఎయిడ్స్ నివారణ చర్యల్లో భాగంగా వ్యాధి సోకిన వారిలో ఎక్కువ మందికి చికిత్స అందిస్తున్నారు. దీనివల్ల మరణాలకు చాలావరకు అడ్డుకట్ట వేయగలగడం చెప్పుకోదగ్గ విజయం.

# రిలయన్స్ లాభం తగ్గింది

## రాణించిన జియో

**న్యూఢిల్లీ:**'ఇంధన ధరల్లో ఊగిసలాట, అంతర్జాతీయ వాణిజ్య ధోరణుల్లో మార్పుల వల్ల 2025-26లో కంపెనీకి సవాళ్లు ఎదురయ్యాయి. వ్యాపారాల్లో వైవిధ్యీకరణ, కంపెనీకున్న దేశీయ దృష్టి కారణంగా అంతర్జాతీయ ఒడుదొడుకుల్లోనూ నిలబడగలిగాం. డిజిటల్, రిటెయిల్ విభాగాల్లో బలమైన పనితీరు కలిసొచ్చింది." ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఇంధన సంక్షోభ ప్రభావం.. చమురు, రసాయనాలు ప్రధాన వ్యాపారంగా ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్)పై కనిపించింది. 2025-26 మార్చి త్రైమాసికంలో సంస్థ నికర లాభం 12.5% తగ్గేందుకు కారణమైంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల చమురు ధరలతో పాటు రవాణా, బీమా వ్యయాలు భారమైన సంగతి తెలిసిందే. ఇంధన ఎగుమతులపై భారత ప్రభుత్వం విండ్‌ఫాల్ పన్నును తిరిగి ప్రవేశపెట్టడం వల్ల కూడా సంస్థ మార్జిన్లు తగ్గాయి. దేశీయంగా కొరత తీర్చడం కోసం, పెట్రో రసాయనాల ఉత్పత్తికి తెప్పించిన విలువైన ఫీడ్‌స్టాక్‌ను ఎల్‌పీజీ (వంటగ్యాస్) తయారీకి సంస్థ మళ్లించింది. ఫలితంగా ఈ విభాగంలో మార్జిన్లు క్షీణించాయి. అయితే టెలికాం, రిటెయిల్ విభాగ లాభాలు కొంత ఆదుకున్నాయి. జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 13% పెరిగి రూ.7,935 కోట్లకు చేరడం కలిసివచ్చింది. ఆదాయం 12.5% వృద్ధితో రూ.39,853 కోట్లకు చేరుకుంది. రిలయన్స్ జియోకు వినియోగదారు సగటు (ఆర్పు) ఆదాయం రూ.206.2 నుంచి 3.8% పెరిగి రూ.214కు చేరింది. వినియోగదార్ల సంఖ్య 91 లక్షలు పెరిగి 52.44 కోట్లుగా నమోదైంది. ఇందులో 5జీ వినియోగదార్ల సంఖ్య 26.8 కోట్లు (55%)గా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఈ సంస్థ నికర లాభం 15% పెరిగి రూ.30,053 కోట్లకు చేరుకుంది. కార్యకలాపాల ఆదాయాలు 14.5% వృద్ధి చెంది రూ.1,46,885 కోట్లకు చేరాయి. జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్ దిశగా స్థిరంగా ముందుకు వెళ్తోందని ఆర్ఐఎల్ సీఎండీ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. రూ.6 డివిడెండు: గత ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.6 డివిడెండును బోర్డు సిఫారసు చేసింది. రిలయన్స్, వాల్ట్‌డిస్నీ సంయుక్త సంస్థ జియోస్టార్ మార్చి త్రైమాసికంలో రూ.9,784 కోట్ల స్థూల ఆదాయంపై రూ.419 కోట్ల లాభాన్ని ఆర్జించింది.రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ స్థూల ఆదాయం మార్చి త్రైమాసికంలో 2.2 రెట్లు పెరిగి రూ.7,350 కోట్లకు చేరుకుంది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రెట్టింపు వృద్ధితో రూ.22,000 కోట్లకు చేరుకుంది.ఆదాయం రూ.3 లక్షల కోట్లకు: 2025-26 మార్చి త్రైమాసికంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.16,791 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.19,407 కోట్ల కంటే ఇది 12.5% తక్కువ. మొత్తం ఆదాయం మాత్రం రూ.2.69 లక్షల కోట్ల నుంచి రూ.3.03 లక్షల కోట్లకు పెరిగింది. ఓ2సీ వ్యాపారంలో ఎబిటా 3.7% తగ్గి రూ.14,520 కోట్లకు పరిమితమైంది.రిలయన్స్ ఇండస్ట్రీస్ 2025-26లో రూ.80,775 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2024-25 లాభం రూ.69,648 కోట్ల కంటే ఇది 16% అధికం.రిటెయిల్ లాభం రూ.3,563 కోట్లకు: రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ మార్చి త్రైమాసిక లాభం 0.5% పెరిగి రూ.3,563 కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం 10.84% వృద్ధి చెంది రూ.98,232 కోట్లకు చేరింది. 2025-26 ఏడాదికి స్థూల ఆదాయం 11.83% పెరిగి రూ.3.7 లక్షల కోట్లకు చేరుకుంది. జియోమార్ట్ ద్వారా హైపర్ లోకల్ కామర్స్ వేగంగా వృద్ధి చెందడం ఇందుకు కలిసొచ్చిందని సంస్థ వివరించింది.



# సెలూన్ కార్మికుడిపై దాడి

## కరీంనగర్ త్రీటౌన్ ఎస్ఐ సస్పెన్షన్

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** కరీంనగర్ నగరంలోని ఖాన్‌పురా ప్రాంతంలో జరిగిన సెలూన్ కార్మికుడిపై దురుసు ప్రవర్తన ఘటనకు సంబంధించి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్. చైతన్య చందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ రోజు ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో దుర్గమ్మగడ్డ, ఖాన్‌పురాలో ఉన్న 'న్యూ ప్రజా హెయిర్ స్టైల్' సెలూన్‌కు వెళ్లిన ఎస్ఐ చైతన్య చందర్, అక్కడ పని చేస్తున్న పగడాల రాము (50) అనే కార్మికుడు మర్యాదపూర్వకంగా అన్నా కూర్చో అని పలకరించడంతో ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే అతనిపై అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు చేయిచేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సెలూన్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఘటన సమయంలో ఎస్ఐ ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద బందోబస్తు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు విచారణలో తేలింది. విచారణలో సామాన్య పౌరుడిపై దాడి చేయడం, అధికార దుర్వినియోగం, విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తన వంటి ఆరోపణలు నిజమని నిర్ధారణ కావడంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మరియు రాజన్న జోన్-3 డీఐజీ సిఫారసు మేరకు ఉన్నతాధికారులు ఎస్ఐపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ సీపీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ క్రమశిక్షణకు ప్రతీక అని, ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించినా లేదా అధికారాన్ని దుర్వినియోగం చేసినా ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

# నత్త నడకన వడ్ల కొనుగోలు కేంద్రాలు


## ప్రారంభోత్సవాలు కేవలం ఫోటోషూట్లకే పరిమితం అయ్యాయి



**సిరికొండ ఏప్రిల్ 25(జనం సాక్షి) :** సిరికొండ గ్రామంలో ప్రారంభించిన వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రాక్టికల్‌గా పనిచేయడం లేదు. తీవ్రమైన హమాలీల కొరత కారణంగా రైతులు తెచ్చిన వడ్ల కుప్పలు ఎక్కడ వేసారో అక్కడే పేరుకుపోయి ఉన్నాయి. రాబోయే నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి నిర్లక్ష్య పరిపాలనను ఎన్నడూ చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను ప్రశ్నిస్తే సరైన స్పందన లేకుండా నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించినందుకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నామనే భావన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, అవసరమైన హమాలీలను సమకూర్చి వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి. లేకపోతే రైతులు రోడ్డు మీదకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం విడాలని కోరుతున్నారు.

# మార్కెట్ కమిటీలు రైతులకు న్యాయం చేసే విధంగా పనిచేయాలి

## రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల బ్యూరో ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** మార్కెట్ కమిటీలు రైతులకు న్యాయం చేసే విధంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా జగిత్యాల పొన్నాల గార్డెన్స్ లో శనివారం నిర్వహించిన చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకారం, సన్మాన సభలో ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం మార్కెట్ యార్డు అభివృద్ధి కి కృషి చేయాలని, రైతులు తమ పంటలకు దళారులు వల్ల మోస పోకుండా సరైన ధరలు పొందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రైతు సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ ని, మార్కెట్ కమిటీలు రైతులకు న్యాయం చేసే విధంగా పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య, లైబ్రరీ చైర్మెన్ దినేష్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువల జ్యోతి లక్ష్మణ్,గోలి శ్రీనివాస్, టిపిసిసి సెక్రటరీ బండ శంకర్,పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్,మాజీ ఏ ఎం సి చైర్మెన్ లు కొలుగురి దామోదర్ రావు నక్కల రాధ రవీందర్ రెడ్డి,మార్కెట్ కమిటి డైరెక్టర్లు జయరాం సురేష్ సత్తిరెడ్డి నరేష్ గంగారెడ్డి రాజన్న సుర శ్రీనివాస్ పోచయ్య అంజలి రాజిరెడ్డి రమేష్ శ్రీకాంత్ జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యకులు రాజేష్,సర్పంచులు,కౌన్సిలర్ లు,ఉప సర్పంచులు,కో ఆప్షన్ సభ్యులు,ప్రజా ప్రతినిధులు ,అధికారులు,నాయకులు రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు వైద్య సేవలు సానుభూతితో అందించాలి

## వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**జగిత్యాల బ్యూరో ఏప్రిల్ 25(జనం సాక్షి) :**
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబారిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి)ను వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఘనంగా శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, మన తెలంగాణ ప్రభుత్వం ప్రజపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ఈరోజు అంబారీపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించడం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజల ఆరోగ్యం పరిరక్షణలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల విస్తరణలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంబారిపేటతో పాటు సమీప గ్రామాల ప్రజలు కూడా ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది ప్రజలకు సానుభూతితో సేవలు అందించాలని సూచించారు. ఈ కేంద్రంలో అవుట్ పేషెంట్ సేవలు, ప్రసూతి సేవలు, టీకా కార్యక్రమాలు, ప్రాథమిక చికిత్సలు అందించబడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కూడా ఈ కేంద్రం ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుభ్రత, పోషకాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇలాంటి సదుపాయం ఏర్పాటు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జివాకర్ రెడ్డి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి సుజాత, డిప్యూటీ ఉప వైద్యాధికారి జైపాల్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శంకర్, స్థానిక సర్పంచ్ వేముల లక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

*నూతనంగా నియమితులైన రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ హెచ్ గోపాల్ రావు , రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేటర్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.*

# సెన్సస్-2027కు జిహెచ్ఎంసీ సన్నద్ధం

- స్వీయ గణనపై ప్రత్యేక దృష్టి
- కమిషనర్ ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సెన్సస్-2027 నిర్వహణకు సంబంధించిన ఏర్పా ట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు మొ త్తం 19,865 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ రూపొందించగా, నగరంలోని అన్ని ప్రాంతాల్లో డిజిటల్ మ్యాపింగ్ పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. సెన్సస్ నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, వారికి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సెన్సస్-2027లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానానికి ఈసారి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. పౌరులు తమ కుటుంబ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా సౌకర్యం క ల్పించగా, ఈ ప్రక్రియ ఏప్రిల్ 26 నుండి మే 10 వర కు కొనసాగనుంది. కేవలం 15 నుంచి 20 నిమిషా ల్లో ఈ నమోదు పూర్తిచేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా అపార్ట్‌మెంట్లు, మిక్స్ కాలనీలు, స్లమ్ ప్రాంతాల్లో లక్ష్య సాధనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. డేటా సేకరణలో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలో పేతం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ .."సెన్సస్ అనేది నగర అభివృ ద్ధికి కీలకమైన ప్రక్రియ. ప్రతి కుటుంబం స్వీయ గణ నలో తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను ఖ చ్చితంగా నమోదు చేయాలి. డిజిటల్ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుంది. ప్రజల సహకారం ఉంటే నగరానికి సరైన ప్రణాళికలు రూపొందించుకోవడం సులభమవుతుంది" అని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ తెలంగాణ భారతి హోలీకేరి కూడా ప్రజలు స్వీయ గణనలో చురుకుగా పాల్గొని నగరాభి వృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

# ఈదమ్మ జాతరలో సర్పంచ్‌పై దాడి... రాజకీయ ఉద్రిక్తత

జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 25: జిల్లేడు చౌదరిగూడ మండలం పరిధిలోని పద్మారం గ్రామంలో నిర్వహించిన ఈదమ్మ దేవత జాతరలో ఉద్రిక్తత నెలకొంది. ఎలుకగూడ గ్రామ సర్పంచ్ బంధ్యాయ అయ్యేపై దాడి జరగడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల ప్రకారం, జాతర సందర్భంగా టీఆర్ఎస్ నాయకులు సర్పంచ్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తలకు గాయాలు కావడంతో వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత వారం రోజుల్లోనే మండల పరిధిలో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని అవసరమైతే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులకు ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

# వేసవి శిబిరాలు పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదం

## వనస్థలిపురంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి






- క్రీడలు, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతపై సూచనలు
- ప్లేగ్రౌండ్స్ అభివృద్ధిపై ఎమ్మెల్యే వివరాలు
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు

**హయత్ నగర్, ఏప్రిల్ 25 ( జనం సాక్షి) :**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం చత్రపతి శివాజీ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవు లలో పిల్లలు, యువతకు క్రీడలు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ శిబిరాలు పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.

పిల్లలలో టాలెంట్ పెంపొందించడం, సెలవు లలో ఖాళీగా ఉండకుండా సమయాన్ని ఉపయోగకరంగా వినియోగించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయడం, శారీరక దృఢత్వం పెరగడం, క్రమశిక్షణ, టీమ్‌వర్క్ నేర్చుకోవడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో స్పోర్ట్స్ కెరీర్‌కు కూడా ఇవి దోహదపడతాయని తెలిపారు.

గతంలో తాను హుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో ఈ స్థలాన్ని పార్క్‌గా కాకుండా ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం గాయత్రి భవన్, డిపిఎస్ గ్రౌండ్, వనస్థలిపురం ఫేజ్-4, శివాజీ గ్రౌండ్స్ వంటి ఐదు ప్లేగ్రౌండ్స్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వనస్థలిపురం, బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంతాల్లో ఉన్న పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఇతర ప్రాంతాల్లో లేవని, యువత కోసం దూరదృష్టితో వీటిని అభివృద్ధి చేశామని తెలియచేశారు. ఇప్పుడు అదే ప్రదేశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఆనందదాయకమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో 13 స్విమ్మింగ్ పూల్స్ ఉండగా, ఎల్బీనగర్ నియోజకవర్గం లోనే మూడు స్విమ్మింగ్ పూల్స్ ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. 8 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నేటి యువతకు ఆడుకునే ప్రదేశాలు లేకపోవడంతో ప్లేగ్రౌండ్స్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గతంలో పలు పోటీల్లో పాల్గొన్న పలువురు విద్యార్థి, విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, అధికారులు అశోక్, నాగేందర్, వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, నాయకులు, కోచ్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.







# ముఖ్యమంత్రి గారు... వికారాబాద్ జిల్లాను చూడండి

**తెలంగాణ స్పీకర్ గారు.. ఇటు చూడండి సారు..**

## అధ్వానంగా బంట్వారం, కోటిపల్లి, మర్పల్లి, శంకర్ పల్లి-మోమిన్ పేట్ రోడ్లు

### ప్రాణాలు పోతున్నా పట్టించుకునే నాధుడు లేడు

**బంట్వారం ఏప్రిల్ 25(జనం సాక్షి) :**
అది హైదరాబాద్ నుండి పంచలింగాల్, బంట్వారం నుండి కోటపల్లి నుండి మోమిన్ పేట్ నుండి మర్పల్లి నుండి బంట్వారం నుండి తొర్మామిడి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి. లంగర్ హౌస్, శంకర్ పల్లి మీదుగా మోమిన్ పేట్ వైపు వెళుతుంది. శంకర్ పల్లి నుండి మోమిన్ పేట్ వరకు 30 కిలోమీటర్ల పొడవు వెళుతుంది. శంకర్‌పల్లి నుండి వికారాబాద్ వెళ్ళడానికి కూడా ఇదే ప్రధాన రహదారి. సగం వరకు హెచ్ఎండిఏ పరిధిలో ఉంటుంది. అయినా దీని పరిస్థితి అధ్వానం. శంకర్ పల్లి నుండి లక్ష్మారెడ్డి గూడ గేటు సమీపం వరకు ఇటీవలే రోడ్డు నిర్మాణం జరిగింది. అక్కడినుండి మోమిన్ పేట్ వరకు సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణం నరకాన్ని చూపిస్తుంది. ఈ రహదారిపై పాలకులు ఎప్పటికప్పుడు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. రోడ్డు వెడల్పు అవుతుందని, అందుకు ప్రభుత్వం నుండి అనుమతులు కూడా వచ్చాయని, సంవత్సరాల పాటు ఊరిస్తున్నారు. చీమలదరి, దేవరంపల్లి, మోమిన్ పేట్ చిలుక వాగుపై బ్రిడ్జిలు నిర్మించి వదిలేశారు. ఈ రోడ్డు నిర్మించి చాలాకాలం అవుతున్నందున, గుంతల మయంగా మారింది. ఈ రోడ్డుపై కొత్తగా వచ్చేవారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మోమిన్ పేట్ నంది వాగు పై నిర్మించిన పురాతన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం వస్తే ఆ వంతెనపై నుండి నీళ్లు ప్రమాదకరంగా పారుతాయి. దీంతో పోలీసులు ఇరువైపులా కాపలాగా ఉండి రాకపోకలను నిలిపివేస్తారు. కావున దానిని పునర్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకుల నిర్లక్ష్యానికి గడచిన ఐదు, ఆరు సంవత్సరాలలో ప్రమాదాలలో పలువురు మరణించారు. అయినా పాలకులు ఏమాత్రం స్పందించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

### ఇప్పటికైనా నిర్మాణం జరుగుతుందనుకున్నాం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వికారాబాద్ నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర శాసనసభాపతిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈ రోడ్డు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని స్థానిక ప్రజల ఆశించారు. ఏడాదిన్నర గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడంతో ప్రజల్లో తిరిగి నిరాశ అలుముకుంది. హైదరాబాద్ నుండి వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మోమిన్ పేట్, మర్పల్లి మండలాలకు వెళ్లాలంటే స్పీకర్ ఇదే దారిలో రావాల్సి ఉంటుంది. స్వయానా అతనే ప్రయాణం చేస్తు న్నప్పటికీ, ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. శాసన సభాపతిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడిగా తన నియోజకవర్గంలోని సమస్యను పరిష్కరించడం అతనికి ఓ లెక్క కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అతను దృష్టి పెడితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని, ఇప్పటికైనా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ రోడ్డు నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కుంటుబడుతున్న అభివృద్ధి

వికారాబాద్ నియోజకవర్గానికి రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతోనే అభివృద్ధి కుంటుపడుతుందని ఎప్పటినుండో ప్రజల్లో ఓ నానుడి ఉంది. శంకర్ పల్లి నుండి వెళ్లే ఈ రోడ్డు కూడా అధ్వానంగా ఉండడంతో నవాబ్ పేట్, మోమిన్ పేట్, మర్పల్లి మండలాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పాలి. సాధారణ పద్ధతుల్లో కొంతమేర మెరుగుగా ఉన్నప్పటికీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర పెట్టుబడిదారులు రోడ్డు సరిగ్గా లేకపోవడం వలనే ఈ ప్రాంతానికి రావడం లేదు. వికారాబాద్ జిల్లా కేంద్రం అయినప్పటికీ, హైదరాబాదు నుండి ఆ నియోజకవర్గానికి రావడానికి రోడ్డు మార్గం ఇప్పటికీ అంతంత మాత్రమే ఉంది. కాబట్టి ఇప్పటికైనా ప్రసాద్ కుమార్ వీటిపై దృష్టి సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు సహకరించండి

# జనగణన నమోదు సులువు

- ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణనకు అవకాశం
- ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సేవలు అందుబాటులో
- ఇంటి నుంచే వివరాలు నమోదు సౌకర్యం
- ఖచ్చితమైన డేటా కోసం ప్రజల సహకారం అవసరం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :**
జనగణన నమోదులో స్వీయ గణన విధానం ద్వారా ప్రజలు సులభంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమీషనర్ తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధానం ద్వారా వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉండటంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని చెప్పారు. భారత ప్రభుత్వ జనగణన విభాగం మార్గదర్శకాల ప్రకారం స్వీయ గణన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసుకోవచ్చని, ఈ సౌకర్యం ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పౌరులు తమ కుటుంబ సమగ్ర వివరాలను స్వీయ గణన పోర్టల్ ద్వారా సమర్పించడం ఈ ప్రక్రియ యొక్క ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

ప్రజలు ఇంటి నుంచే సులభంగా జనగణన వివరాలను నమోదు చేసుకోవచ్చని, ఇది ఒక మంచి అవకాశం కావడంతో తప్పక వినియోగించుకోవాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కోసం పోర్టల్‌లో లాగిన్ అయి భాషను ఎంపిక చేసి, తమ స్థలాన్ని గుర్తించి, గృహ వివరాలు నమోదు చేసి ఫారం సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి రకం, సౌకర్యాలు, ఆస్తుల సమాచారం వంటి ప్రాథమిక వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు సమర్పించిన తరువాత రిఫరెన్స్ ఐడి నమోదిత మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుందని, మే 11 తర్వాత ఎన్యూమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడిని చూపించాల్సి ఉంటుందని చెప్పారు. ఖచ్చితమైన, నమ్మకమైన జనగణన డేటా కోసం ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఉప కమీషనర్ పునరుద్ఘాటించారు.




# మాజీ శాసనసభ్యుడికి మాజీ గవర్నర్ దత్తాత్రేయ పరామర్శ

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** గత రెండు రోజులుగా తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో వరంగల్ జిల్లా నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ గురువారం ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం శంకర్ గౌడ్ మృతదేహంతో జరిగిన ధర్నాలో పాల్గొంటూ అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని గచ్చిబౌలి పరిధి ఏఐజీ ఆసుపత్రిలోని ఐసియుకి తరలించి చికిత్స అందిస్తున్న హనుమకొండ మాజీ శాసనదభ్యులు ఎం. ధర్మా రావు ను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం ఆస్పత్రికి చేరుకొని అతడిని పరామర్శించడం జరిగింది.

ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ వైద్యులను అడిగి ధర్మారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ప్రజాభిప్రాయాలను గౌరవించాలని, అన్ని సందర్భాలలో మొండిపట్టు ధోరణి మంచిది కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టువిడుపు అనేది సర్వసాధారణం అని దత్తాత్రేయ పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
26 ఏప్రిల్ 2026



# వేసవిలో పిల్లలు జర జాగ్రత్త

## గద్వాల జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు

### తల్లిదండ్రులకు సీఐ శంకర్ సూచనలు

**రాజోలి, ఏప్రిల్ 24 (జనంసాక్షి) :** వేసవి వచ్చిందంటే చిన్నారుల్లో ఎక్కడలేని ఆనందం ఉంటుంది. ఏడాది పొడవునా బడిలో చదువుకుంటూ గడిపిన విద్యార్థులు సెలవుల్లో వారి ఉత్సాహంగా గడపాలని కోరుకుంటారు. ముఖ్యంగా పట్టణాల్లో చదివిన విద్యార్థులు తమ స్వగ్రామాలకు వచ్చి వేసవిని ఆశ్వాదిస్తారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. అయితే సెలవు రోజుల్లో చిన్నారులు చెరువులు, బావులు, ప్రాజెక్టుల్లో ఈత కొట్టాలని కోరకుంటూ ఉంటారు. అయితే జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రతిఏటా సరదాగా ఈతకు దిగుతున్న చిన్నారులు మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఈతపై అప్రమత్తంగా లేకుంటే తల్లిదండ్రులకు గుండె కోత తప్పదంటున్నారు నిపుణులు.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే**

ఈత రానివారు ఈతకు వెళ్లే ప్రతీ ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కచ్చితంగా మనిషి నీటిలో మునిగిపోకుండా మునగ, కలబంద కట్టెలను కట్టుకోవాలి. ఈత నేర్పిచాలనుకునేవారు ఈత రాని వారి నడుముకు తాడుకట్టి గట్టుపై ఒకరు ఉండి ఈత నేర్పించాలి. ఈతకు వెళ్లే వారు తప్పనిసరిగా తమ వెంట మునగ కట్టెలు, ఈత వచ్చిన వారిని వెంట తీసుకుని వెళ్లాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈత రాని వారిని ఈత నేర్చుకుంటున్న వారు ఒక కంట కనిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇటీవల జరిగిన ఘటనలు**

మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు సరదాగా ఊరికి సమీపంలోని ఓ బావి వద్దకు వెళ్లారు. బావిలో నీరు తక్కువగా ఉన్నాయని భావించి ఈత కోసం అందులోకి దిగారు. దీంతో ప్రమాదవశాత్తు ఓ బాలిక నీట మునిగి పోయింది. ఆమెను రక్షించే ప్రయత్నంలో ఒకరి తర్వాత ఒకరు నీట మునిగిపోయారు. మృతులంతా 10ఏళ్లలోపు వారే కావడం..అందులో నలుగురు చిన్నారులు ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో చిన్నారుల తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ములు మావనపాడు మండలం బోరవల్లికి గ్రామానికి వివాహ శుభకార్యానికి వచ్చారు. సరాదాగా గడిపేందుకు పిల్లలు కుటుంబ సభ్యులతో కృష్ణానదికి వెళ్లారు. నదిలో సరదాగా ఈత కొట్టేందుకు దిగిన నలుగురు చిన్నారులు, ఈత రాకపోవడంతో నీటిలోనే ప్రాణాలు కోల్పోయారు.



ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

> **పిల్లల పట్ల జాగ్రత్త వహించండి**
>
> వేసవి వేడితో పిల్లలు ఇళ్లలో చెప్పకుండా చెరువులు, కుంటలు, నది ప్రాంతాలకు వెళ్లి ఈత కొట్టేందుకు వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ముందస్తుగానే వారి కదిలికలపై ప్రత్యేక దృష్టి సారించండి. పిల్లలకు క్రీడలు, డ్రాయింగ్ తదితర వాటిపై నైపుణ్యత ప్రదర్శించి ప్రోత్సహించండి. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు ప్రమాదాలు జరిగితే పెద్దలను బాధ్యులుగా చేస్తాం.
>
> 
>
> **-శంకర్, శాంతినగర్ సీఐ**

# ప్రభుత్వ పథకాలు అమలు కావాలంటే.. జనాభా లెక్కలు కావాలి

- **జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలి : తహశీల్దార్ జయంత్ కుమార్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు అమలు కావాలంటే జనాభా లెక్కలు కావాలని,జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలని వేములవాడ తహశీల్దార్ జయంత్ కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనగణన జనాభా లెక్కల నమోదుకు ప్రజలు సహకరించాలని అలాగే స్వీయ గణన ద్వారా మీ పూర్తి సమాచారాన్ని ఆన్లైన్ చేసుకోవాలన్నారు. మన గ్రామం,మన రాష్ట్రం,మన దేశం,అభివృద్ధి చెందాలంటే ముందుగా జనాభా లెక్కల నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావాలని ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండి జనగణనకు సహకరించాలని కోరారు. నేటి నుండి మే 10 వరకు ఆన్లైన్ నమోదు కొనసాగుతుందని, స్వీయ గణన అనగా ఆన్లైన్‌లో మీకు సంబందించిన పూర్తి వివరాలను https://se.census.gov.in అనే వెబ్సైట్‌లో మిరే నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.ఆన్లైన్ లో జన గణన నమోదు చేసుకోవడం ద్వారా సమయం ఆదా అవుతుందన్నారు. మీ కుటుంబ వివరాలు, ఫోన్ నంబర్, జిల్లా, పట్టణం, గ్రామం, పిన్ కోడ్, వివరాలతో పాటు మీ ఇంటి వివరాలు,ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నంబర్ ఉపయోగించాలని అలాగే ఇంటి వద్ద లొకేషన్ ఆన్ చేసి అ స్థలంలో రెడ్ మార్క్ చేసిన అనంతరం సబ్మిట్ చేయాలని ఆ తర్వాత మీకు ఒక ఐడి నంబర్ వస్తుందని మీ ఇంటికి వచ్చే గణన అధికారికి ఎస్ఈ ఐడి చూపిస్తే అప్రూవ్ చేస్తారన్నారు.దేశ జనాభా లెక్కలు అంటే వట్టి లెక్కలు కావని మన అభివృద్ధికి పునాదని,భవిష్యత్ కు బంగారు దారి అన్నారు. జనాభా లెక్కల నమోదు వల్ల రేషన్ కార్డులు తొలగిపోతాయని ప్రభుత్వ పథకాలు రావనే భయ భ్రాంతులకు గురి కావద్దని సూచించారు.ప్రతి ఒక్కరూ అవగాహనతో జనాభా లెక్కల కార్యక్రమన్నీ విజయవంతం చేయాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట మండల సూపరిండెంట్ విజేందర్ రెడ్డి, ఎంఈఓ సదానందం, ఆర్ఐలు శ్రీనివాస్, శ్రీధర్, మండల అధికారులు పాల్గొన్నారు.

# రోహన్ హాస్పిటల్‌లో ఆడపిల్ల జన్మిస్తే ఉచిత ప్రసవం

- **రోహన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డా. ఎనమల్ల శ్రీదేవి, డా. ఎనమల్ల నరేష్**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** ప్రముఖ వైద్య సేవల సంస్థ రోహన్ హాస్పిటల్ అండ్ ఫెర్టిలిటీ సెంటర్ 24 ఏళ్ల విజయవంతమైన సేవలను పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, ఆడపిల్లల సంరక్షణ, గౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో 'దేవీ పుత్రిక' అనే వినూత్న సామాజిక పథకాన్ని శనివారం రోజు ఘనంగా ప్రారంభించించారు. శనివారం రోజు రోహన్ హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎ. నీరజ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి 'దేవీ పుత్రిక' లోగో, కరపత్రాన్ని ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.నరేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ ఎనమల్ల శ్రీదేవి, డాక్టర్ ఎనమల్ల నరేష్ మాట్లాడుతూ... 2026 ఏప్రిల్ 25 నుండి 2027 జూన్ 16 వరకు రోహన్ హాస్పిటల్‌లో ఆడపిల్ల జన్మిస్తే, అది సాధారణ ప్రసవం అయినా లేదా శస్త్రచికిత్స ద్వారా అయినా పూర్తి వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లల పట్ల ఇంకా కొనసాగుతున్న వివక్షను తొలగించాలనే ఉద్దేశంతో " బేటీ బచావో బేటీ పడావో" స్ఫూర్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. న్యాయాధికారి ఎ. నీరజ మాట్లాడుతూ... వ్యాపార వృద్ధి కోసం కాకుండా సామాజిక బాధ్యతతో ఆడపిల్ల పుడితే ఉచిత ప్రసవ సేవలు అందించడం అభినందనీయమని పేర్కొని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ బి.ఎన్. రావు మాట్లాడుతూ... సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వాలకే సవాల్‌గా ఉండగా, ఒక ప్రైవేట్ హాస్పిటల్ తమ వార్షికోత్సవ సందర్భంగా ఈ విధమైన సేవలను ప్రకటించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు డాక్టర్ ఎనమల్ల శ్రీదేవి, డాక్టర్ ఎనమల్ల నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, రోగులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# రాణిపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### రైతులకు అండగా ప్రభుత్వం: గంగుల కమలాకర్



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్ రాణిపురంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన గంగుల కమలాకర్, రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మధ్యవర్తుల సమస్య లేకుండా నేరుగా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని చెప్పారు.రాణిపురం ప్రాంత రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పంట అమ్మకాలలో పారదర్శకతను తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు పొందాలని పిలుపునిచ్చారు.

# "ఆర్టీసీ చరిత్రలో సువర్ణ అధ్యాయం"

- **దశాబ్దాల ఆర్టీసీ కార్మికుల కల నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం**
- **మాటలు చెప్పి మోసం చేసిన వాళ్లకు ఇది చెంపపెట్టు : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**
- **గత పాలకులు 10 ఏళ్లలో చేయలేనిది మేము రెండున్నర ఏళ్లలో చేసి చూపించాం : ఎమ్మెల్యే సత్యనారాయణ**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** రవాణా, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ. శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించిన సందర్భంగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను నెరవేరుస్తూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11% పీఆర్సీ ప్రకటించడంతో పాటు వారి అన్ని డిమాండ్లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చారిత్రాత్మక ఘట్టమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని హైదరాబాద్ లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకులు మాటలకే పరిమితమైతే, మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేతలతో చరిత్ర సృష్టించిందని, ఆర్టీసీ విలీనం,11% పీఆర్సీ, సంఘాల ఎన్నికలకు అనుమతి ఇవన్నీ కార్మిక పక్షపాత ప్రభుత్వానికి నిదర్శనమని దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందని కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆర్టీసీ కార్మికుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# గోదావరిఖని జనరల్ హాస్పిటల్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### సేవల మెరుగుదలకు ఆదేశాలు

**గోదావరిఖని :**గోదావరిఖని జనరల్ హాస్పిటల్ లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. శనివారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాల పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్తమాలజీ (కంటి) విభాగంలో కంటి ఆపరేషన్లు తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన అన్ని యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. కంటి పరీక్షలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు.డెంటల్ విభాగాన్ని పరిశీలించిన ఆయన ప్రస్తుతం రోజుకు సగటున 40 మంది మాత్రమే ఓపీకి వస్తున్నారని గమనించి, ఆ సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన పరికరాలను సమీకరించి సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ల్యాబ్ విభాగంలో పరీక్షలు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి నిర్వహణను పూర్తిగా సక్రమపరచాలని చెప్పారు. అన్ని సాఫ్ట్‌వేర్‌లను అప్డేట్ చేసి, పరీక్షల ఫలితాలను ఆలస్యం లేకుండా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాభాయ్, డాక్టర్ రాజు, ఆప్తమాలజిస్టు డాక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థ నూతన కో- ఆప్షన్ సభ్యుల ఎన్నిక - ప్రమాణ స్వీకారం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ నూతన కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఐదుగురు సభ్యులు నూతన కో-ఆప్షన్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పాటు నలుగురు బీఆర్ఎస్ సభ్యులు కూడ మద్దతు తెలుపుతూ...చేయి ఎత్తి బలపరచడంతో ఐదు స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. విజయం సాధించి కో-ఆప్షన్ సభ్యులు గా ఎన్నికైన కన్న కృష్ణ, చిగిరి వెంకటమ్మ, ఎలగందుల నందకుమార్, మైనారిటీ కోటాలో బల్బీర్ సింగ్, అఫీజాబేగంలు మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆద్వర్యంలో ప్రమాణ స్వీకారం చేసి, గెలుపు పత్రాలను అందించారు. గెలిచిన అభ్యర్థులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారతీయ జనతా పార్టీకి చెందిన 34 మంది పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా, బీఆర్ఎస్ కు చెందిన మరో నలుగురు సభ్యులు ఎన్నుకోవడంతో ఐదుగురు అభ్యర్థులకు 38ఓట్లు చొప్పున రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోరాటాలతోనే హక్కులు సాధించబడతాయి

### ఆత్మహత్యలు మార్గం కాదు

- **ఉద్యమంతో హక్కులు సాధించుకున్న టిజి ఆర్టిసి కార్మికులకు టియుజేఏసీ ఉద్యమాభివందనాలు**
- **టియు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి**

**ముషీరాబాద్, ఏప్రిల్ 25 (జనం సాక్షి):** ఆత్మహత్యలతో సమస్య పరిష్కారం కాదనీ, పోరాటాలతోనే హక్కులు నెరవేరబడతాయని మన కళ్ళ ముందు జరిగిన ఉద్యమాలు నిరూపిస్తున్నాయనీ, అదే నిజం మరోసారి రుజువైందని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నాలుగు రోజులుగా టిజిఆర్టిసి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు పోరాటం చేసిన తీరు గొప్పదనీ, కార్మిలు సమ్మె పోరాటం చేసి ప్రభుత్వం అనుసరించిన మొండి వైఖరిని దించారనీ అన్నారు. ఎన్నో సంవత్సరాల ఆర్టీసీ కార్మికుల డిమాండ్ నెరవేరిందనీ, ఆర్టీసీ కార్మికుల పోరాటం చరిత్రలో లిఖించబడుతుందన్నారు. ప్రభుత్వం సమస్య ఉత్పన్నం అయినప్పుడే పరిష్కారం చేయాలనీ, అలాకాకుండా మొండిగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ, ఆత్మహత్య చేసుకున్న కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకోవడానికి ముందుకు రావాలి, అప్పుడు మాత్రమే ప్రభుత్వంపై కార్మిక వర్గానికి నమ్మకం కలుగుతుందన్నారు.

# వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం.

**మల్లాపూర్ :** వ్యవసాయ సహకార సంఘం మల్లాపూర్ ఆధ్వర్యంలోని పీపీసీ మల్లాపూర్, శనివారం రోజున పీపీసీ కొత్తదాంరాజ్ పల్లి, పీపీసీ పాతదాంరాజ్పల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసి మల్లాపూర్ చైర్మన్ పుష్పలత నర్సయ్య ప్రారభించారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణా రావు,సంఘ ఆఫీసియల్ పర్సన్ ఇంచార్జి మోర పాక శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్‌లు, సొసైటీ కార్యదర్శి పాదం భూమేష్ రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు




# అడ్మిషన్లు హౌస్‌ఫుల్

## విద్యార్థులతో కిటకిటలాడుతున్న సర్కారు పాఠశాల

- **మూడు మీడియాల్లో బోధనతో ఆకర్షణ**
- **జిల్లాలో అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా గుర్తింపు**
- **సీసీ కెమెరాలతో భద్రతా చర్యలు**
- **గదుల కొరత, క్రీడా స్థలం లేక ఇబ్బందులు**

**కోరుట్ల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** జిల్లాలోని డివిజన్ కేంద్రం కోరుట్లలో గల బాలికల ఉన్నత పాఠశాల గతంలోని కో ఎడ్యుకేషన్ మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో మూడు మీడియంలో ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం విద్యను అందిస్తుంది. ఇందులో గత విద్యా సంవత్సరం 700 పైగా విద్యార్థులు ఉండగా ఆ సంఖ్య జిల్లాలోని అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలగా గుర్తింపు పొందింది. పాఠశాలలో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ వలన అడ్మిషన్స్ కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 618 విద్యార్థులు ఉండగా ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో 18 మంది విద్యార్థులు ఇప్పటికి ప్రవేశాలు పొందారు. వందమంది వరకు ప్రవేశాలు కోసం దరఖాస్తు చేస్తారని ఉపాధ్యాయులు అంచనా వేస్తున్నారు.ఒకే పాఠశాలలో మూడు మీడియాలకు కలిపి 27 మంది ఉపాధ్యాయులు ఉన్నారు ఇందులో క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్స్ సేవలు కూడా విద్యార్థులకు అందుతున్నాయి.

**విద్యార్థుల రక్షణ బాధ్యత..**

విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో పర్యవేక్షణ చర్యలను మరింత పటిష్టం చేస్తూ పాఠశాల యాజమాన్యం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల క్రమశిక్షణ, రక్షణలో ప్రతిక్షణం పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుంది. విద్యార్థులలో నైపుణ్యం కోసం ల్యాబ్ కలవు.నాయకత్వ లక్షణాలు పెంపొందించడం కోసం పాఠశాలలో మరిన్ని సౌకర్యాల కోసం ఈ పాఠశాలను పీఎం శ్రీ పథకానికి ఎంపిక చేయడం జరిగింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, వారానికి మూడు గుడ్లు, రెండు రోజులు రాగి జావా, పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేయడం జరుగుతుంది.

**దాతల సహాయం.**

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం కోసం పట్టణంలోని దాతలు ముందుకు వచ్చి లక్ష రూపాయల విలువైన నీటి శుద్ధి యంత్రాన్ని ఈ సంవత్సరం పాఠశాలలో చేయడం జరిగింది.

విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండడంతో తరగతి గదులు సరిపోక అసౌకర్యంగా మారడంతో గత ప్రభుత్వం మన ఊరు మన బస్తి పథకంలో భాగంగా ఏడు గదుల నిర్మాణం చేపట్టి మధ్యలోనే నిలిచిపోవడంతో గదుల సమస్య అలాగే మిగిలిపోయింది దీనిని త్వరగా పూర్తిచేస్తే విద్యార్థులకు ఏంతో సౌకర్యం ఉంటుందని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థుల శరీరక దృఢత్వం కూడా అవసరమని పాఠశాలకు వ్యాయమ ఉపాధ్యాయులను కేటాయించినప్పటికీ సరైన క్రీడ స్థలం లేకపోవడంతో తీవ్ర లోటుగా మారింది.

# జంగాలపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించాలి

### లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చర్యలు చేపట్టాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష




**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం (జంగాలపల్లి)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీతో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు.అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశించి, ఆ భూములను రెవెన్యూ శాఖకు కేటాయించి, ఆర్ఆర్ పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో ఆర్.డి.ఓ. గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఆటకట్టు

## పది రోజుల్లో 9 కేసులు..

- 14 మంది అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్టు



హైదరాబాద్ (జనంసాక్షి) : అమాయకులను ఆశ చూపి.. సాంకేతికతను ఆయుధంగా మలచుకుని కోట్లు కొల్లగొడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ ముఠాల గుట్టును సైబరాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఏప్రిల్ 15 నుంచి 24 వ తేదీ మధ్య కేవలం పది రోజుల వ్యవధిలోనే 9 కీలక కేసులను ఛేదించి, వివిధ రాష్ట్రాలకు చెందిన 14 మంది నిందితులను కటకటాల్లోకి నెట్టారు. నిందితుల నుంచి కీలక సమాచారాన్ని సేకరించడంతో పాటు, కోర్టు అనుమతితో 69 కేసులకు సంబంధించి బాధితులకు సుమారు రూ 1,14,90,586 తిరిగి అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ వివరాలను సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ వారంలో నమోదైన కేసుల్లో భారీ మోసాన్ని బట్టబయలు చేశారు.

నకిలీ ఏఐ ఆధారిత క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ...

నకా సొల్యూషన్స్ అనే నకిలీ ఏఐ ఆధారిత క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒక బాధితుడి నుంచి ఏకంగా రూ1,88,56,648 దోచుకుంది. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ద్వారా బాధితుడిని ఆకర్షించిన నేరగాళ్లు.. తాము క్రిప్టో నిపుణులమని నమ్మబలికారు. తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టించి, లాభాలు వస్తున్నట్లు నకిలీ డ్యాష్‌బోర్డులో చూపించారు. నమ్మకం కుదిరిన తర్వాత బాధితుడితో భారీ మొత్తంలో డిపాజిట్లు చేయించుకున్నారు. తీరా డబ్బు విత్‌డ్రా చేయబోగా.. పన్నులు,కన్వర్షన్ ఫీజుల పేరిట మరిన్ని లక్షలు వసూలు చేసి చివరకు మోసగించారు. ఈ కేసులో తెలంగాణకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహమాన్‌ను పోలీసులు అరెస్టుచేశారు. ఇతను కమీషన్ కోసం బ్యాంకు ఖాతాలను సృష్టించి, ఆ సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చి ప్రధాన నేరగాళ్లకు పంపుతున్నట్లు గుర్తించారు. మరో కేసులో 5 పైసా క్యాపిటల్ లిమిటెడ్ అనే ప్రముఖ సంస్థ పేరును వాడుకుని నిందితులు రూ 64.86 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా బాధితుడిని సంప్రదించి, ఐపీఓలు , బ్లాక్ ట్రేడ్స్‌లో భారీలాభాలు వస్తాయని నమ్మించారు. ఇందుకోసం ఒక నకిలీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, వర్చువల్‌గా భారీ లాభాలు కనిపిస్తున్నట్లు మాయ చేశారు. బాధితుడు డబ్బు విత్‌డ్రా చేయాలని ప్రయత్నించినప్పుడు కమీషన్ కట్టాలని వేధించారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన.. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్, షేక్ నిజాముద్దీన్, వెలగ వంశీకృష్ణలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు ఛేదించిన 9 కేసుల్లో ట్రేడింగ్ ఫ్రాడ్ 6 కేసులు అత్యధికంగా ఉండగా.. డిజిటల్ అరెస్టు,అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్, ఆన్‌లైన్ రిలేషన్‌షిప్ ఫ్రాడ్ కేసులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. పట్టుబడిన నేరగాళ్లు వివిధ రాష్ట్రాల్లో నెట్‌వర్క్‌ను విస్తరించి, ప్రజల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లు కొత్త దారుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండటమే దీనికి ప్రధాన విరుగుడని డీసీపీ సాయి మనోహర్ స్పష్టం చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్‌గ్రూపుల్లో వచ్చే భారీ లాభాల ఆశచూపే పెట్టుబడి ఆఫర్లను నమ్మొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే అన్ వెరిఫైడ్ ట్రేడింగ్ లింకులు లేదా యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దని ఆయన సూచించారు. అసలైన స్టాక్ బ్రోకర్లు ఎప్పుడూ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేయమని కోరరని, పెట్టుబడి పెట్టే ముందు సదరు సంస్థకు సెబీ గుర్తింపు ఉందో లేదో అధికారికంగా తనిఖీచేసుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లు అనుమానం వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా **www.cybercrime.gov.in** లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు సకాలంలో న్యాయం చేసేందుకు, పోగొట్టుకున్న సొమ్మును వెనక్కి ఇప్పించేందుకు సైబరాబాద్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## అంగన్వాడీలను ఆధునీకరించే దిశగా ప్రభుత్వం చర్యలు

### మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి




**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 25 (జనం సాక్షి):** అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునీకీకరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యాధునిక స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో నర్సాపూర్ వెల్దుర్తి రోడ్ లో ఉన్న సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ నందు నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు యూనిఫాం అందించారు. 1098 చైల్డ్ హెల్ప్ లైన్ పోస్టర్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా మరింత పారదర్శకంగా, ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేసే వీలు కలుగుతుందని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అంగన్వాడీ టీచర్లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

### హైదరాబాద్‌లో మాజీమంత్రి కారుమూరి విచారణ

**హైదరాబాద్, ఏప్రిల్25 (జనంసాక్షి) :** వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లో విచారించారు. నాలుగు గంటల పాటు కారుమూరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. కారుమూరిని ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు విచారించారు. మద్యం రవాణా టెండర్ల జారీలో కారుమూరి పాత్రపై సిట్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిట్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని విచారించామని తెలిపారు. ఆయన వయసు 60 సంవత్సరాలు పైనే ఉండటంతో చట్టప్రకారం ఆయన కోరిన చోటే విచారించామని వెల్లడించారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశామని సిట్ ఎస్పీ చెప్పుకొచ్చారు. విచారణకు ఆయన సహకరించారని.. అవసరమైతే మరోసారి విచారిస్తామని తెలిపారు. మద్యం రవాణా, టెండర్లు సబ్ కాంట్రాక్టుల అవకతవకల విషయంలో కారుమూరిపై, ఆయన కుమారుడిపై కేసు నమోదైందని చెప్పారు. మద్యం రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ. 200 నుంచి రూ. 250 కోట్ల వరకు గండి కొట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్‌ను సిట్ కార్యాలయంలోనే విచారిస్తామని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సిట్ ముందు ఆయన కుమారుడు విచారణకు హాజరు కావాలని సూచించారు. అనారోగ్య కారణాలతో సునీల్ సమయం కోరారని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిట్ ఎస్పీ పేర్కొన్నారు.

## త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్

- విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తాం
- ఎస్‌హెచ్‌జీ సమావేశంలో ప్రకటించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా సంఘ సభ్యుల్లో ఎవరూ నిరక్షరాస్యులుగా మిగలకుండా చర్యలు తీసుకుంటున్నామని, అక్షరజ్ఞానంతో పాటు వారి విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళా సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్స్ ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బి.ఆర్.కే భవన్‌లోని సెర్ప్ కార్యాలయంలో శనివారం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ తో కలిసి.. సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం, నూతన సభ్యుల చేరిక, 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం, సెర్ప్ అమలు చేస్తున్న పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో గత నెలలో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశాల వివరాలు, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సెర్ప్ కార్యక్రమాల అమలు, గ్రామ మహిళా సంఘ భవనాల నిర్మాణాల పురోగతి వంటి అంశాలపై సమీక్ష జరిగింది. నిర్మల్ జిల్లా వంద శాతం లోన్ రిపేమెంట్ చేయగా.. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగవ్వను మంత్రి సీతక్క సన్మానించి చీరతో సత్కరించారు. అన్ని జిల్లా సమాఖ్యలు గంగవ్వను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామ మహిళా సంఘ భవనాల నిర్మాణం యజ్ఞంలా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,227 గ్రామ మహిళా సంఘ భవనాలకు అనుమతులు మంజూరు కాగా, 5,239 భవనాల కోసం స్థలాల ఎంపిక పూర్తయి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తై ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులను అభినందించారు.

## సంస్కరణలకు ముందు..తరవాత దేశాన్ని అధ్యయనం చేశా

### ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ అవార్డు కార్యక్రమంలో చంద్రబాబు



**ముంబై, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** ఆర్థిక సంస్కరణలకు ముందు.. తర్వాత దేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశానని, సంస్కరణలకు అనుగుణంగానే విజన్ 2020 అమలు చేశామని ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు హైదరాబాద్ చూస్తున్న అభివృద్ధి ఫలాలు అవేనని అన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. ప్రముఖ మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ అందించే ప్రతిష్ఠాత్మక ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'పేదరికం నుంచి బయటపడేసేందుకు పీ4 తీసుకొచ్చాం. ఈ పథకం ఓ గేమ్ ఛేంజర్. లక్షమంది మార్గదర్శులు.. 10 లక్షల మందిని దత్తత తీసుకున్నారు. సమాజంలో లింగ సమానత్వం, మహిళా సాధికారత చాలా ముఖ్యం. అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థాయి దేశంగా మారుతుందని చంద్రబా బు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్ అని ప్రశంసించారు. టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు ద్వారా మరికొన్ని పెట్టుబడులు ఏపీకి వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఏపీలో అనుమతుల వేగాన్ని పారిశ్రామిక వేత్తలు గుర్తించాలని కోరారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.

## తండ్రి పిట్టల దొర..బిడ్డ పిట్టల దొరసాని

### కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి

### మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్లద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

## నర్సాపూర్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య యుద్ధ వాతావరణం


### మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే

### ఎమ్మెల్యేను సముదాయించిన జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్/ నర్సాపూర్ , ఏప్రిల్ 25 (జనం సాక్షి):** మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్ లో శనివారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం యుద్ధ వాతావరణాన్ని తలపించింది . బి ఆర్ ఎస్, కాంగ్రెస్ వర్గీయులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భౌతికదారులకు సిద్ధమయ్యారు . సభా వేదికపై మంత్రి, ఎమ్మెల్యే పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యేను సముదాయించగా... పోలీసులు బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయులను శాంతింపజేశారు. వివరాల్లోకి వెళ్ళితే నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్లో శనివారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. మొదటగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెక్కుల పంపిణీలో ఆలస్యం జరుగుతుందని, నర్సాపూర్ మున్సిపల్ కేంద్రంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డా యని విమర్శించారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద 2500 రూపాయలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిం చారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేశామని, ఇందుకు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి హాజరు కాలేక పోయిందన అనడంతో బీఆర్ఎస్ నాయకులు ఒక్క సారిగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేయడంతో కాంగ్రెస్ నాయకులు సైతం బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరువురి ఆందోళనతో సభ ఒకసారిగా వేడెక్కింది. అక్కడున్న పోలీసులు ఇరు పార్టీ కార్యకర్తలను నచ్చజెప్పే పనిలో నిమగ్నమయ్యారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సైతం మైకులలో పోటాపోటీగా మాట్లాడడంతో ఉద్రిక్తతకు దారితీసింది. ఇరు పార్టీల నాయకులు పరస్పరం గొడవకు దిగడంతో ఎక్కడ భౌతిక దాడులు చేసుకుంటారో నని లబ్ధిదారులు, అధికారులు కంగారు పడ్డారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రసంగాన్ని బీఆర్ఎస్ నాయకులు అడుగడుగునా అడ్డుకోవడంతో కాంగ్రెస్ నాయకులు కోపోద్రిగులయ్యారు. చివరకు ఇరు పార్టీ నాయకులు శాంతించడంతో చెక్కుల పంపిణీ పూర్తి చేశారు.

## పాతబస్తీలో ట్రాఫిక్ సమస్యకు చెక్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ పాతబస్తీలో నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ రద్దీ సమస్యకు చెక్ పెడుతూ..రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేశారు. ఈ క్రమంలో శాశ్వత పరిష్కారం చూపే దిశగా జీహెచ్ఎంసీ అధికారులు అడుగులు వేశారు. శనివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని ఛత్రినాక పాత పోలీస్ స్టేషన్ చౌరస్తా నుండి బోయిగూడ, కందికల్ గేట్ వరకు ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. హైడ్రా మరియు పోలీసు అధికారుల సహకారంతో బల్దియా సిబ్బంది జేసీబీలతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ తొలగింపు చర్యల్లో భాగంగా.. రోడ్డును ఆక్రమించి నిర్మించిన మెట్లు, ప్లాట్‌ఫామ్‌లు, అక్రమ షెడ్లను పూర్తిగా తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాల వెలుపలి భాగాలను సైతం తొలగించడంతో రోడ్డు ఒక్కసారిగా వెడల్పు గా మారింది. ఈ చర్యల వల్ల అటు వాహనదారులకు, ఇటు పాదచారులకు ఏళ్ల తరబడి ఉన్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించ డమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల యజమానులకు, దుకాణదారులకు ముందస్తు నోటీసులు ఇచ్చిన తర్వాతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. బాధితులు తమ డాక్యుమెంట్ల ప్రకారం సెట్ బ్యాక్ వదలాలని, అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయం

- విద్యార్థిని ఆత్మహత్య

**మెదక్, ఏప్రిల్25 (జనంసాక్షి) :** పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అన్న భయంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా కొత్తపల్లి తండాలో ఈ విషాద ఘటన జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి తండాకు చెందిన బానోత్ సాయిప్రియ (16) స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఈ ఏడాది జరిగిన పరీక్షలకు హాజరైంది. అయితే పరీక్షలు అయిపోయినప్పటి నుంచి ఫెయిల్ అవుతానేమో అని సాయిప్రియకు భయం పట్టుకుంది. దీంతో పరీక్షల అనంతరం దిగులుగా ఉండేది. ఇది గమనించి తల్లి ఆమెకు ధైర్యం చెప్పింది. ఫెయిల్ అయిన ఫర్వాలేదని చెప్పింది. అయినప్పటికీ సాయిప్రియ టెన్షన్ పడుతూనే ఉంది. ఈ క్రమంలోనే శుక్రవారం కుటుంబసభ్యులు ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇది గమనించిన సాయిప్రియ సోదరుడు తల్లికి చెప్పాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## ఏపీఎస్ ఆర్టీసీకి జాతీయ అవార్డు

- సాంకేతిక వినియోగంలో విశిష్ట గుర్తింపు

**విజయవాడ, ఏప్రిల్25 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మరో జాతీయ అవార్డ్ లభించింది. సాంకేతిక వినియోగంలో విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా పీఎస్ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్-2026 పురస్కారం దక్కింది. మెరుగైన ప్రజా రవాణా సహా డిజిటల్ సేవల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నందుకు గానూ ఈ అరుదైన గౌరవం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. హైదరాబాద్‌లో జరిగిన ఇండియా పీఎస్ఈ సమ్మిట్‌లో ఈ అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు సహా ఇతర అధికారులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. ఏపీఎస్ఆర్టీసీ ఇప్పటికే డిజిటల్ టికెటింగ్, కార్గో సేవల్లో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. ఇది ఆర్టీసీ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఊగా.. ఈ ఏడాది జనవరి 16న గవర్నెన్స్ నౌ - 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ ప్రదానోత్సవంలోనూ జాతీయ పురస్కారం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ప్రయాణికులకు డిజిటల్ సేవలను అందించినందుకు గానూ అవార్డ్ దక్కింది. ఢిల్లీలో నాడు జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ ఇంజినీర్(ఐటీ) వై.శ్రీనివాసరావు పురస్కారాన్ని అందుకున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370